

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



ఆదివారం | 12-10-2025 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 177 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, బహుళపక్షం, తిథి: షష్ఠి మ.2.17 తదుపరి సప్తమి, నక్షత్రం: మృగశిర మ.1.37 తదుపరి ఆర్ద్ర, వర్జ్యం: రా.9.36-11.07, దుర్ముహూర్తం: సా.4.18-5.05, అమృతఘడియలు: శేషం ఉ.6.55. రా.2.56-4.27, రాహుకాలం: సా.4.30-6.00, సూర్యోదయం: 6.11, సూర్యాస్తమయం: 5.51 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

వైద్యానికి శస్త్రచికిత్స!

..సంక్షేమం పేరిట హద్దులు మీరి ఖర్చులు చేస్తున్న ప్రస్తుత పరిస్థితులలో అన్నీ ప్రభుత్వమే నడపాలనుకోవడంలో అర్థం లేదు. ఇప్పుడున్న పరిస్థితుల్లో వైద్య విద్యను కాపాడుకోవాలన్నా, పేదలకు వైద్యం దూరం కాకూడదు అనుకున్నా ప్రభుత్వంతో ప్రైవేటు వ్యక్తులు చేతులు కలపక తప్పనిసరి. కోతికి కొబ్బరికాయ దొరికినట్టుగా ఏపీలో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్య విధానంలో (పీపీపీ) వైద్య కళాశాలల ఏర్పాటు వ్యవహారాన్ని ప్రతిపక్షం అందిపుచ్చుకుంది.

..ప్రజలందరికీ ఉచిత వైద్య విద్య, వైద్యం అనే విధానాన్ని అమలుచేసే పరిస్థితిలో మన ప్రభుత్వాలు లేవు. అలాగని పేద ప్రజలను గాలికి వదిలేయలేం కదా? ఈ నేపథ్యంలో మధ్యే మార్గంగా ఏదో ఒక విధానాన్ని రూపొందించుకోవాలి కదా? దేశంతో పాటు తెలుగునాట కూడా వైద్యుల కొరత ఉంది. ఈ కొరతను అధిగమించాలంటే మంచి వైద్యులను తయారుచేసే వైద్య కళాశాలలను ఏర్పాటు చేయవలసిందే.

..జగన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రభుత్వపరంగా 17 కళాశాలలను ఏర్పాటు చేయడానికి అనుమతులు పొందినా ఆయా కళాశాలల నిర్మాణాలనే పూర్తిచేయలేకపోయారు. కొన్ని కళాశాలల భవనాల నిర్మాణం పునాదుల స్థాయిలోనే ఆగిపోయింది. ఒకవేళ నిర్మాణాలు పూర్తయినా వాటి నిర్వహణ భారాన్ని ప్రభుత్వాలు భరించగలవా?

..వైద్య కళాశాలలను కూడా సరిగా నిర్వహించలేకపోతే అక్కడ విద్యను అభ్యసించే వైద్య విద్యార్థుల పరిస్థితి ఏమిటి? నాసిరకం వైద్యులను తయారుచేయడం అంటే ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడటమే కదా? పబ్లిక్-ప్రైవేటు భాగస్వామ్యంలో వైద్య కళాశాలలు ఏర్పాటు చేయడం అంటే వైద్యాన్ని, వైద్య విద్యను పేదలకు దూరం చేయడమే అని ప్రతిపక్ష రాజకీయ పార్టీలు విమర్శించవచ్చు గానీ అందులో వాస్తవం లేదు. వైద్య కళాశాలలకు అనుబంధంగా ఏర్పాటు చేసే ఆస్పత్రులలో ఎంత మంది ఎక్కువ రోగులకు వైద్యం చేస్తే అక్కడ చదువుకునే మెడికోలకు అంత మంచి విద్యను అందించడమే అవుతుంది.



..పేదలకు ఉచిత వైద్యాన్ని నిరాకరించకుండా ప్రభుత్వ ధనంతో ఏర్పాటైన భవనాలు, సౌకర్యాలను ఉపయోగించి స్తోమత ఉన్న వారి వద్ద ఫీజులు వసూలు చేయడం తప్పిదం కాదు కదా? అంతిమంగా ప్రజలు కోరుకొనేది నాణ్యమైన విద్య. పేదలకు కావల్సింది ఉచిత వైద్యం. ఈ రెండూ ఏక కాలంలో లభించినప్పుడు ఎవరికైనా అభ్యంతరాలెందుకు?

..చంద్రబాబు ప్రభుత్వం రెండు అంశాలపై దృష్టి సారించాలి. పబ్లిక్-ప్రైవేటు భాగస్వామ్యం వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించాలి. కొత్తగా ఏర్పాటు చేస్తున్న కళాశాలలను రాజకీయ కోణంలో చూడకుండా ప్రధాన నగరాల్లోనే ఏర్పాటు చేయాలి. అలా చేసినప్పుడే ఫ్యాకల్టీ లభిస్తారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో పనిచేసే ప్రముఖ డాక్టర్లు కూడా విధిగా బోధనకు కొంత సమయం కేటాయించాలన్న నిబంధననూ తేవాలి.

కొత్త పలుకు -ఆర్కే విశ్లేషణ 4లో

డీఏపై కుట్రలు

కరువు భత్యంపై సోషల్ మీడియాలో జగన్ బ్యాచ్ తప్పుడు ప్రచారాలు

- ఉద్యోగ సంఘాల ముసుగులో వేతన జీవుల ఉద్వేగంతో ఆట
- ప్రతి క్యాబినెట్ భేటీ ముందు 'డీఏ' ఇస్తున్నారని పోస్టులు
- సమావేశం తర్వాత విమర్శలు
- ఉద్యోగులకు, సర్కారుకు మధ్య అగాథం సృష్టించడమే లక్ష్యం
- ఉద్యోగులను రెచ్చగొట్టడమే టార్గెట్
- గత ప్రభుత్వ డీఏ బకాయి 7,500 కోట్లు చెల్లించిన కూటమి
- చేసింది చెప్పుకోని కూటమి నేతలు



కరువు భత్యం(డీఏ)పై వైసీపీ కుట్ర రాజకీయాలు చేస్తోంది. ప్రభుత్వానికి-ఉద్యోగులకు మధ్య అగాథం సృష్టించడమే లక్ష్యంగా కొన్ని ఉద్యోగ సంఘాల నేతల ముసుగులో సోషల్ మీడియాలో విషం చిమ్ముతోంది. ప్రతి మంత్రివర్గ సమావేశానికి ముందు 'డీఏ' ఇచ్చేస్తారని హడావుడి చేసి ఆశలు రేకెత్తిస్తోంది. భేటీ అనంతరం సర్కారు ఉసూరుమనిపించింది.. ఉద్యోగులను పట్టించుకోలేదంటూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం పరిపాటిగా మారింది. ఈ కుటిల పోస్టుల వెనుక ఉద్యోగులకు-ప్రభుత్వానికి మధ్య చిచ్చు పెట్టి రచ్చ చేయాలన్న వ్యూహం స్పష్టంగా కనిపిస్తోంది.

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల విషయంలో వైసీపీ విష రాజకీయాలకు తెరదీసింది. కొన్నాళ్లుగా కరువు భత్యం(డీఏ) కోసం ఎదురు చూస్తున్న వారిని రెచ్చగొట్టే చర్యలకు దిగుతోంది. వాస్తవానికి వైసీపీ పాలనలో నానా తిప్పలు పడిన ఉద్యోగులు.. గత ఎన్నికల్లో తమకు అనుకూలమైన ప్రభుత్వం వచ్చిందని, సకాలంలో అన్ని ప్రయోజనాలు నెరవేరుతాయన్న ఉద్దేశంతో ఉన్నారు. అయితే.. వీరిని ఏదో ఒకరకంగా రెచ్చగొట్టి సర్కారుకు-ఉద్యోగులకు మధ్య అగాథం సృష్టించేందుకు వైసీపీ కుటిల ప్రయత్నాలు చేస్తోంది. ప్రస్తుతం డీఏపై ఉద్యోగుల్లో చర్చ జరుగుతోంది. కొత్త ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు అయినా డీఏ ఇవ్వలేదన్న ఆవేదన వారిలో ఉంది. ఇదే అదునుగా ఉద్యోగ సంఘ నాయకుల ముసుగులో జగన్ బ్యాచ్ డీఏలపై కుట్రకు తెరతీసింది. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు మొదలుపెట్టి ఉద్యోగుల ఉద్వేగాలతో ఆడుకుంటోంది. సీఎం చంద్రబాబు నేతృత్వంలోని మంత్రివర్గం నెలకు రెండుసార్లు భేటీ అవుతోంది. అయితే, ప్రతి క్యాబినెట్ సమావేశం ముందు ఉద్యోగుల వాట్సాప్ గ్రూపులు, సోషల్ మీడియాలో డీఏ ఇస్తున్నారంటూ తప్పుడు పోస్టులు పెడుతున్నారు. దాన్ని చిలవలుపలవలుగా సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారు. క్యాబినెట్ సమావేశం అవగానే 'ఈ సమావేశంలోనూ డీఏ ఇవ్వలేదు.' అంటూ ఉద్యోగులను

మిగతా 13వ పేజీలో...



నెల్లూరులో ఏర్పాటు చేసిన స్మార్ట్ స్ట్రీట్ ప్రారంభోత్సవంలో వర్చువల్‌గా మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, అధికారులు

పేదలకు మెరుగైన వైద్యం కల్పించొద్దా?

- పీపీపీలో మెడికల్ కాలేజీలు నిర్మిస్తే తప్పేంటి?
- పాత విధానంలో నిర్మాణానికి 20 ఏళ్లు పడుతుంది
- అప్పటి వరకు పేదలు ఇబ్బంది పడాలా?
- పీపీపీతో రెండేళ్లలోనే నిర్మాణం పూర్తి
- మెడికల్ కాలేజీలపై వైసీపీ దుష్ప్రచారం
- గత ప్రభుత్వంలో నాసిరకం మద్యంతో 30 వేల మంది చనిపోయారు
- ఇప్పుడు నకిలీ అంటూ వైసీపీ శవరాజకీయాలు
- తప్పు చేసిన వాళ్లను వదలను.. సీఎం హెచ్చరిక
- వర్చువల్‌గా నెల్లూరు స్మార్ట్ స్ట్రీట్ బజార్ ప్రారంభం


నెల్లూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మెడికల్ కాలేజీలపై వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు మండిపడ్డారు. పీపీపీ విధానంలో కొత్తగా నిర్మిస్తున్న మెడికల్ కాలేజీల్లో నాణ్యమైన ఉచిత వైద్యం అందిస్తే వారికి అభ్యంతరం ఏమిటి? అంటూ నిలదీశారు. ఈ విధానాన్ని వ్యతిరేకిస్తున్న వ్యక్తులకు అనారోగ్యం వస్తే కార్పొరేట్ ఆస్పత్రులకు వెళ్తున్నారని, కానీ పేదలకు మాత్రం ఉచితంగా నాణ్యమైన వైద్యం వద్దా? అని

మిగతా 2వ పేజీలో...

ఆ నిర్ణయం ఖరీదు ₹300 కోట్లు!

ట్రాన్స్‌కో నిర్వాకంతో ఏటా ప్రభుత్వంపై భారం

- కాంట్రాక్టర్లకు లబ్ధి కలిగించేలా నిర్ణయం
- దుమ్ముదులిపి మరీ 2013 నాటి సీవోపీ ఉత్తర్వులు అమలు
- ఈ నిర్ణయంతో కాంట్రాక్టర్లకు అదనంగా 14% లబ్ధి
- ఎస్ఎస్ఆర్ ఆధారంగానే టెండర్ల మొత్తం నిర్ణయం
- మళ్లీ దానిపై అదనంగా చెల్లింపులపై విమర్శలు
- రాజధాని పరిధిలోనే 2 వేల కోట్ల విద్యుత్తు పనులు
- త్వరలో ప్రకాశంలో 1,382 కోట్ల పనులకు టెండర్లు
- ఈ కాంట్రాక్టర్లకు 'మేలు' చేసేందుకేనని ఆరోపణలు



విద్యుత్తు వినియోగదారులపై భారం తగ్గించాలని, ఈ దిశగా నిర్ణయాలు అమలు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు చెబుతున్నారు. మరోవైపు ఏపీ ట్రాన్స్‌కో ఏమో సీఎం సూచనలను బేఖాతరు చేస్తూ కాంట్రాక్టర్లకు లబ్ధి చేకూర్చేలా నిర్ణయం తీసుకుంది. ఆ నిర్ణయం ఖరీదు దాదాపు 300 కోట్ల రూపాయలు! విద్యుత్తు శాఖ అధికారుల నిర్వాకం వల్ల అది కూడా ఒకసారి కాదు.. రాష్ట్ర ప్రభుత్వంపై ఏటా ఈ మేరకు అదనపు భారం పడనుంది.

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఏపీ ట్రాన్స్‌కో అధికారులు తీసుకున్న నిర్ణయం వివాదాస్పదమవుతోంది. కాంట్రాక్టర్లకు లబ్ధికలిగేలా, ప్రభుత్వంపై భారం పడేలా 2013 నాటి కాంట్రాక్టర్స్ ఓవర్‌హెడ్స్ అండ్ ప్రాఫిట్స్ (సీవోపీ) ఉత్తర్వులను మళ్లీ అమలు చేయాలని నిర్ణయించారు. దీనిప్రకారం.. కాంట్రాక్టర్లకు అదనంగా 14 శాతం వరకు లబ్ధి చేకూరనుంది. ట్రాన్స్‌కో ఆధ్వర్యంలో ఏటా సుమారు రూ.3 వేల కోట్ల పనులకు టెండర్లు పిలుస్తుంటారు. ప్రస్తుతం రాజధాని పరిధిలోనే రూ.2 వేల కోట్ల వరకు విద్యుత్తు పనులు జరుగుతున్నాయి. ప్రకాశం జిల్లాలో త్వరలో 1382 కోట్ల పనులకు టెండర్లు పిలవనున్నారు. ఈ పనుల్లో

మిగతా 13వ పేజీలో...

సిఫీకి నేడే శ్రీకారం

- విశాఖలో లోకేశ్ చేతుల మీదుగా శంకుస్థాపన
- ఏఐ ఎడ్జ్ డేటా సెంటర్, కేబుల్ ల్యాండింగ్ స్టేషన్ ఏర్పాటు చేస్తున్న సిఫీ
- రెండేళ్లలో ఆపరేషన్లు ప్రారంభం

అమరావతి/విశాఖపట్నం, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో సిఫీ టెక్నాలజీస్ ఏర్పాటు చేస్తున్న ఏఐ ఎడ్జ్ డేటా సెంటర్, కేబుల్ ల్యాండింగ్ స్టేషన్‌కు మంత్రి లోకేశ్ ఆదివారం శంకుస్థాపన చేయనున్నారు. దేశంలో అత్యధికంగా డేటా సెంటర్లను నిర్వహిస్తున్న 'సిఫీ ఇన్ఫినిటీ స్పేసెస్ లిమిటెడ్' విశాఖపట్నంలో 550 మెగావాట్ల సామర్థ్యంతో సుమారు రూ.15 వేల కోట్లతో కొత్త డేటా సెంటర్ ఏర్పాటుకు ముందుకు వచ్చిన విషయం తెలిసిందే. ఇక్కడ డేటా సెంటర్ ఏర్పాటుకు 50 ఎకరాల భూమి కావాలని సిఫీ కోరగా రాష్ట్ర ప్రభుత్వం రెండు ప్రాంతాల్లో 28.6 ఎకరాలు కేటాయించింది. రుషికొండ ఐటీ పార్క్ హిల్ నంబరు 3పై 3.6 ఎకరాలు, అలాగే పరదేశిపాలెం సర్వే నంబరు 134లో మరో 25 ఎకరాలు కేటాయించింది. రుషికొండలో ఎకరా రూ. కోటి చొప్పున, పరదేశిపాలెంలో రూ. 50 లక్షల చొప్పున ఇచ్చారు. భూమి పూజ చేసినప్పటి నుంచి రెండేళ్లలో అంటే 2027 అక్టోబరు 12వ తేదీ నాటికి

మిగతా 3వ పేజీలో...



సూత్రధారి జనార్దనే!

వైసీపీ జమానాలోనే నకిలీ మద్యం

13

- 2023లో విచ్చలవిడిగా లిక్కర్ తయారీ.. ఇంజనీరింగ్ చదివి.. కిరాణా కొట్టుతో మొదలై
- మద్యం వ్యాపారంలోకి జనార్దన్‌రావు అడుగులు.. బెంగళూరు, ముంబై, ఢిల్లీల నుంచి స్పిరిట్
- హైదరాబాద్ నుంచి ఆర్టీసీ ద్వారా ఏపీకి సరఫరా.. ఫినాయిల్ సరఫరా పేరిట ఇన్వాయిస్‌లు
- అద్దేపల్లి రిమాండ్ రిపోర్టులో కీలక విషయాలు.. రిమాండ్ విధించిన విజయవాడ కోర్టు

రైతన్నకు ధనధాన్యం

- రూ.35,440 కోట్లతో 2 పథకాలకు మోదీ ప్రారంభం
- 11,440 కోట్లతో పప్పుధాన్యాల్లో ఆత్మనిర్భరత మిషన్ 13
- 24 వేల కోట్లతో ప్రధానమంత్రి ధన ధాన్య కృషి యోజన
- గోధుమ, వరిపైనే కాక పప్పులపైనా రైతులు దృష్టి పెట్టాలి
- సాగును కాంగ్రెస్ ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేశాయి: ప్రధాని





జగన్ జమానాలో సీఎంవో అరాచకాలకు ప్రత్యక్ష సాక్షిగా ఉన్న వివాదాస్పద ఐఏఎస్ అధికారి ప్రవీణ్ ప్రకాశ్‌తో

'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' ఎండీ వేమూరి రాధాకృష్ణ బిగ్ డిబేట్

ఈ రోజు రాత్రి 7 గంటలకు

పశ్చిమ బెంగాల్‌లో మరో ఘోరం

- ఒడిశాకు చెందిన వైద్య విద్యార్థిని గ్యాంగ్ రేప్
- ప్రైవేటు వైద్య కళాశాల సమీపంలోనే ఘటన
- స్నేహితుడితో కలిసి బయటకు వెళ్లగా దారుణం

14

రోహ్‌తక్ ఎస్పీపై వేటు

- బిజార్ణియాను బదిలీ చేసిన హరియాణా ప్రభుత్వం
- దళిత ఐపీఎస్ పూరన్ భార్యకు సోనియా లేఖ


బొత్సకు జగన్ నుంచే ప్రాణహాని


12

- ప్రతిపక్ష నేతగా ఫోకస్ అవుతున్నారనే!
- తన కన్నా ఎక్కువ పేరొస్తే జగన్‌కు నచ్చదు
- బొత్స కోరితే భద్రత కల్పిస్తాం: పల్లా

చైనాపై మరో 100%

సుంకాలు విధిస్తూ ట్రంప్ ప్రకటన 14



నెల్లూరులో స్మార్ట్ స్ట్రీట్‌ను ప్రారంభించి వర్చువల్‌గా మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

పేదలకు మెరుగైన వైద్యం కల్పించొద్దా?

(మొదటి పేజీ తరువాయి)

ప్రశ్నించారు. పేదలకు మెరుగైన వైద్య సేవలు వద్దు అన్న తీరుగా వైసీపీ వ్యవహరిస్తోందని విమర్శించారు. ముందు విధానంతో పోలిస్తే ప్రస్తుత విధానం ద్వారా 110 పది సీట్లు అదనంగా పేద విద్యార్థులకు దక్కుతాయని వివరించారు. ఆ కాలేజీల్లో నాణ్యమైన వైద్య సేవలు అందుతాయని చెప్పారు. గత పాలకులు అనుసరించిన విధానంతో మెడికల్ కాలేజీల కట్టడానికి కనీసం 20 ఏళ్ల పడుతుందని, అప్పటి వరకు పేదలు ఇబ్బందులు పడాలా? అని ప్రశ్నించారు. పీపీపీ విధానంలో రెండేళ్లలోనే మెడికల్ కాలేజీలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. తాను ఏ పని చేసినా పేదలను దృష్టిలో ఉంచుకునే చేస్తానని, ప్రజలకు విద్య, వైద్యంతో పాటు ఆదాయం పెరిగేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. నెల్లూరు నగరంలో నూతన టెక్నాలజీతో ఏర్పాటు చేసిన స్మార్ట్ స్ట్రీట్ బజార్‌ను సీఎం వర్చువల్‌గా శనివారం ప్రారంభించారు. 120 దుకాణాలను పేదలకు అందించి వారితోనూ వర్చువల్‌గా మాట్లాడారు. ప్రభుత్వ పనితీరును ఈ సందర్భంగా వివరించారు. ఆయన ఏమన్నారంటే.. "ఎవరు తప్పు చేసినా నేను చండశాసనుడిలా ఉంటా. ఎవరినీ వదిలిపెట్టను. నాసిరకం మద్యంతో 30 వేల మంది ప్రాణాలు పోయేందుకు కారణమైన వైసీపీ.. నేడు మద్యం పేరుతో శవ రాజకీయాలు చేస్తోంది. ఒక యజ్ఞంలా రాష్ట్రాభివృద్ధి కోసం పనిచేస్తుంటే దాన్ని డైవర్ట్ చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. గత ప్రభుత్వంలో విధ్వంసకర పాలన సాగింది. శాంతిభద్రతలు అదుపు తప్పాయి. మద్యం విషయంలో చాలా దారుణాలు జరిగాయి. గత ప్రభుత్వ నాసిరకం మద్యంపై విచారణ జరుగుతోంది. కేసులు నమోదవుతున్నాయి. ఇప్పుడు నకిలీ మద్యం తయారు చేస్తున్న వారిని పట్టుకున్నాం. వారు తెలుగుదేశం పార్టీకి చెందిన వారైనా కూడా రాజీ పడలేదు. తప్పు ఎవరు చేసినా తప్పే. పార్టీ నుంచి వారిని సస్పెండ్ చేసి కేసులు పెట్టాం. కఠిన చర్యలు తీసుకుంటున్నాం. అయినా వైసీపీ రాజకీయాలు చేయాలని చూస్తోంది. నీతి, నిజాయితీతో వ్యాపారం చేసుకుంటే ఎవరికీ అభ్యంతరం లేదు. గతంలో ఎక్కడ చూసినా గంజాయి, నాసిరకం మద్యంతో రాష్ట్రం అతలాకుతలమైంది. మగవాళ్ల ఆరోగ్యం దెబ్బతింది. ఆడవాళ్ల మంగళసూత్రాలు తెగిపోయిన సందర్భాలున్నాయి. ఆ పరిస్థితిని ఇప్పుడు ప్రక్షాళన చేస్తున్నాం. నకిలీ మద్యం అమ్మాలని చూసేవారికి అదే చివరి రోజు అవుతుంది. ఖబడ్దార్ జాగ్రత్త. ఆడబిడ్డల జోలికొస్తే అదే వారికి చివరి రోజు అవుతుంది.

నకిలీని అరికట్టేందుకు యాప్

నకిలీ మద్యాన్ని అరికట్టేందుకు ప్రత్యేక యాప్‌ను రూపొందిస్తున్నాం. ఆ యాప్ ద్వారా మద్యం బాటిల్ మీద ఉన్న హోలోగ్రామ్‌ను స్కాన్ చేసి ఆ మద్యాన్ని ఎవరు తయారు చేశారు.. ఎక్కడ తయారు చేశారన్నది తెలుసుకోవచ్చు. ఏ మద్యం బాటిల్ ఏ షాపులో విక్రయించాలన్నది కూడా త్వరలోనే నిర్ణయిస్తాం. కొంత మంది కావాలని శవ రాజకీయాలు చేస్తున్నారు. తండ్రి చనిపోతే కొన్నాళ్లు, బాబాయి చనిపోతే మరి కొన్నాళ్లు శవ రాజకీయాలు చేశారు. వారి హయాంలో నాసిరకం మద్యంతో ప్రజలు చనిపోయినా లెక్క చేయకుండా ముందుకెళ్లారు. ఇప్పుడు ఎవరూ చనిపోకపోయినా అసత్య ప్రచారం చేస్తున్నారు. తప్పుడు ప్రచారం చేస్తే తాట తీస్తాం. బురద చల్లి కడుక్కోమనడం మంచి పద్ధతి కాదు. నేను అందరి ఆనందం కోసం పనిచేస్తున్నాను. తప్పు చేయాలనుకున్న వారు ఆలోచన మార్చుకోవాలి.

ఇతర చోట్లా స్మార్ట్ స్ట్రీట్ బజార్లు

నెల్లూరులో నిర్మించిన స్మార్ట్ స్ట్రీట్ బజార్ చాలా వినూత్నమైనది. నిరుపేదలకు జీవనోపాధిని కల్పించే ఇటువంటి ప్రాజెక్టులను రాష్ట్రమంతా ఏర్పాటు చేస్తాం. త్వరలోనే అనంతపురం, కర్నూలు, శ్రీకాకుళం, విజయవాడ, గుంటూరు మున్సిపాలిటీల్లో వంద స్మార్ట్ షాపులు, విశాఖపట్నంలో 500 షాపులు ఏర్పాటు చేయబోతున్నాం. గత ప్రభుత్వం 10 లక్షల కోట్ల అప్పులు చేసి విధ్వంసం చేసింది. నేడు ఆ అప్పులు, వడ్డీలు కట్టడానికి సరిపోతోంది. అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం సహకారంతో ముందుకెళుతున్నాం. ఎన్నికల వేళ ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్నాం. ప్రతీ ఇంట్లో ఒక ఎంఎస్ఎంఈ పారిశ్రామిక వేత్తను తయారు చేయాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నాం. పోలవరం పనులు ముమ్మురంగా జరుగుతున్నాయి. 2027 నాటికి పూర్తి చేస్తాం" అని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో మంత్రి నారాయణతో పాటు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కలెక్టర్ హిమాన్షు శుక్లా, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



విలువలతోనే మీ 15 ఏళ్ల ప్రయాణం విజయవంతం

- ఏపీ అభ్యున్నతికి మీరు చేస్తున్న కృషి కొనసాగాలి
- సీఎం చంద్రబాబును ఫోన్‌లో అభినందించిన ప్రధాని

న్యూఢిల్లీ, అమరావతి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రిగా 15ఏళ్ల ప్రయాణాన్ని పూర్తి చేసుకున్న చంద్రబాబుకు ప్రధాని మోదీ శనివారం ఫోన్ చేసి అభినందనలు తెలిపారు. దూరదృష్టి, నిబద్ధత, విలువల వల్లే చంద్రబాబు రాజకీయ జీవితం విజయవంతమైందని పేర్కొన్నారు. తాము ఇరువురం సీఎంలుగా ఉన్న సమయంలో కలసి పనిచేశామని నాటి సంగతులను మోదీ గుర్తు చేసుకున్నారు. ఏపీ అభ్యున్నతికి చంద్రబాబు చేస్తున్న కృషి కొనసాగాలని, ప్రజాసంక్షేమ బాటలో అంకితభావంతో ఆయన చేస్తున్న కృషి మరింత ఫలప్రదం కావాలని మోదీ ఆకాంక్షించారు. దీనిపై స్పందించిన సీఎం.. స్వర్ణాంధ్ర లక్ష్యాన్ని ప్రధాని మోదీ సహకారంతో సాధిస్తామని చెప్పారు. గుజరాత్ సీఎంగా, ఆ తర్వాత ప్రధానిగా మోదీ 25 ఏళ్లుగా దేశానికి సేవలందిస్తున్నారని చంద్రబాబు కొనియాడారు.

వినూత్నం.. స్మార్ట్ స్ట్రీట్ బజార్

- ఆధునిక వసతులతో షాపుల నిర్మాణం
- వైఫై, మైక్ అనౌన్స్‌మెంట్, సోలార్ ప్యానళ్ల ఏర్పాటు
- నెల్లూరులో 8.40 కోట్లతో 200 షాపులు
- లబ్ధిదారులంతా మహిళలే

నెల్లూరు, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ స్ట్రీట్ బజార్.. ఈ పేరు వినడానికే కాదు.. రూపకల్పన కూడా కొత్తదే..! తక్కువ పెట్టుబడితో మెరుగైన వసతులు కల్పిస్తూ వ్యాపార దుకాణాలు ఏర్పాటు చేయడమే దీని ఉద్దేశం. ఈ వినూత్న ప్రాజెక్టుకు రాష్ట్రంలో తొలిసారిగా నెల్లూరులో శ్రీకారం చుట్టారు. రూ. 8.40 కోట్లతో 200 స్మార్ట్ దుకాణాలను ఏర్పాటు చేశారు. నగరంలోని మైపాడు గేటు సెంటర్ రోడ్డు వెంబడి వీటిని ఏర్పాటు చేశారు. ప్రత్యేకంగా తయారు చేసిన కంటైనర్లలో ఈ దుకాణాలు ఏర్పాటు చేశారు. దుకాణాల్లో సీసీ కెమెరాలతో పాటు, బజార్ మొత్తం మైక్ అనౌన్స్‌మెంట్ సౌకర్యం కల్పించారు. వ్యాపారస్తులకు విద్యుత్ ఖర్చు తగ్గించేందుకు కంటైనర్లపై భాగంలో సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేశారు. స్మార్ట్ బజార్ మొత్తం వైఫై సౌకర్యం కూడా కల్పించారు. ఒక్కో దుకాణం ఏర్పాటుకు రూ. 4 లక్షలు ఖర్చు అవ్వగా.. అందులో మెప్మా, నెల్లూరు మునిసిపల్ కార్పొరేషన్లు రూ. 2 లక్షలను సబ్సిడీగా లబ్ధిదారులకు అందిస్తున్నాయి. మిగిలిన రూ. 2 రెండు లక్షలు బ్యాంకు లోనుగా ఇప్పిస్తారు. అయితే అందులో రూ. లక్ష మంత్రి నారాయణ కుటుంబం పీ4 పథకం కింద లబ్ధిదారులకు అందిస్తోంది. ఇక కేవలం రూ.లక్ష మాత్రమే లబ్ధిదారుడు భరించాల్సి ఉంది. మొత్తం 200 దుకాణాలకు గానూ శనివారం సీఎం 120 దుకాణాలను ప్రారంభించారు. ఈ దుకాణాల కేటాయింపు కూడా పారదర్శకంగా జరిగింది. లబ్ధిదారులంతా మహిళలే కావడం విశేషం. వీరందరికీ వ్యాపారంలో శిక్షణ కూడా ఇచ్చారు. వీరిని చెన్నై బర్మా బజారుకు తీసుకెళ్లి వ్యాపారాలపై అవగాహన కల్పించారు. ఈ స్మార్ట్ స్ట్రీట్ బజారులో నిత్యావసర సరుకుల దుకాణాలు, జ్యూస్ షాపులు, ఫ్రూట్స్ వ్యాపారాలు, ఫొటో స్టూడియోలు, కూల్ డ్రింక్ షాపులు వంటి పలు రకాల వ్యాపారాలు ఉన్నాయి.


కాలుష్య నియంత్రణ మండలి సమీక్షలో డిప్యూటీ సీఎం పవన్, అధికారులు

పకడ్బందీగా కాలుష్య నియంత్రణ

- మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి 100 రోజుల ప్రణాళిక
- కాకినాడ తీరంలో తీసుకొనే చర్యలు దేశానికే మోడల్ కావాలి
- పీసీబీ సమీక్షలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాలు

అమరావతి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): పిఠాపురం నియోజకవర్గ పరిధిలోని తీర ప్రాంతంతో పాటు కాకినాడ జిల్లాలో పారిశ్రామిక కాలుష్య నియంత్రణకు పకడ్బందీ ప్రణాళిక రూపొందించాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశించారు. తీరప్రాంత కాలుష్యంపై రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి అధికారులతో శనివారం ఆయన మంగళగిరి క్యాంపు కార్యాలయంలో సమీక్షించారు. పారిశ్రామిక వ్యర్థాల నిర్వహణ, కాలుష్య నియంత్రణ మండలిలో సిబ్బంది కొరత, కాకినాడలో మత్స్యకారులతో 'మాటామంతి'లో వారు ప్రస్తావించిన సమస్యలు, ఇతర అంశాలపై చర్చించారు. ఉప్పాడ తీరంలో కాలుష్యంపై మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేసిన నేపథ్యంలో తక్షణమే అక్కడి పరిస్థితుల్ని అధ్యయనం చేసి, సమగ్ర నివేదిక ఇవ్వాలని పవన్ ఆదేశించారు. సమస్య ఉన్న పరిశ్రమల్లో పొల్యూషన్ ఆడిట్ నిర్వహించాలని సూచించారు. తీరప్రాంత మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి రోడ్ మ్యాప్‌ను సిద్ధం చేసి, 100 రోజుల ప్రణాళికలను తక్షణమే అమలు చేయాలన్నారు. కాకినాడ జిల్లా పరిధిలోని తీరప్రాంతంలో కాలుష్య నియంత్రణకు తీసుకునే చర్యలు దేశానికే మోడల్ కావాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ "తీరప్రాంతంలో పరిశ్రమల నుంచి వచ్చే రసాయన వ్యర్థాలు తమ జీవనోపాధిని దెబ్బతీస్తాయని మత్స్యకారులు ఆందోళనలో ఉన్నారు. సముద్రంలో కలిసే వ్యర్థాలపై పర్యవేక్షణలో పారదర్శకత ఉండాలి. పర్యవేక్షక బృందాల్లో విద్యావంతులైన స్థానిక మత్స్యకార యువతకు అవకాశం కల్పించాలి. కాలుష్య కారక పరిశ్రమల్లో ఎప్పటికప్పుడు సమీక్షించి, ట్రీట్‌మెంట్ ప్లాంట్లను ఆధునీకరించాలి. నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడంపై పారిశ్రామిక వేత్తలను సమాయత్తం చేయాలి' అని ఆదేశించారు. అవసరాలకు తగ్గట్టు సిబ్బంది నియామకంపై సీఎంతో చర్చిస్తానని, ఉన్న సిబ్బందిని సమర్థంగా వినియోగించాలని సూచించారు. ఈ సమీక్షలో పీసీబీ ఛైర్మన్ పీ కృష్ణయ్య, సభ్య కార్యదర్శి శరవణన్, పర్యావరణ ఇంజనీర్లు పాల్గొనగా, కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్, ఎస్పీ బిందుమాధవ్, మత్స్యకార ప్రతినిధులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు.

ఏఆర్ కానిస్టేబుల్‌పై ఎమ్మెల్యే వర్గీయుల దాడి

- ఎమ్మెల్యే అమిలినేని అల్లుడు.. అనుచరులు కొట్టారు
- ఫిర్యాదు చేస్తే.. సీఐ మమ్మల్నే బెదిరిస్తున్నారు
- ఏఆర్ కానిస్టేబుల్ హరినాథ్ దంపతుల ఆవేదన

అనంతపురం క్రైం, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అనుచరులు, ఆయన అల్లుడు తమపై దాడి చేశారని ఏఆర్ కానిస్టేబుల్ హరినాథ్, ఆయన భార్య సుజాత ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోయారు. అనంతపురం నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ వద్ద శనివారం వారు మీడియాతో మాట్లాడారు. 'రాంనగర్ 80 అడుగుల రోడ్డులోని ఎలైట్ అపార్టుమెంట్‌లో మేం ఉంటున్నాం. అదే అపార్ట్‌మెంట్‌లో ఎమ్మెల్యే అనుచరులు, అల్లుడు ఉంటున్నారు. ఇంటి వద్ద మా పిల్లలు ఆడుకుంటుంటే తరచూ గొడవ పడుతున్నారు. దీని గురించి ప్రశ్నించినందుకు నా భర్త హరినాథ్‌ను, ఆయన స్నేహితుడు ప్రభాకర్‌ను ఇంటి కొచ్చి కొట్టారు' అని సుజాత తెలిపారు. తాము వెంటనే పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేసినా... తమ ఫిర్యాదు తీసుకోవడం లేదని వాపోయారు. 'ఎమ్మెల్యే ప్రోద్బలంతో ఆయన అల్లుడు ధర్మతేజ, అనుచరులు అవినాశ్, సత్య మాపై దాడి చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేస్తే.. ఎమ్మెల్యే అనుచరులను పోలీసులు లోన కూర్చోబెట్టి.. మమ్మల్ని బయట నిలబెట్టారు' అని సుజాత కంటతడి పెట్టారు. పోలీస్ స్టేషన్‌లో కూడా సీఐ, ఎస్ఐ ఎదుటే ఎమ్మెల్యే అనుచరులు తమను కొట్టారని చెప్పారు. ఏఆర్ కానిస్టేబుల్ అయిన తనకే న్యాయం జరక్కపోతే ఎవరికి చెప్పుకోవాలని హరినాథ్ వాపోయారు. 'పోలీస్ స్టేషన్‌లోనే ఓ కానిస్టేబుల్‌పై దాడి చేస్తే చర్యలు తీసుకోరా?' అని కంటతడి పెట్టారు. దీనిపై వివరణ కోరేందుకు సీఐ జగదీష్‌కు ఫోన్ చేయగా, ఆయన స్పందించలేదు.


పాపికొండల బోట్ ఎక్కుతున్న పర్యాటకులు

పాపికొండల బోటు షికారు ప్రారంభం

- గోదావరి వరదల తగ్గుముఖంతో ఆరంభమైన సందడి

రాజమహేంద్రవరం,అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధి చెందిన పాపికొండల బోటు షికారు మూడు నెలల విరామం తరువాత శనివారం ప్రారంభమైంది. గోదావరి వరదల కారణంగా జూలైలో బోటు షికారుని ప్రభుత్వం నిలిపివేసింది. వరదలు తగ్గడంతో తిరిగి ఆరంభమయ్యాయి. పోలవరం ప్రాజెక్టు సమీపంలో గండిపోచమ్మ గుడి వద్ద నుంచి శనివారం ఒక బోటు వెళ్లింది. 23 మంది ప్రయాణించారు. తూర్పుగోదావరి జిల్లా గండిపోచమ్మ గుడి వద్ద నుంచి సుమారుగా 15 బోట్లు అందుబాటులో ఉన్నాయి. మెల్లగా పర్యాటకుల సందడి పెరుగుతుందని ఆపరేటర్లు చెపుతున్నారు. గండిపోచమ్మ ఆలయం నుంచి ఉదయం 10 గంటలకు ఈ బోటు షికారు మొదలవుతుంది. పేరంటాలపల్లి వరకూ వెళ్లి తిరిగి సాయంత్రం 5 గంటలకు గండిపోచమ్మ గుడివద్దకు వస్తుంది. రెండు వైపులా పాపికొండల అందాలు, గోదావరి వంపు సొంపులు, ప్రవాహం, పచ్చని ప్రాంతాలు కనువిందు చేస్తుంటాయి. ఆన్‌లైన్‌లో కూడా టికెట్లు బుక్ చేసుకోవచ్చు. రాజమండ్రి నుంచి వాహనాల్లో గండిపోచమ్మ గుడి వరకూ బోటు నిర్వాహకులు యాత్రికులను తీసుకెళతారు. పెద్దలకు రూ.1,250, పిల్లలకు రూ.1,000గా ధర నిర్ణయించారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం తినుబండారాలు ఈ ప్యాకేజ్‌లో ఉన్నాయి. నేరుగా గండిపోచమ్మ గుడి వద్ద కూడా బోటు ఎక్కవచ్చు. ఇదిలా ఉండగా రాజమండ్రి అఖండ గోదావరిలో మూడు హౌస్‌బోట్ల షికార్‌కు ప్రభుత్వం అనుమతించింది. రాజమండ్రి పుష్కర ఘాట్‌లో ఒకటి, సరస్వతీ ఘాట్‌లో ఒకటి, కొవ్వూరు గోష్పాద క్షేత్రంలో ఒకటి నడపనున్నారు.

తురకపాలెం మృతుల కుటుంబాలకు సాయం

- రూ.5 లక్షల చొప్పున 28 మందికి
- నేడు చెక్కులు ఇవ్వనున్న కేంద్ర మంత్రి పెమ్మసాని

గుంటూరు, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): మెలియాయిడోసిస్ వ్యాధి లక్షణాలతో గుంటూరు జిల్లా తురకపాలెం గ్రామంలో చనిపోయిన వ్యక్తుల కుటుంబాలను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకొచ్చింది. మృతుల్లో ఎక్కువమంది పేదలు కావడంతో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ చొరవ తీసుకొని ప్రభుత్వం తరుపున మృతుల కుటుంబాలకు సాయం ప్రకటించాలని సీఎం చంద్రబాబును అభ్యర్థించారు. దీనిపై సీఎం స్పందించి మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం మంజూరు చేశారు. దీంతో మొత్తం 28 మందికి రూ. కోటి 40 లక్షలను ఆదివారం కేంద్ర మంత్రి పెమ్మసాని, ఎమ్మెల్యే రామాంజనేయులు తురకపాలెంలో అందజేయనున్నారు.

బాణసంచా కర్మాగారంలో భారీ పేలుడు

» శివకాశిలో ఘటన.. నేలమట్టమైన ఓ గది

చెన్నై, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని విరుదునగర్ జిల్లా శివకాశి సమీపంలోని పెత్తాలుపట్టిలో ఉన్న ఓ బాణసంచా కర్మాగారంలో శనివారం మధ్యాహ్నం భారీ పేలుడు సంభవించింది. బాణసంచా తయారీ కోసం రసాయన పదార్థాల టిన్నులను భద్రపరిచిన గదిలో నిప్పురవ్వలు పడటం వల్ల ఈ ప్రమాదం జరిగింది. పేలుడుకు ఓ గది నేలమట్టమైంది. మంటలు అదుపు చేసేదుకు అగ్నిమాపక దళం మూడు ఫైరింజన్లతో తీవ్రంగా శ్రమించాయి.

దళితుల ఇళ్లకు జగన్ వెళ్లడు

» తన కారు కింద పడి చనిపోయిన సింగయ్య కుటుంబాన్నీ తన వద్దకే పిలిపించుకున్నాడు
» వారికి అవమానం జరిగినా స్పందించడు
» 'విగ్రహానికి' నిప్పు కుట్ర వైసీపీదే
» కులాలు, మతాల మధ్య చిచ్చు పెడుతున్నారు
» విద్వేషాలు రెచ్చగొడితే కఠినంగా శిక్షిస్తాం: హోం మంత్రి అనిత


అంబేడ్కర్ విగ్రహానికి ఎంపీ, ఎమ్మెల్యేలతో కలసి నివాళులర్పిస్తున్న హోం మంత్రి అనిత

చిత్తూరు, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): 'మాజీ సీఎం జగన్ దళితుల ఇళ్లకు వెళ్లడు. వాళ్లనే తన వద్దకు పిలిపించుకుంటాడు. దళితుడు సింగయ్య జగన్ కారు కింద పడి నలిగిపోతే అంబులెన్సులో ఎక్కించకుండా పక్కన పడేశారు. కుటుంబ సభ్యులను తన ఆఫీసుకు పిలిపించుకుని వారితో తప్పుడు ప్రకటనలు ఇప్పించారు. తన హయాంలో దళితులకు అన్యాయం జరిగినప్పుడు ఏనాడూ జగన్ స్పందించలేదు' అని హోం మంత్రి అనిత ధ్వజమెత్తారు. రాష్ట్రంలో కుల మత విద్వేషాలను రెచ్చగొట్టడమే వైసీపీ పనిగా పెట్టుకుందని వ్యాఖ్యానించారు. చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం దేవళంపేటలో రెండు వారాల క్రితం అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టి, దాన్ని టీడీపీ పైకి నెట్టి రాజకీయ లబ్ధి పొందాలని ప్రయత్నించిన వైసీపీ నాయకుల కుట్రను పోలీసులు ఛేదించిన విషయం తెలిసిందే. వైసీపీకి చెందిన సర్పంచ్‌ను ఈ కేసులో ప్రధాన నిందితుడిగా అరెస్టు చేసి జైలుకు పంపించారు. మరోవైపు అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన రోజు సాయంత్రమే ఎమ్మెల్యేలు థామస్, మురళీమోహన్ అక్కడ కొత్త విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో శనివారం హోం మంత్రి అనిత దేవళంపేటకు వచ్చారు. చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యేలు ఎంఎస్ రాజు, థామస్, మురళీమోహన్, విజయశ్రీలతో కలిసి అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. అక్కడే ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. 'ఇదే జీడీ నెల్లూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా చేసిన మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామికి వయసు పెరిగింది కానీ, బుద్ధి పెరగలేదు. ఆయన డిప్యూటీ సీఎంగా చేశారన్నా, నేను హోం మినిస్టర్‌గా పనిచేస్తున్నానన్నా అదంతా అంబేడ్కర్ భిక్షే. అలాంటి అంబేడ్కర్ విగ్రహాన్ని తగలబెట్టి టీడీపీ మీద నెపం వేసే ప్రయత్నం చేశారు. 15 ఏళ్లు సీఎంగా పని చేసిన ఏకైక వ్యక్తి చంద్రబాబు. అలాంటి నాయకుడిని అసెంబ్లీలో అవమానించినా శాంతియుతంగా ధర్నా చేశాం. వైసీపీ తరహాలో కులమత విద్వేషాలను రెచ్చగొట్టలేదు. వైసీపీ ప్రభుత్వంలో డాక్టర్ సుధాకర్‌కు గుండు కొట్టించినప్పుడు, దళిత డ్రైవర్‌ను చంపి డోర్ డెలివరీ చేసినప్పుడు అప్పటి సీఎం జగన్ నోరు విప్పలేదు. సీఎం కుర్చీలో కూర్చోవడానికి కోడి కత్తి డ్రామా ఆడి, శీను అనే దళిత యువకుడ్ని ఐదేళ్ల పాటు జైల్లో ఉంచారు. కులమత విద్వేషాలను రెచ్చగొడితే సీఎం చంద్రబాబు ఊరు కోరని చెప్పేందుకే ఇక్కడికి వచ్చాం. వైసీపీ నాయకులు గుళ్ల మీద, మసీదుల మీద, చర్చిల మీద రాజకీయం చేస్తున్నారు. కులాలు, మతాల మధ్య చిచ్చు పెడుతున్నారు. పిల్లల జీవితాలతో ఆటలాడుకుంటున్నారు. అన్నింటినీ అరికట్టేలా ప్రత్యేక చట్టాలను తెచ్చేందుకు సీఎం మాతో ఓ కమిటీ వేశారు. వివేకాకు గొడ్డలిపోటు నుంచి ఈ రోజు వరకు చేస్తున్న అన్ని ఘటనల్ని తిప్పి కొట్టే ప్రయత్నం చేస్తున్నాం. అన్నింటినీ అరికట్టేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తున్నాం. విద్వేషాలను రెచ్చగొడితే కఠినంగా శిక్షించేలా చూస్తాం' అని హెచ్చరించారు. జీడీ నెల్లూరు ఎమ్మెల్యే థామస్ మాట్లాడుతూ... 'వైసీపీ హయాంలో అనేక మంది దళితులకు అవమానాలు జరిగితే ఎస్సీ కోటాలో డిప్యూటీ సీఎం అయిన నారాయణస్వామి ఏనాడూ స్పందించలేదు. లిక్కర్ స్కాంలో కోట్లు దోచుకుని ఆయన, ఆయన కూతురు పంచుకున్నారు' అని ఆరోపించారు. ఎమ్మెల్యే ఎంఎస్ రాజు మాట్లాడుతూ... 'దేవళంపేటలో విగ్రహానికి నిప్పు అనేది స్థానికంగా రచించిన కుట్ర కాదు. తాడేపల్లి ప్యాలెస్‌లో ప్లాన్ చేసిన ఈ కుట్రలో స్థానిక వైసీపీ నాయకులు బలైపోయారు' అని అన్నారు. వైసీపీ ఇలాంటి చిల్లర పనులు మానుకోవాలని ఎమ్మెల్యే మురళీమోహన్ హెచ్చరించారు.

సిఫీకి నేడే శ్రీకారం

(మొదటి పేజీ తరువాయి)

డేటా సెంటర్ ఆపరేషన్‌లోకి తీసుకురావాలనే నిబంధనతో తక్కువ ధరకు భూములు కేటాయించారు. ఈ ప్రాజెక్టు కోసం 'సిఫీ టెక్నాలజీస్ లిమిటెడ్' పేరుతో అనుబంధ సంస్థను ఏర్పాటు చేసింది.

డేటా సెంటర్ల కేంద్రంగా విశాఖ

అదానీ, గూగుల్ అనుబంధ సంస్థ రైడెన్, సిఫీతో పాటు టీసీఎస్ కూడా డేటా సెంటర్ ఏర్పాటుకు ముందుకు వస్తుండటంతో డేటా సెంటర్ల హబ్‌గా విశాఖ మారుతోంది. ఆసియాలోనే అతిపెద్ద డేటా సెంటర్ కేంద్రంగా అవతరిస్తోంది. గూగుల్ అనుబంధ సంస్థ రైడెన్‌కు భూముల కేటాయింపునకు శుక్రవారం నాటి క్యాబినెట్ సమావేశం ఆమోదించింది. ఈనెల 14వ తేదీన ఢిల్లీలో కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్, ముఖ్యమంత్రి చంద్రబాబు, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి లోకేశ్ సమక్షంలో రైడెన్ అధికారిక ప్రకటన చేయనుంది. విశాఖలో అదానీ డేటా సెంటర్ ఏర్పాటుకు గతంలోనే అనుమతులు లభించాయి. ఇక ఇక్కడ ఏర్పాటవుతున్న డేటా సెంటర్లతో డేటా కేబుళ్లను అనుసంధానించడానికి సిఫీ టెక్నాలజీస్ సిద్ధమైంది. సిఫీ సముద్రగర్భ కేబుల్ కనెక్టివిటీతో రాష్ట్రంలో ఏఐ ఆధారిత సాంకేతిక విప్లవం రాబోతోందని ఐటీ రంగ నిపుణులు చెబుతున్నారు. కేబుల్ ల్యాండింగ్ స్టేషన్ వల్ల సముద్రపు కేబుల్ కనెక్టివిటీ మెరుగుపడి భారత్, ఆగ్నేయాసియా, ఆస్ట్రేలియా దేశాల మధ్య డేటా ప్రాసెసింగ్ వేగవంతం అవుతుందని వివరించారు. కాగా, సిఫీకి శంకుస్థాపన తరువాత మంత్రి లోకేశ్ ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో ఆస్ట్రేలియా- భారత్ జట్ల మధ్య జరిగే మహిళల వన్డే ప్రపంచ కప్ టోర్నీ క్రికెట్ మ్యాచ్‌ను తిలకిస్తారు.

21 తర్వాత అల్పపీడనం

» తుఫాన్‌గా బలపడే చాన్స్?.. భారీ వర్షసూచన

విశాఖపట్నం/అమరావతి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): దక్షిణ భారతంపైకి ఈ నెల 15వ తేదీ తర్వాత తూర్పు/ఈశాన్యగాలులు వీయనున్నాయి. దీంతో 16 లేదా 17న ఈశాన్య రుతుపవనాలు ప్రవేశించే అవకాశం ఉంది. దీంతో దీపావళికి కోస్తాంధ్ర, తమిళనాడులో వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ క్రమంలో మధ్య బంగాళాఖాతంలో ఈ నెల 21 తర్వాత అల్పపీడనం ఏర్పడనున్నదని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. అదే సమయంలో అరేబియా సముద్రంలో మరో అల్పపీడనం రానుందని పలు వాతావరణ మోడళ్లు చెబుతున్నాయి. కాగా ఉత్తరకోస్తా పరిసరాల్లో కొనసాగిన ఉపరితల ఆవర్తనం శనివారం నాటికి దక్షిణ కోస్తా పరిసరాల్లో ఆవరించింది. దీని ప్రభావంతో శనివారం కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల ఉరుములు, పిడుగులతో వర్షాలు కురిశాయి. ఆదివారం నుంచి మూడ్రోజులపాటు కోస్తా, రాయలసీమలో పలుచోట్ల వర్షాలు, అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ తెలిపింది.


శ్రీవారి మెట్టు మార్గంలో నడిచివస్తున్న జగేంద్ర, శశికిరణ్

కలత లేదు సోదరా.. నేను నీకు ఆసరా

» వైకల్యాన్ని మరిచి నడక మార్గాన వెంకన్న దర్శనానికి

తిరుమల, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): బెంగళూరుకు చెందిన జగేంద్ర చిన్నతనంలోనే చూపు కోల్పోయాడు. చేతికర్ర సాయంతో నడవడంలో ఇటీవల శిక్షణ తీసుకున్నాడు. ఈ సమయంలో 20శాతం మాత్రమే చూపున్న శశికిరణ్ అతనికి స్నేహితుడయ్యాడు. తిరుమల కొండకు నడిచి చేరుకోవాలనే తన చిరకాల కోరికను స్నేహితుడికి తెలిపాడు. ఇద్దరూ కలిసి శనివారం ఉదయం శ్రీవారిమెట్టు దారిలో కర్రలు తాటించుకుంటూ 2,400 మెట్లు ఎక్కి తిరుమలకు చేరుకున్నారు.

తాను లేకున్నా ఐదుగురికి పునర్జన్మ

» రోడ్డు ప్రమాదంలో జనసేన కార్యకర్త మృతి
» డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సూచనతో అవయవదానానికి అంగీకరించిన తల్లిదండ్రులు

రాజమహేంద్రవరం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): తాను మరణించి ఐదుగురికి పునర్జన్మ ఇచ్చిన ఓ జనసేన కార్యకర్త ఉదంతమిది. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సూచనతో అతని తల్లిదండ్రులు ఓ బాలుడికి గుండె ఇచ్చి ప్రాణం పోయడంతో పాటు, ఇతర అవయవాలు దానం చేశారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ఆవలోని వాంబే గృహాల్లో నివసించే పీతా విజయకృష్ణ(28) జనసేన కార్యకర్త. అతని తండ్రి శ్రీనివాస్ లారీ డ్రైవర్. తల్లి సుబ్బలక్ష్మి పక్షవాతంతో బాధపడుతోంది. ఈ నెల 6న రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన విజయకృష్ణ పరిస్థితి విషమించడంతో గుంటూరు కిమ్స్‌కు తరలించారు. వైద్యులు బ్రెయిన్ డెడ్ అని శనివారం ధ్రువీకరించడంతో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించి అవయవ దానం చేసేలా అతని తల్లిదండ్రులతో మాట్లాడే బాధ్యతను రాజమండ్రి జనసేన ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణకు అప్పగించారు. ఈ మేరకు ఆయన విజయకృష్ణ తల్లిదండ్రులను ఒప్పించారు.

ఆహార ధాన్యాల సాగు బాగు!

» పెరిగిన వరి, అపరాలు, చిరుధాన్యాల సాగు
» అన్నదాతను ఆదుకున్న జలాశయాలు
» వర్షాలు గతి తప్పి.. రైతుకు ఆటుపోట్లు
» పత్తి, వేరుశనగ, నూనెగింజల విస్తీర్ణం తగ్గుదల
» ఖరీఫ్ సీజన్‌లో మిశ్రమ ఫలితాలు

(అమరావతి, ఆంధ్రజ్యోతి)

ఖరీఫ్ సాగు ముగింపు దశకు వచ్చింది. వర్షాలు గతి తప్పి రాష్ట్రంలో ఈ సీజన్‌లో రైతులు అనేక ఆటుపోట్లను ఎదుర్కొన్నారు. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు ముందుగానే వచ్చినా నెలన్నర పాటు వర్షాలు సరిగ్గా కురవక, పంటల సాగు మందకొడిగా సాగింది. అయితే, జూలై 15 తర్వాత వర్షాలు కొంత ఆశాజనకంగా కురిశాయి. ఆగస్టు, సెప్టెంబరులో వరుస అల్పపీడనాలతో విస్తారంగా వర్షాలు పడ్డాయి. దీంతో ఖరీఫ్ సాగుపుంజుకుంది. మొత్తమ్మీద సాగులో మిశ్రమ ఫలితాలు కనిపించాయి!

కొన్ని జిల్లాల్లో వానలోటు..

రాష్ట్రవ్యాప్తంగా జూన్ 1 నుంచి ఇప్పటి వరకు 616.8 మిల్లీమీటర్ల సాధారణ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, 579 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. కోస్తాంధ్రలో 696.27 మిల్లీమీటర్లు 661.59 మిల్లీమీటర్లు, రాయలసీమలో 438.01 మిల్లీమీటర్లు 483.56 మిల్లీమీటర్ల వాన పడింది. రాష్ట్రంలో ఈ సీజన్‌లో సగటున 51 రోజులు వర్షాలు కురిశాయి. కొన్ని జిల్లాల్లో 20నుంచి 63రోజులు వానలు పడ్డాయి. గుంటూరు, కర్నూలు, చిత్తూరు జిల్లాల్లో అధిక వర్షపాతం నమోదైనా, ఇప్పటికీ కాకినాడ, కోనసీమ, తూర్పు, పశ్చిమగోదావరి, నెల్లూరు జిల్లాల్లో వానలోటు ఉంది. మిగతా జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా ఈ సీజన్‌లో 77.90 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగవుతాయన్న వ్యవసాయశాఖ అంచనాలో ఇప్పటికి 69.37 లక్షల ఎకరాలు సాగులో ఉన్నాయి. అయితే ఈ ఏడాది వరి, చిరుధాన్యాలు, అపరాల సాగు విస్తీర్ణం కొంత పెరిగింది. ఎగువ రాష్ట్రాల్లో కురిసిన వర్షాలకు కృష్ణా, గోదావరి, తుంగభద్ర, నాగావళి, వంశధార వంటి నదులకు వరదలు రావడంతో.. రాష్ట్రంలోని జలాశయాలు పూర్తిగా నిండాయి. జలాశయాల నుంచి ఆయకట్టుకు నీరు పుష్కలంగా విడుదల చేయడంతో వరి సాగు స్వల్పంగా పెరిగింది. ఎన్నడూ లేని విధంగా నెల్లూరు జిల్లాలో వరి విస్తీర్ణం రెండింతలు పెరిగింది. ఈ జిల్లాలో రబీ సీజన్‌లో వరి సాగు ఎక్కువగా జరుగుతుంది. కానీ కొన్ని ప్రాంతాల్లో సాగునీటి లభ్యతతో వరి సాగు పెరిగింది. అయితే రాయలసీమలో సాగయ్యే వేరుశనగ విస్తీర్ణం సగానికిపైగా తగ్గింది. దక్షిణకోస్తా, రాయలసీమలో ఎక్కువగా సాగయ్యే పత్తి విస్తీర్ణం కూడా కొంత తగ్గింది. ఈ ఏడాది వర్షాలు సకాలంలో కురవకపోవడం, కొన్ని చోట్ల చాలీచాలని వానల వల్ల మెట్ట పంటల విస్తీర్ణం తగ్గింది. ఆ మేరకు జలాశయాల నుంచి సాగునీరు పుష్కలంగా సరఫరా కావడంతో ఆహార ధాన్యాల పంటలు బాగా సాగయ్యాయి. ఈ సీజన్‌లో మిర్చి 4.90లక్షల ఎకరాల్లో సాగవుతుందని ఉద్యానశాఖ అంచనా వేసింది. ఇంకా మిరప మొక్కలు నాటుతున్నారు. కాగా, ఖరీఫ్‌లో వరి ధాన్యం ఎకరానికి 2,217.2కిలోల(29.56బస్తా) దిగుబడి వస్తుందని అర్థగణాంక శాఖ పంటల మొదటి ముందస్తు అంచనా నివేదికలో తెలిపింది.

ఖరీఫ్ సాగు వివరాలు(లక్షల ఎకరాల్లో)

పంట	అంచనా	వాస్తవసాగు
వరి	37.17	37.65
చిరుధాన్యాలు	4.97	5.87
అపరాలు	7.67	8.17
వేరుశనగ	12.42	4.87
నూనె గింజలు	1.45	1.27
పత్తి	13.20	11.00

విమానంలో పగిలిన అద్దం.. 76 మందికి తప్పిన ముప్పు

చెన్నై, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మదురై నుంచి శనివారం తెల్లవారుజామున చెన్నైకి బయల్దేరిన ఇండిగో విమానం ముందు వైపు అద్దం పగలడంతో కలకలం చోటుచేసుకుంది. చెన్నైకి 76 మంది ప్రయాణికులతో ఇండిగో విమానం బయల్దేరగా, ల్యాండింగ్‌కు ముందు విమానం విండ్ షీల్డ్‌లో పగుళ్లు కనిపించాయి. పైలట్ గమనించి విమానాశ్రయంలోని ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్‌కు సమాచారం అందించారు. దీంతో విమానాశ్రయంలో అన్ని ముందస్తు ఏర్పాట్లు సిద్ధం చేశారు. కొద్దిసేపయ్యాక ఆ విమానం సురక్షితంగా ల్యాండింగ్ అయింది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ



కొత్తపలుకు

▪ఆర్కే RK

ప్రజలందరికీ ఉచిత వైద్య విద్య, వైద్యం అనే విధానాన్ని అమలుచేసే పరిస్థితిలో మన ప్రభుత్వాలు లేవు. అలాగని పేద ప్రజలను గాలికి వదిలేయలేం కదా? ఈ నేపథ్యంలో మధ్యే మార్గంగా ఏదో ఒక విధానాన్ని రూపొందించుకోవాలి కదా? దేశంతో పాటు తెలుగునాట కూడా వైద్యుల కొరత ఉంది. ఈ కొరతను అధిగమించాలంటే మంచి వైద్యులను తయారుచేసే వైద్య కళాశాలలను ఏర్పాటు చేయవలసిందే. అయితే అవసరం మేరకు వైద్య కళాశాలలు నెలకొల్పి వాటిని నిర్వహించే స్థోమత ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలకు లేదు. ఈ కారణంగానే జగన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రభుత్వపరంగా 17 కళాశాలలను ఏర్పాటు చేయడానికి అనుమతులు పొందినా ఆయా కళాశాలల నిర్మాణాలను కూడా పూర్తిచేయలేకపోయారు. కొన్ని కళాశాలల భవనాల నిర్మాణం పునాదుల స్థాయిలోనే ఆగిపోయింది. ఒకవేళ నిర్మాణాలు పూర్తయినా వాటి నిర్వహణ భారాన్ని ప్రభుత్వాలు భరించగలవా?

వైద్యానికి శస్త్రచికిత్స!

కోతికి కొబ్బరికాయ దొరికినట్టుగా ఆంధ్రప్రదేశ్‌లో వైద్య కళాశాలల వ్యవహారాన్ని ప్రతిపక్షం అందిపుచ్చుకుంది. తాము ప్రభుత్వపరంగా వైద్య కళాశాలల ఏర్పాటుకు కేంద్రం నుంచి అనుమతులు తెస్తే ప్రస్తుత కూటమి ప్రభుత్వం వాటిని పబ్లిక్, ప్రైవేటు భాగస్వామ్యం పేరిట ప్రైవేటుపరం చేస్తోందని వైసీపీ కొన్ని రోజులుగా హడావిడి చేస్తోంది. పేదలకు వైద్యం అందకుండా చేస్తున్నారని విమర్శల వర్షం కురిపిస్తోంది. ప్రభుత్వం కూడా ఈ విషయంలో కొంత తొందరపాటు ప్రదర్శించింది. ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటు కావలసిన వైద్య కళాశాలలను ప్రభుత్వ ప్రైవేటు మోడల్‌లో నిర్మించాలన్న నిర్ణయం తీసుకునే ముందు అందుకు కారణాలను సహేతుకంగా వివరించకుండా హడావిడిగా నిర్ణయం తీసుకోవడంతో ప్రతిపక్షం చేతికి అస్త్రం లభించింది. ఈ విషయంలో ప్రభుత్వ నిర్ణయం సరైనదా? కాదా? అన్నది ఇప్పుడు పరిశీలిద్దాం. వైద్య కళాశాలల అవసరం ఏ మేరకు ఉంది? ఇబ్బడిముబ్బడిగా వైద్య కళాశాలలు ఏర్పాటు చేసుకుంటూ పోతే ఫ్యాకల్టీ పరిస్థితి ఏమిటి? వైద్య విద్యను బోధించే సిబ్బందిని సమకూర్చుకోకుండా కళాశాలలను ఏర్పాటు చేయడం సమర్థనీయమా? సంక్షేమం పేరిట బడ్జెట్‌లో సింహభాగం ఖర్చు చేస్తున్న ఈ రోజుల్లో ప్రభుత్వ రంగంలోనే వైద్య కళాశాలలు ఏర్పాటు చేసి, నిర్వహించడం సాధ్యమా? ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వ ఆధ్వర్యంలో పలు కళాశాలలు ఉన్నప్పటికీ ఉస్మానియా, గాంధీ వైద్య కళాశాలల్లోనే చేరడానికి విద్యార్థులు ఎందుకు పోటీ పడుతున్నారు? వంటి ప్రశ్నలకు సమాధానాలు అన్వేషించాలి. విద్య, వైద్య రంగాలపై ప్రభుత్వాలు భారీగా ఖర్చు చేస్తున్నప్పటికీ ప్రజలు ప్రైవేటు రంగం వైపే ఎందుకు ఆకర్షితులవుతున్నారన్నది కూడా కీలక ప్రశ్నగా ఉంది. కాలమాన పరిస్థితులను బట్టి ఆలోచనలు, విధానాలు మారుతుంటాయి. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో ప్రభుత్వ రంగమే దిక్కుగా ఉండేది. అందుబాటులో ఉన్న పరిమిత వనరులతోనే దేశ తొలి ప్రధాన మంత్రి జవహర్‌లాల్ నెహ్రూ పలు ప్రభుత్వ రంగ సంస్థలను ఏర్పాటు చేశారు. విద్యాసంస్థలను నెలకొల్పారు. ప్రభుత్వం వద్ద ఉన్న నిధులతోనే నీటి ప్రాజెక్టులను కూడా దశలవారీగా నిర్మించారు. పంచవర్ష ప్రణాళికలను రచించుకొని అమలు చేశారు. ఆ తర్వాత ఇందిరాగాంధీ కూడా దాదాపుగా ఇవే విధానాలను కొనసాగిస్తూ సంక్షేమంపై కూడా దృష్టి పెట్టారు. రాజభరణాలు రద్దు చేయడంతో పాటు ప్రైవేటు రంగంలో ఉన్న బ్యాంకులను జాతీయం చేశారు. ఇందిరాగాంధీ తదనంతరం ప్రపంచవ్యాప్తంగా పరిస్థితులు మారాయి. రక్షిత ఆర్థిక వ్యవస్థకు, ప్రభుత్వ రంగం అన్న వాదనకు కాలం చెల్లింది. పోటీతత్వం పెరగడంతో ప్రైవేటు రంగాన్ని ప్రోత్సహించక తప్పనిసరి పరిస్థితి ఏర్పడింది. ఒకప్పుడు బ్యాంకులను జాతీయం చేయగా, ఇప్పుడు ప్రైవేటు బ్యాంకులను ప్రోత్సహించే పరిస్థితి! అదే సమయంలో ప్రభుత్వ రంగంలో జవాబుదారీతనం లోపించింది. నెహ్రూ హయాంలో హైదరాబాద్‌లోని బాలానగర్ వద్ద ప్రభుత్వ ఆధ్వర్యంలో ఇండియన్ డ్రగ్స్ అండ్ ఫార్మాసూటికల్స్ సంస్థ (ఐడీపీఎల్) ఏర్పాటైంది. ప్రస్తుత ఫార్మా దిగ్గజాలైన మురళి, డాక్టర్ అంజిరెడ్డి, పార్థసారథి రెడ్డి, రాంప్రసాద్ రెడ్డి వంటి వారందరూ అందులో పనిచేసినవారే. ఐడీపీఎల్‌లో తమ పరిస్థితి ఎదుగూబొదుగూ లేకుండా ఉండటంతో అందులో పనిచేసిన పలువురు బయటకు వచ్చి సొంతంగా ఫార్మా కంపెనీలను ప్రారంభించి ఇవాళ కుబేరుల జాబితాలో చేరారు. ఐడీపీఎల్ మాత్రం చాలాకాలం క్రితమే మూతపడింది. ప్రభుత్వ రంగం అని పట్టుకొని వేళాడితే పరిస్థితి ఎలా ఉంటుందో చెప్పేందుకు ఈ సంస్థే నిదర్శనం. టెలికమ్యూనికేషన్ రంగాన్నే తీసుకుందాం. ఒకప్పుడు బీఎస్ఎన్ఎల్ మాత్రమే ఉండేది. అప్పుడు టెలిఫోన్ కనెక్షన్ కోసం నెలలు, సంవత్సరాలు వేచి చూడవలసి వచ్చేది. ఈ రంగంలోకి ప్రైవేటు సంస్థలు ప్రవేశించడంతో పరిస్థితిలో ఎంత వేగవంతమైన మార్పు వచ్చిందో చూస్తున్నాం. ఫోన్ కనెక్షన్ల కోసం మన చుట్టూ తిరుగుతున్నారు. ఏ రంగంలోనైనా మార్పునకు శ్రీకారం చుట్టినప్పుడు వ్యతిరేకత రావడం సహజం. మార్పు వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరిస్తే అర్థం చేసుకుంటారు. టెలికమ్యూనికేషన్ రంగాన్ని ప్రైవేటుపరం చేసినప్పుడు కమ్యూనిస్టు పార్టీలు తీవ్రంగా వ్యతిరేకించాయి. ఈ రంగంలో బీఎస్ఎన్ఎల్ మాత్రమే ఉండాలని పట్టుబట్టాయి. ఇప్పుడు వెనక్కి తిరిగి చూసుకుంటే నాటి మార్పును వ్యతిరేకించిన కమ్యూనిస్టు పార్టీలే దేశంలో బలహీనపడ్డాయి. ప్రైవేటు రంగంలోని టెలికాం కంపెనీలు దూసుకుపోతున్నాయి. ప్రజలకు కూడా సౌకర్యాలు మెరుగయ్యాయి. గుత్తాధిపత్యానికి తావు లేకుండా చేయగలిగితే పోటీతత్వం వల్ల ప్రజలకు మేలే జరుగుతుంది. విద్యా రంగంలో కూడా పోటీతత్వం పెరిగింది. తమ పిల్లలను పేరొందిన ప్రైవేటు విద్యా సంస్థల్లో చేర్చడానికే ప్రజలు ఉత్సుకత చూపిస్తున్నారు. ఇవాళ ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు బడుగు బలహీన వర్గాల పిల్లలకే పరిమితం అవుతున్నాయి. నిజానికి ప్రైవేటు రంగంలోని పాఠశాలల్లో ఇరుకు గదుల్లో చదువు చెబుతున్నారు. ప్రభుత్వ పాఠశాలలకు విశాలమైన క్రీడా మైదానాలు కూడా ఉంటాయి. అధిక జీతాలతో ఉపాధ్యాయులను నియమిస్తున్నారు. అయినా ప్రజలకు ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం లేకపోవడానికి కారణం ఏమిటి? ప్రభుత్వ రంగంలో జవాబుదారీతనం లోపించడం ప్రధాన కారణం. విద్య, వైద్య రంగాలపై వేల కోట్లు ఖర్చు చేస్తున్నప్పటికీ ప్రజల్లో విశ్వాసం కలగడం లేదు. అరకొర సౌకర్యాలే ఉన్నప్పటికీ ప్రైవేటు సంస్థల వైపే ప్రజలు మొగ్గు చూపుతున్నారు. స్వాతంత్ర్యం వచ్చిన కొత్తలో ప్రభుత్వ రంగాన్ని ప్రోత్సహించడమే సరైన నిర్ణయం. మారిన పరిస్థితులలో ప్రైవేటు రంగాన్ని ప్రోత్సహించవలసి వచ్చింది. ఇప్పటి పరిస్థితులకు పబ్లిక్–ప్రైవేటు భాగస్వామ్యమే సరైనది. కేంద్ర ప్రభుత్వం పెట్టుబడుల ఉపసంహరణ పేరిట నెహ్రూ హయాంలో ఏర్పాటైన ప్రభుత్వ రంగ సంస్థలలో వాటాలను విక్రయిస్తున్నది. దీన్ని విమర్శించే వారు ఉన్నప్పటికీ ప్రజలు పట్టించుకోవడం లేదు. ఈ నిర్ణయం ప్రభావం రాజకీయాలపై కూడా కనబడటం లేదు.

కాలంతో మారాల్సిందే!

మెరుగైన విద్య, వైద్యం ఇతర సౌకర్యాల కోసం శక్తికి మించి అప్పులు చేసి అయినా ఖర్చు చేయడానికి ప్రజలు కూడా సిద్ధపడుతున్నారు. ప్రపంచీకరణ కారణంగా పోటీతత్వం పెరిగింది. ప్రభుత్వ రంగమైనా, ప్రైవేటు రంగమైనా పోటీ పడక తప్పని పరిస్థితి. పోటీ పడలేని ప్రైవేటు సంస్థలు కూడా కనుమరుగవుతున్నాయి. బూజు పట్టిన సిద్ధాంతాలు, కాలం చెల్లిన విధానాలకు ఇప్పుడు చోటు లేదు. విద్య, వైద్య రంగాలలో కూడా ప్రభుత్వ సంస్థలు ప్రైవేటు రంగంతో పోటీ పడాల్సిందే. విశ్వవిద్యాలయాలనే తీసుకుందాం. ఒకప్పుడు ఉస్మానియా, ఆంధ్రా యూనివర్సిటీలకు ఎంతో పేరుండేది. కాలక్రమేణా అవి తమ ప్రతిష్ఠను కోల్పోయాయి. ప్రైవేటు రంగంలో ఏర్పాటైన యూనివర్సిటీలతో పోటీ పడలేక సతమతమవుతున్నాయి. ఇప్పుడు హైదరాబాద్‌లో పలు ప్రైవేటు ఆస్పత్రులను విజయవంతంగా నిర్వహిస్తున్న డాక్టర్లు ఒకప్పుడు ప్రభుత్వ ఆధ్వర్యంలోని నిమ్స్‌లో పనిచేసినవారే. అక్కడ తమకు ఎదుగూబొదుగూ ఉండదని భావించి బయటకు వెళ్లిపోయి సొంత ఆస్పత్రులు ఏర్పాటుచేసుకున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాలలో పేరొందిన పలు ప్రభుత్వ ఆస్పత్రులు ఉన్నాయి. ఒకప్పుడు ప్రజలకు అవే దిక్కుగా ఉండేవి. ప్రజలకు కూడా వాటిపై విశ్వాసం ఉండేది. కాలక్రమంలో ప్రభుత్వ ఆస్పత్రులపై ప్రజల్లో నమ్మకం పోతూ వచ్చింది. 'నేను రాను బిడ్డో సర్కారు దవాఖానాకు..' అని సినిమా పాటలు కూడా వచ్చాయి అంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. పేదలు కూడా తమ శక్తికి మించినదైనా ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకోవడానికే మొగ్గు చూపుతున్నారు. అలా అని ప్రభుత్వ ఆస్పత్రుల్లో మంచి వైద్యులు ఉండటం లేదా? సౌకర్యాలు సరిగా లేవా? అంటే అదేమీ కాదు. సిబ్బందిలో జవాబుదారీతనం లోపించడమే ప్రధాన కారణం. అరకొర సౌకర్యాలు ఉన్న ప్రైవేటు ఆస్పత్రులు కూడా బాగానే నడుస్తున్నాయి. అన్ని సౌకర్యాలు ఉన్నప్పటికీ ప్రభుత్వ ఆస్పత్రులు ప్రజల్లో విశ్వాసం ఎందుకు కల్పించలేకపోతున్నాయో ఆత్మపరిశీలన అవసరం. వైద్య విద్య విషయమే తీసుకుందాం. తెలుగునాట ఇటీవలి కాలంలో ప్రైవేటు రంగంలో పలు వైద్య కళాశాలలు ఏర్పాటయ్యాయి. ఇందులో కొన్ని గ్రామీణ ప్రాంతాలలో ఏర్పాటయ్యాయి. అయితే మిగతా రంగాలలో వలె కాకుండా వైద్య రంగంలో ప్రైవేటు వైద్య కళాశాలలు ప్రభుత్వ రంగంలోని కళాశాలలతో పోటీ పడలేకపోతున్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలోని ప్రైవేటు కళాశాలలలో చేరడానికి వైద్య విద్యార్థులు ఇష్టపడటం లేదు.

> **విద్య, వైద్య రంగాలపై వేల కోట్లు ఖర్చు చేస్తున్నప్పటికీ ప్రజల్లో విశ్వాసం కలగడం లేదు. అరకొర సౌకర్యాలే ఉన్నప్పటికీ ప్రైవేటు సంస్థల వైపే ప్రజలు మొగ్గు చూపుతున్నారు. స్వాతంత్ర్యం వచ్చిన కొత్తలో ప్రభుత్వ రంగాన్ని ప్రోత్సహించడమే సరైన నిర్ణయం. మారిన పరిస్థితులలో ప్రైవేటు రంగాన్ని ప్రోత్సహించవలసి వచ్చింది. ఇప్పటి పరిస్థితులకు పబ్లిక్–ప్రైవేటు భాగస్వామ్యమే సరైనది.**

ఇందుకు ప్రధాన కారణం ఆయా కళాశాలల్లో ఫ్యాకల్టీ సరిగా లేకపోవడమే. గతంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటైన వైద్య కళాశాలలు అన్నీ ప్రధాన పట్టణాలు, నగరాలలోనే ఉన్నాయి. ఈ కారణంగా ఆ కళాశాలలకు ఫ్యాకల్టీ ఇబ్బంది రాలేదు. ఆస్పత్రులైనా, కళాశాలలైనా నిపుణులైన ఫ్యాకల్టీ ఉన్నప్పుడే వాటిపై ప్రజలకు నమ్మకం కలుగుతుంది. పేరొందిన డాక్టర్లతోనే వైద్యం చేయించుకోవాలని ఎవరైనా కోరుకుంటారు. అలానే సరైన ఫ్యాకల్టీ ఉన్న వైద్య కళాశాలల్లో చేరడానికే విద్యార్థులు ఆసక్తి చూపుతారు. రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తీసుకువచ్చిన ఫీజుల చెల్లింపు పథకం ఫలితంగా ఇంజనీరింగ్ కళాశాలలు పుట్టగొడుగుల్లా ఏర్పడ్డాయి. ఫలితంగా రెండు రకాలుగా నష్టం జరిగింది. ఇంజనీరింగ్ విద్య నాణ్యత దెబ్బతింది. ఆయా కళాశాలలు మూతపడ్డాయి. సరైన బోధనా సిబ్బంది లేనప్పుడు ప్రైవేటు కళాశాల అయినా పిల్లలు ఎందుకు చేరతారు? నాణ్యతలేని ఇంజనీరింగ్ విద్యను అభ్యసించిన వేలు, లక్షల మంది ఇంజనీరింగ్ పట్టభద్రులు నిరుద్యోగులుగా మన కళ్ల ముందే కనిపిస్తున్నారు. ఇంజనీరింగ్ విద్యతో పోలిస్తే వైద్య విద్యలో ఫ్యాకల్టీ ప్రాధాన్యం అధికంగా ఉంటుంది. వైద్య విద్యలో నిష్ణాతులైన వారు గ్రామీణ ప్రాంతాలకు వెళ్లి బోధించడానికి ఇష్టపడటం లేదు. ఫలితంగా ప్రైవేటు వైద్య కళాశాలలు కూడా మూతపడే స్థితికి చేరుకుంటున్నాయి. నీట్ పరీక్షల్లో అర్హత పొందినవారు తమ ప్రథమ ప్రాధాన్యంగా ఉస్మానియా, గాంధీ వైద్య కళాశాలలనే ఎంచుకుంటున్నారు. మిగతా ప్రభుత్వ కళాశాలలను ఎందుకు ప్రాధాన్యంగా ఎంచుకోవడం లేదంటే కారణం ఉంది. ఏ వైద్య కళాశాలపైన అయినా విద్యార్థులకు నమ్మకం ఏర్పడాలంటే ఫ్యాకల్టీతో పాటు రోగుల తాకిడి కూడా ఉండాలి. రోగుల సంఖ్య అధికంగా ఉన్నప్పుడే కదా విద్యార్థులు నేర్చుకోగలిగేది. మిగతా రంగాలతో పోల్చితే వైద్య రంగం భిన్నమైనది. వైద్య రంగంలో ప్రైవేటు రంగమే సూపర్ అని చెప్పలేని పరిస్థితి. ప్రైవేటు వైద్య కళాశాలలు వెలవెలబోతుండటం తెలిసిందే. ప్రైవేటు ఆస్పత్రులలో రోగులను ఫీజుల పేరుతో వేధిస్తున్నారన్న అభిప్రాయం ఉండనే ఉంది. అలా అని అన్ని ప్రభుత్వ కళాశాలలు, ఆస్పత్రులు గొప్పగా ఉన్నాయా అంటే అదీ లేదు. ఆరోగ్యశ్రీ, ఎన్టీఆర్ వైద్య సేవ పథకాల అమలుకు రెండు రాష్ట్ర ప్రభుత్వాలు ఏటా వందలు, వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నాయి. ఈ పథకం కింద వైద్యం చేయించుకుంటున్నవారు ప్రైవేటు ఆస్పత్రులకే వెళుతున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో తగిన సౌకర్యాలు, వైద్యం అందుబాటులో ఉన్నప్పటికీ రోగులు వెళ్లడం లేదు. ఈ కారణంగా ఈ నిధులు ప్రభుత్వ ఆస్పత్రులకు దక్కడం లేదు.

ఏ విధానం గొప్ప?

ప్రపంచ దేశాలలో మెరుగైన వైద్య విధానం ఏ దేశంలో ఉంది? అని ఒక సందర్భంలో డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డిని నేను అడిగాను. "ఫలానా దేశం అనుసరిస్తున్న విధానం సరైనదని చెప్పలేం. ఒక్కో దేశంలో ఒక్కో లోపం ఉంది" అని ఆయన బదులిచ్చారు. ఈ నేపథ్యంలో మనం ఎటువంటి విధానాన్ని ఎంచుకోవాలి? అన్న దానిపై దృష్టి పెట్టాలి కదా! ప్రజలందరికీ ఉచిత వైద్య విద్య, వైద్యం అనే విధానాన్ని అమలుచేసే పరిస్థితిలో మన ప్రభుత్వాలు లేవు. అలాగని పేద ప్రజలను గాలికి వదిలేయలేం కదా? ఈ నేపథ్యంలో మధ్యే మార్గంగా ఏదో ఒక విధానాన్ని రూపొందించుకోవాలి కదా? దేశంతో పాటు తెలుగునాట కూడా వైద్యుల కొరత ఉంది. ఈ కొరతను అధిగమించాలంటే మంచి వైద్యులను తయారుచేసే వైద్య కళాశాలలను ఏర్పాటు చేయవలసిందే. అయితే అవసరం మేరకు వైద్య కళాశాలలు నెలకొల్పి వాటిని నిర్వహించే స్థోమత ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలకు లేదు. ఈ కారణంగానే జగన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రభుత్వపరంగా 17 కళాశాలలను ఏర్పాటు చేయడానికి అనుమతులు పొందినా ఆయా కళాశాలల నిర్మాణాలను కూడా పూర్తిచేయలేకపోయారు. కొన్ని కళాశాలల భవనాల నిర్మాణం పునాదుల స్థాయిలోనే ఆగిపోయింది. ఒకవేళ నిర్మాణాలు పూర్తయినా వాటి నిర్వహణ భారాన్ని ప్రభుత్వాలు భరించగలవా? ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల డ్రాపౌట్లను అరికట్టడానికి ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మధ్యాహ్న భోజన పథకం తీసుకువచ్చారు. ఇప్పుడు రెండు తెలుగు రాష్ట్రాలలోనూ మధ్యాహ్న భోజన ఖర్చును సకాలంలో చెల్లించడం లేదు. ఫలితంగా నాణ్యమైన భోజనం విద్యార్థులకు అందడం లేదు. వైద్య కళాశాలలను కూడా సరిగా నిర్వహించలేకపోతే అక్కడ విద్యను అభ్యసించే వైద్య విద్యార్థుల పరిస్థితి ఏమిటి? నాసిరకం వైద్యులను తయారుచేయడం అంటే ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడటమే కదా? పబ్లిక్–ప్రైవేటు భాగస్వామ్యంలో వైద్య కళాశాలలు ఏర్పాటు చేయడం అంటే వైద్యాన్ని, వైద్య విద్యను పేదలకు దూరం చేయడమే అని ప్రతిపక్ష రాజకీయ పార్టీలు విమర్శించవచ్చు గానీ అందులో వాస్తవం లేదు. వైద్య కళాశాలలకు అనుబంధంగా ఏర్పాటు చేసే ఆస్పత్రులలో ఎంత ఎక్కువ మంది రోగులకు వైద్యం చేస్తే అక్కడ చదువుకునే మెడికోలకు అంత మంచి విద్యను అందించడమే అవుతుంది. ఇకపై వైద్య కళాశాలల్లో పేదలకు చదువుకునే అవకాశం లభించదని విమర్శించడంలో కూడా హేతుబద్ధత లేదు. కన్వీనర్ కోటా కింద సీటు పొందినవారు నామమాత్రపు ఫీజులనే చెల్లిస్తారు. వైద్య విద్యపై ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు లక్షలు ఖర్చు చేయాలి. ప్రభుత్వాల ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే కనుక ఇకపై కేవలం ప్రభుత్వమే కళాశాలలను ఏర్పాటు చేయాలి అని నినదించడంలో అర్థం లేదు. అదే సమయంలో డబ్బున్న వారి వద్ద నుంచి అధిక ఫీజులు వసూలు చేసి నామమాత్రపు ఫీజుల భారాన్ని తగ్గించుకోవచ్చు. క్రాస్ సబ్సిడీ విధానం ఎల్లెడలా ఉన్నదే కదా! అందుకే ప్రభుత్వం వద్ద డబ్బు లేనప్పుడు పబ్లిక్–ప్రైవేటు భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తే తప్పేమిటి? అని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు కూడా ప్రశ్నించింది. సంక్షేమం పేరిట హద్దులు మీరి ఖర్చులు చేస్తున్న ప్రస్తుత పరిస్థితులలో అన్నీ ప్రభుత్వమే నడపాలనుకోవడంలో అర్థం లేదు. ఇప్పుడున్న పరిస్థితుల్లో వైద్య విద్యను కాపాడుకోవాలన్నా, పేదలకు వైద్యం దూరం కాకూడదు అనుకున్నా ప్రభుత్వంతో ప్రైవేటు వ్యక్తులు చేతులు కలపక తప్పని పరిస్థితి. అదే సమయంలో వైద్య కళాశాలలను ఎక్కడ ఏర్పాటు చేస్తున్నామన్నది కూడా ముఖ్యం. జగన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పాడేరులో వైద్య కళాశాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నారు. ఏజెన్సీ ఏరియాలోని ఆస్పత్రుల్లో పనిచేయడానికి వైద్యులు ఇష్టపడరు. అలాంటిది ఏజెన్సీ ఏరియాలో వైద్య కళాశాల ఏర్పాటు చేస్తే అక్కడ వైద్య విద్యను ఎవరు బోధించాలి? తెలంగాణలో ఏర్పాటైన ప్రైవేటు వైద్య కళాశాలల్లో కూడా హైదరాబాద్‌లో ఏర్పాటైనవే బాగా నడుస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాలలో ఏర్పాటైన వాటిలో సరైన బోధనా సిబ్బంది ఉండటం లేదు. ఈ నేపథ్యంలో చంద్రబాబు ప్రభుత్వం రెండు అంశాలపై దృష్టి సారించాలి. పబ్లిక్–ప్రైవేటు భాగస్వామ్యం వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించాలి. అదే సమయంలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న కళాశాలలను రాజకీయ కోణంలో చూడకుండా ప్రధాన నగరాల్లోనే ఏర్పాటు చేయాలి. అలా చేసినప్పుడే బోధనా సిబ్బంది లభిస్తారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో పనిచేసే ప్రముఖ డాక్టర్లు కూడా విధిగా విద్యా బోధనకు కొంత సమయం కేటాయించాలన్న నిబంధనను కూడా అమలు చేయాలి. ఈ క్రమంలో ప్రభుత్వ ఆస్పత్రుల నిర్వహణపై కూడా ప్రభుత్వాలు దృష్టి సారించాలి. ఫలానా అధికారి భార్య ప్రభుత్వ ఆస్పత్రిలోనే ప్రసవించారు.. ఫలానా నాయకుడు ప్రభుత్వ ఆస్పత్రిలోనే చికిత్స చేయించుకున్నారు అని అప్పుడప్పుడూ గొప్పలు చెప్పుకొనే విధానం పోవాలి. కార్పొరేట్ ఆస్పత్రులను మినహాయిస్తే, మిగతా ప్రైవేటు ఆస్పత్రుల కంటే ప్రభుత్వ ఆస్పత్రులకు మెరుగైన భవనాలు, వసతులు, సిబ్బంది అందుబాటులో ఉంటున్నారు. లేనిదల్లా వాటిపై ప్రజల్లో నమ్మకం. ప్రభుత్వ ఆస్పత్రులపై ప్రజల్లో నమ్మకం ఏర్పడాలంటే జవాబుదారీతనం తీసుకురావలసిందే. ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఉస్మానియా, గాంధీ ఆస్పత్రుల్లో యూజర్ చార్జీలు వసూలు చేయాలని సంకల్పించగా తీవ్ర వ్యతిరేకత వచ్చింది. ఇప్పుడు పరిస్థితులు మారాయి. క్రాస్ సబ్సిడీ విధానం అమలు చేయగలిగితే పేదలకు ఉచితంగా వైద్యం చేయడంతో పాటు డబ్బున్న వారికి మెరుగైన సదుపాయాలు కల్పించవచ్చు. ఇందుకోసం ఎంపిక చేసుకున్న ప్రధాన ఆస్పత్రుల్లోనైనా పబ్లిక్–ప్రైవేటు భాగస్వామ్య విధానం ప్రవేశపెట్టవచ్చు. ఈ విధానాన్ని కొంతకాలంపాటు గమనించి, ఫలితాలు బాగుంటే మరిన్ని ఆస్పత్రులకు విస్తరించవచ్చు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రైవేటు వార్డులు, గదులు ఉంటే తప్పేమిటి? పీపీపీ విధానంలో పేరొందిన డాక్టర్లకు ఆ ఆస్పత్రుల నిర్వహణ అప్పగించవచ్చు. తమ స్వార్థం కోసమైనా వారు కష్టపడతారు. శస్త్రచికిత్సల్లో నిపుణులను రప్పించి డబ్బు చెల్లించిన వారితో పాటు పేదలకు కూడా వారి సేవలను అందించవచ్చు. ఆరోగ్యశ్రీ, ఎన్టీఆర్ వైద్య సేవ కింద ప్రభుత్వాలు ఖర్చు చేస్తున్న నిధులు కూడా ప్రభుత్వ ఆస్పత్రులకే దక్కుతాయి. ఫలితంగా వాటి ఆర్థిక పరిస్థితి కూడా మెరుగుపడుతుంది. నిపుణులైన వైద్యులకు ఫీజు చెల్లించి ప్రభుత్వ ఆస్పత్రులకు రప్పించవచ్చు. పలువురు వైద్య నిపుణులు ప్రైవేటు ప్రాక్టీస్ చేసుకుంటున్నారు. అలాంటి వారికి సొంత ఆస్పత్రులు లేవు. వారికి ప్రభుత్వ ఆస్పత్రులు వేదిక అవుతాయి. ఈ అంశంపై ప్రభుత్వం దృష్టిసారిస్తే పటిష్ఠమైన విధానం ఆవిష్కృతం కావచ్చు. పేదలకు ఉచిత వైద్యాన్ని నిరాకరించకుండా ప్రభుత్వ ధనంతో ఏర్పాటైన భవనాలు, సౌకర్యాలను ఉపయోగించి స్థోమత ఉన్న వారి వద్ద ఫీజులు వసూలు చేయడం తప్పిదం కాదు కదా? అంతిమంగా ప్రజలు కోరుకొనేది నాణ్యమైన విద్య. పేదలకు కావల్సింది ఉచిత వైద్యం. ఈ రెండూ ఏక కాలంలో లభించినప్పుడు ఎవరికైనా అభ్యంతరాలు ఎందుకుండాలి? వైద్య రంగంలో ప్రభుత్వం మాత్రమే ఉండాలనే విధానం ఫెయిల్ అయింది. ప్రైవేటు రంగం కూడా పేదలకు భారంగా మారింది. ఈ పరిస్థితుల్లో మధ్యస్థంగా ఉండే పబ్లిక్–ప్రైవేటు భాగస్వామ్యమే పరిష్కార మార్గం కావొచ్చు. దీన్ని ఒక ప్రయోగంగా అమలు చేయడంలో తప్పు లేదు. ఏ విధానంలో అయినా చెక్స్ అండ్ బేలెన్సెస్ ఉండాలి. ప్రైవేటు వైద్య రంగానికి చెక్ పెట్టడానికైనా ఈ పీపీపీ విధానం దోహదపడవచ్చు. రాజకీయ పార్టీలు హిపోక్రసీతో సతమతం అవుతున్నాయి. అందుకే అన్నీ ఉచితం అంటాయి. ప్రభుత్వాల వద్ద డబ్బు లేనప్పుడు ఉచితం ఎలా? పరిస్థితుల్లో మార్పు లేకపోతే ప్రభుత్వ ఆస్పత్రుల్లో కనీస సౌకర్యాలు కూడా లేకుండా పోతాయి. వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకున్నప్పుడే ప్రజలకు మేలు చేసినవారవుతారు. రోగులకు ఇచ్చే మందులు తియ్యగా ఉండవు కదా? అలాగే మార్పునకు శ్రీకారం చుట్టినప్పుడు ఎంతో కొంత వ్యతిరేకత వస్తుంది. విమర్శలు కూడా వస్తాయి. ప్రభుత్వ ఉద్దేశాలను ప్రజలకు అర్థమయ్యేలా వివరించి నూతన విధానం ఫలితాలను వీలైనంత త్వరగా చూపించగలిగితే మార్పును ప్రజలు కూడా ఆహ్వానిస్తారు. అయితే ప్రభుత్వాలకు సంకల్ప బలం ఉండాలి!

> **పబ్లిక్–ప్రైవేటు భాగస్వామ్యంలో వైద్య కళాశాలలు ఏర్పాటు చేయడం అంటే వైద్యాన్ని, వైద్య విద్యను పేదలకు దూరం చేయడమే అని ప్రతిపక్ష రాజకీయ పార్టీలు విమర్శించవచ్చు గానీ అందులో వాస్తవం లేదు. వైద్య కళాశాలలకు అనుబంధంగా ఏర్పాటు చేసే ఆస్పత్రులలో ఎంత ఎక్కువ మంది రోగులకు వైద్యం చేస్తే అక్కడ చదువుకునే మెడికోలకు అంత మంచి విద్యను అందించడమే అవుతుంది. ఇకపై వైద్య కళాశాలల్లో పేదలకు చదువుకునే అవకాశం లభించదని విమర్శించడంలో కూడా హేతుబద్ధత లేదు. కన్వీనర్ కోటా కింద సీటు పొందినవారు నామమాత్రపు ఫీజులనే చెల్లిస్తారు. వైద్య విద్యపై ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు లక్షలు ఖర్చు చేయాలి. ప్రభుత్వాల ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే కనుక ఇకపై కేవలం ప్రభుత్వమే కళాశాలలను ఏర్పాటు చేయాలి అని నినదించడంలో అర్థం లేదు. అదే సమయంలో డబ్బున్న వారి వద్ద నుంచి అధిక ఫీజులు వసూలు చేసి నామమాత్రపు ఫీజుల భారాన్ని తగ్గించుకోవచ్చు. క్రాస్ సబ్సిడీ విధానం ఎల్లెడలా ఉన్నదే కదా! అందుకే ప్రభుత్వం వద్ద డబ్బు లేనప్పుడు పబ్లిక్–ప్రైవేటు భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తే తప్పేమిటి? అని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు కూడా ప్రశ్నించింది.**


AKBAR


యూట్యూబ్‌లో 'కొత్త పలుకు' కోసం QR Code scan చేయండి

సమాచార స్వేచ్ఛతోనే నిజమైన ప్రజాస్వామ్యం

భారత ప్రజాస్వామ్య చరిత్రలో 2005 సంవత్సరం ఒక మైలురాయి. ఆ ఏడాది అక్టోబర్ 12న అమల్లోకి వచ్చిన సమాచార హక్కు (సహ) చట్టం దేశ పాలనను 'పారదర్శకత' వైపు మళ్లించింది. ఆర్టీఐ కేవలం ఒక పరిపాలనా చట్టం కాదు. పారదర్శకత, బాధ్యతాయుత పాలన, ప్రజా భాగస్వామ్యం అనే ప్రజాస్వామ్య మూలాలను బలపరిచే ఉద్యమంగా నిలిచింది. ఈ చట్టం ప్రజాస్వామ్యానికి నూతన శ్వాసనిచ్చిన సంస్కరణ. అధికారాల తలుపులు తెరిచి ప్రజల చేతుల్లో పౌరాధికారం పెట్టిన మానవ హక్కుల విప్లవం. ఇప్పుడు ఈ చట్టం ఇరవై ఏళ్లు పూర్తవుతున్న వేళ... దీని ప్రయాణం ఎలా ఉందో, ప్రపంచంలోని అత్యంత పారదర్శక దేశాలతో పోలిస్తే మనం ఎక్కడ ఉన్నామో పరిశీలించడం అవసరం.

భారతదేశం ఆమోదించిన సహ చట్టం ప్రపంచంలో అత్యంత ప్రజానుకూలమైన చట్టాలలో ఒకటిగా గుర్తింపు పొందింది. ఇది సమయపాలనతో సమాచారం ఇవ్వడం, ముందుగానే వివరాలు ప్రకటించడం, స్వతంత్ర సమాచార సంఘాలు ఏర్పాటు చేయడం వంటి ముఖ్య లక్షణాలను కలిగి ఉంది. ఇరవై ఏళ్లలో లక్షలాది పౌరులు ఈ చట్టం ద్వారా అవినీతిని వెలికితీశారు, సంక్షేమ పథకాలలో లోపాలను సరిచేశారు, ప్రభుత్వ బాధ్యతను పెంచారు. ప్రారంభ దశలో సహ చట్టం ప్రజల్లో ఆశను రగిలించింది. సాధారణ పౌరుడు కూడా ప్రభుత్వ నిర్ణయాలను ప్రశ్నించగలిగాడు. గ్రామ పంచాయతీ నుంచి కేంద్ర మంత్రిత్వ శాఖ వరకు, గ్రామ ప్రథమ పౌరుడు నుంచి దేశ ప్రధానమంత్రి వరకు 'ప్రజల సొత్తు' అనే అవగాహన వ్యాపించింది. కానీ రెండు దశాబ్దాల తర్వాత, ఆ కాంతి కొంత మందగించింది. కేంద్ర, రాష్ట్ర సమాచార సంఘాల్లో నియామకాల ఆలస్యం, నిర్ణయాల తడబాటు, లక్షలాది కేసుల పెండింగ్ వంటివి చట్టం అమలుపై మబ్బుల్లా కమ్మాయి.

ఇటీవల విడుదలైన ఒక నివేదిక ప్రకారం దేశవ్యాప్తంగా 4 లక్షలకు పైగా ఫిర్యాదులు పరిష్కారం కోసం రాష్ట్ర సమాచార కమిషన్ల వద్ద వేచి ఉన్నాయి. కొన్ని రాష్ట్రాల్లో ఒక ఆర్టీఐ ఫిర్యాదు విచారణకు రావడానికి దశాబ్దాల సమయం పడుతోంది. తెలంగాణ రాష్ట్రం విషయానికి వస్తే ఇప్పుడున్న ఫిర్యాదులను పరిష్కరించేందుకు దాదాపు 30 సంవత్సరాలు పడుతుందని 'సార్థక్ నాగరిక సంఘటన్' అనే స్వచ్ఛంద సంస్థ మూడు రోజుల క్రితం నివేదిక విడుదల చేసింది. సహ చట్టం అమలులో ప్రజలకు మద్దతుగా ఉండాల్సిన సమాచార కమిషన్ల బాధ్యతారాహిత్యానికి ఈ నివేదిక ఉదాహరణగా నిలుస్తోంది. చట్టం ఉన్నా, వ్యవస్థల్లో చలనం లేనట్లు సూచిస్తోంది. పౌరుడు అడిగే ప్రతి సమాచారానికి సమాధానమివ్వాలన్న బాధ్యత ప్రభుత్వానికి ఉన్నా, అది ఆచరణలోకి రాకపోవడం బాధాకరం.



సమాచార హక్కు ఉద్యమం.. ప్రపంచవ్యాప్త ప్రజాస్వామ్య స్ఫూర్తిలో భాగం. యునెస్కో 2024 నివేదిక ప్రకారం, 139 దేశాలు ఇప్పటికే తమ రాజ్యాంగం లేదా చట్టాల ద్వారా ప్రజలకు సమాచారం పొందే హక్కు కల్పించాయి. స్వీడన్ 1766లోనే 'ఫ్రీడమ్ ఆఫ్ ది ప్రెస్ యాక్ట్' ద్వారా ప్రజలకు ప్రభుత్వ పత్రాలు పరిశీలించే హక్కు ఇచ్చింది. అమెరికా 1966లో 'ఫ్రీడమ్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ యాక్ట్' ద్వారా సమాచార నిరాకరణపై న్యాయ సమీక్షకు వీలు కల్పించింది. బ్రిటన్ (2000లో), మెక్సికో, దక్షిణాఫ్రికా, ఇండోనేషియా వంటి దేశాలు అవినీతి నిరోధం, ప్రజా భాగస్వామ్యాన్ని బలపరచేందుకు ఇలాంటి చట్టాలు తీసుకువచ్చాయి. ముఖ్యంగా డెన్మార్క్, ఫిన్లాండ్, న్యూజిలాండ్, సింగపూర్ వంటి దేశాలు సంవత్సరాలుగా 'అవినీతి లేని పరిపాలన', 'పౌరాభిప్రాయ బలమైన వ్యవస్థల'తో ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తున్నాయి. డెన్మార్క్‌లో ప్రభుత్వ నిర్ణయాలు పూర్తిగా బహిరంగంగా, అత్యంత పారదర్శకంగా ఉంటాయి. ప్రతి మంత్రిత్వ శాఖ తమ డేటా, ఖర్చులు, విధాన నిర్ణయాలకు సంబంధించిన సమస్త సమాచారం ప్రజలకు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచుతుంది. ఫిన్లాండ్‌లో సమాచార హక్కు చట్టం అమలును రాజ్యాంగ ప్రమాణంగా పరిగణిస్తారు. న్యూజిలాండ్, సింగపూర్‌లో ఫిర్యాదుల పరిష్కారం వేగంగా జరుగుతుంది; విచారణల్లో ఆలస్యం ఉండదు. పాలనలో దాపరికానికి చోటులేదు అన్న భావన ఈ దేశాల్లో స్పష్టంగా కనిపిస్తుంది. వీరి విజయాలతో ఒక విషయం మనం గుర్తించాలి. పారదర్శకత అనేది కేవలం చట్టంతో కాదు, నిబద్ధతతో వస్తుంది. సమాచార హక్కు అమలు చేసే అధికారులు స్వతంత్రంగా, నిష్పక్షపాతంగా ఉండాలి. ప్రజల అభ్యర్థనలను ఆలస్యం లేకుండా పరిష్కరించగలిగే వ్యవస్థ నిర్మించాలి.

భారతదేశం ఇప్పటికీ ప్రజాస్వామ్యంలో బలమైన మూలాలు కలిగిన దేశమే. సమాచార హక్కు చట్టం ద్వారా ప్రధానమంత్రి నుంచి గ్రామ సర్పంచి వరకు ప్రజల ఎదుట బాధ్యత వహించే వ్యవస్థ ఏర్పడింది. అయితే ఈ వ్యవస్థ అమలులో కొన్ని లోపాలు ఉన్నాయి. సమాచార సంఘాల నియామకాలు ఆలస్యం; అప్పీలు, ఫిర్యాదులు సంవత్సరాల తరబడి పెండింగ్; కొన్ని విభాగాల్లో డేటా డిజిటల్‌గా అందుబాటులో లేకపోవడం; స్వచ్ఛందంగా ప్రకటించాల్సిన సమాచారాన్ని అందుబాటులో ఉంచకపోవడం; అధికారుల నిర్లక్ష్యంపై తగిన చర్యలు లేకపోవడం వంటి లోటుపాట్లు.. ప్రజల చేతిలో బ్రహ్మాస్త్రంగా పేర్కొనబడే ఆర్టీఐ చట్టాన్ని బలహీనపరుస్తున్నాయి. ఈ బలహీనతలను అధిగమిస్తే.. పారదర్శకత, అవినీతి రహిత పాలనలో భారతదేశం ప్రపంచ అత్యుత్తమ దేశాలలో ఒకటిగా నిలుస్తుంది.

ఇరవై ఏళ్ల ప్రయాణం తర్వాత కూడా, సమాచార హక్కు చట్టం భారత ప్రజాస్వామ్యంలో అత్యంత ధైర్యవంతమైన సంస్కరణగా నిలుస్తోంది. ప్రజాస్వామ్య భవిష్యత్తు కేవలం ఓటు హక్కులోనే కాదు, తెలుసుకునే హక్కులోనూ ఉంది. సమాచారం నిజంగా ప్రజలదైతే పాలన నిజమైన ప్రజాసేవగా మారుతుంది. అదే భారత ప్రజాస్వామ్యానికి శాశ్వత బలం. ఈ చట్టం భారత ప్రజాస్వామ్యానికి వెలుగు చూపిన దీపం. కానీ ఆ వెలుగును నిలబెట్టుకోవడం పౌరులుగా మన బాధ్యత. సమాచార స్వేచ్ఛ ఉన్న దేశమే నిజమైన ప్రజాస్వామ్యం కలిగిన దేశం. మన ప్రజాస్వామ్యం మరో రెండు దశాబ్దాలు మరింత బలంగా ఉండాలంటే 'సమాచారం ప్రజల హక్కు' అని ప్రతి పౌరుడూ భావించాలి.

▪ ఆచార్య బాలకిష్టారెడ్డి వృంధ్యాల
అధ్యక్షుడు, తెలంగాణ ఉన్నత విద్యామండలి

(నేటితో సమాచార హక్కు చట్టానికి 20 ఏళ్లు)



ప్రమాణ స్వీకారం శ్రీదుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం నూతన పాలకమండలి శనివారం ప్రమాణస్వీకారం చేసింది. ఇంద్రకీలాద్రిపై మహా మండపం ఏడో అంతస్థులో ఉన్న కళావేదికపై జరిగిన ఈ కార్యక్రమం ఈవో శీనానాయక్ పర్యవేక్షణలో జరిగింది. చైర్మన్‌గా బొర్రా రాధాకృష్ణ, పాలకవర్గ సభ్యులు బాధ్యతలు స్వీకరించారు. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని చైర్మన్ హామీ ఇచ్చారు. 6

సూపర్‌ఫాస్ట్..

విజయవాడ రైల్వేస్టేషన్ రీ డెవలప్‌మెంట్‌కు టెండర్లు

రూ.661.11 కోట్లతో టెండర్లు పిలిచిన ఆర్ఎల్‌డీఏ

- పీపీపీ విధానం, డీబీఎఫ్‌వోటీ పద్ధతిలో ఆహ్వానం
- బిడ్లు సమర్పించటానికి తుది గడువు డిసెంబరు 2
- **ఈ నెల 24న నగరంలోని హోటల్‌లో ప్రీబిడ్ మీటింగ్**
- **60 ఏళ్లకు లీజు, దశలవారీగా అభివృద్ధికి అవకాశం**

విజయవాడ రైల్వేస్టేషన్ రీ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు పట్టాలెక్కింది. అధునాతన రైల్వేస్టేషన్ భవన నిర్మాణానికి రైల్‌ల్యాండ్ డెవలప్ మెంట్ అథారిటీ (ఆర్ఎల్‌డీఏ) రూ.661.11 కోట్లతో టెండర్లు పిలిచింది. పబ్లిక్ అండ్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీపీపీ) విధానంలో డిజైన్, బిల్డ్, ఫైనాన్స్ ఆపరేట్-ట్రాన్స్‌ఫర్ (డీబీఎఫ్ వోటీ) పద్ధతిలో ఈ టెండర్లు పిలిచారు.





విజయవాడ రైల్వేస్టేషన్ రీ డెవలప్‌మెంట్ డిజైన్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ రైల్వేస్టేషన్ రీ డెవలప్‌మెంట్ మొత్తం 81,948 చదరపు మీటర్ల పరిధిలో జరుగుతుంది. తూర్పు వైపునకు అభిముఖంగా 57,134 చదరపు మీటర్ల పరిధిలో నిర్మాణం జరుగుతుంది. ఇందుకోసం ఆన్‌లైన్ విధానంలో ఈ-బిడ్లను సమర్పించడానికి 2025, డిసెంబరు 2 మధ్యాహ్నం 3 గంటల వరకు తుది గడువుగా రైల్ ల్యాండ్ డెవలెప్‌మెంట్ అథారిటీ నిర్ణయించింది. ఈ నెల 24 ఉదయం 11 గంటలకు నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో ఔత్సాహిక సంస్థలతో ప్రీబిడ్ మీటింగ్ నిర్వహించడానికి రైల్వే అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

రీ డెవలప్‌మెంట్ ఇలా..

ప్రస్తుతం విజయవాడ రైల్వేస్టేషన్‌లో 83,367 చదరపు మీటర్ల పరిధిలో రైల్వే ఏరియా ఉంది. తూర్పు వైపున జీప్లస్2 విధానంలో 41,770 చదరపు మీటర్ల రైల్వేస్టేషన్ భవనం ఉంది. పశ్చిమ వైపు జీప్లస్2 విధానంలో 6,647 చదరపు మీటర్ల స్టేషన్ బిల్డింగ్ ఉంది. ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు మూడు ఉన్నాయి. ఈ మొత్తం 4,338 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఉన్నాయి. రైల్వే కార్యాలయం 4,457 చదరపు మీటర్లు, స్టాఫ్ క్వార్టర్స్ 11 వేల చదరపు మీటర్లలో ఉన్నాయి. ఎంపికైన కాంట్రాక్టు సంస్థ వీటన్నింటినీ అభివృద్ధి చేయాలి. ఆసక్తి చూపిన బిడ్డర్ కమర్షియల్ ఏరియాలను అభివృద్ధి చేయడంతో పాటు పార్కింగ్, మీటింగ్ హాళ్ల వంటివి కూడా నిర్మించాలి. స్కైవాక్‌తో పాటు స్టాఫ్ క్వార్టర్స్ వంటివి కూడా ఉండాలి.

ఎంతెంత వ్యయం

మాండేటరీ కాంపోనెంట్ కాస్ట్ (ఎంసీసీ) కింద చేపట్టాల్సిన పనులను ఆర్ఎల్‌డీఏ నిర్దేశించింది. తూర్పువైపు స్టేషన్ భవనం రూ.192.09 కోట్లతో, పశ్చిమవైపు రూ.31.73 కోట్లతో చేపట్టాలి. రూ.7.79 కోట్లతో ఫుడ్‌కోర్టు, రూ.18.62 కోట్లతో సెంట్రల్ ఫుట్ ఓవర్ బ్రిడ్జి, రూ.62.14 కోట్లతో ప్లాట్‌ఫాం, రూఫ్ మిగతా 6లో..

కల్తీ కేసులో కిక్కు

నకిలీ మద్యం తయారీ కేసులో అందరూ అన్నుకున్నదే అయ్యింది. అంతా ఊహించినట్టుగానే వైసీపీ అధికారంలో ఉన్నప్పుడే ఈ వ్యాపారం మూడు పూలు, ఆరు కాయలుగా నడిచింది. ఎక్సైజ్ అధికారులు ఇంతకుముందు నిందితులను అరెస్టు చేసినప్పుడు.. మూడు నెలల క్రితం నుంచి ఇబ్రహీం పట్నంలో నకిలీ మద్యం తయారు చేస్తున్నట్టు తెలిపారు. కానీ, 2021 నుంచే ఈ వ్యాపారం సాగించామని ప్రధాన నిందితుడు అద్దేపల్లి జనార్దనరావు ఒప్పుకోవడం సంచలనంగా మారింది.



విజయవాడ జిల్లాకోర్టు వద్ద ప్రధాన నిందితుడు జనార్దనరావు

నకిలీ మద్యం తయారీ మొదలైంది వైసీపీ హయాంలోనే..

2021 నుంచి వ్యాపారం సాగించిన జనార్దనరావు

- నాటి ఊరుపేరూ లేని బ్రాండ్లను అడ్డుపెట్టుకుని వ్యాపారం
- మద్యం తయారీలో అధ్యయనానికే ఆఫ్రికా టూర్
- రాజకీయాలను అడ్డుపెట్టుకుని ప్రజల ప్రాణాలతో చెలగాటం
- కేసులో ఓ రాజకీయ పార్టీ నేత 'హస్తం'

విజయవాడ, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : నకిలీ మద్యం తయారీ వ్యాపారం 2021 నుంచే మొదలైంది. వైసీపీ పాలనలో ఊరుపేరూ లేని బ్రాండ్లను విక్రయించడంతో నకిలీ మద్యం తయారీకి ఇదే మంచి అదును అనుకున్నాడు ప్రధాన నిందితుడు అద్దేపల్లి జనార్దనరావు. అనుకున్నట్టుగానే హైదరాబాద్‌లోని నిజాంపేటలో నకిలీ మద్యం తయారీకి బీజాలు వేసుకున్నాడు. ఎన్టీఆర్, అన్నమయ్య జిల్లాల్లోనే కాకుండా తెలంగాణలోని మద్యం దుకాణాల్లోనూ నకిలీ మద్యాన్ని విక్రయించాడు.

మద్యం తయారీ అధ్యయనం కోసమే ఆఫ్రికా

తనకు ఆరోగ్యం బాగోకపోవడంతో వైద్యం చేయించుకోవడానికి విదేశాల్లో ఉన్నానని జనార్దనరావు సెల్ఫీ వీడియో విడుదల చేసిన విషయం తెలిసిందే. ఇదంతా అవాస్తవమని రిమాండ్ రిపోర్టును బట్టి తెలుస్తోంది. అంతా అనుమానించినట్టుగా అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లెలో రాజకీయ నాయకుడిగా ఉన్న జయచంద్రారెడ్డితో ఇంజనీరింగ్ విద్య నుంచి జనార్దనరావుకు స్నేహం ఏర్పడింది. జయచంద్రారెడ్డి టీడీపీలోకి రావడం, కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండటంతో ఇక తిరుగులేదనుకున్నాడు. వైసీపీ పాలనలో మొత్తం నకిలీ మద్యాన్ని ఏఎన్నార్ బార్‌లో విక్రయించిన జనార్దనరావు దాన్ని ఇప్పుడు మరింత విస్తృతం చేద్దామనుకున్నాడు. ఈ క్రమంలోనే జయచంద్రారెడ్డితో కలిసి ఆఫ్రికా పర్యటనకు వెళ్లాడు. తెలివిగా ముందు జయచంద్రారెడ్డిని ఆఫ్రికాలోని ల్యూండా ప్రాంతానికి పంపాడు. తర్వాత గతనెల 25న జనార్దనరావు వెళ్లాడు. ఆఫ్రికాలో అనధికారికంగా మద్యం తయారీ విస్తృతంగా జరుగుతోంది. అక్కడున్న విధానాలు, పద్ధతులను అధ్యయనం చేశాక వాటిని ఇక్కడ అమలు చేయాలని భావించాడు. వాస్తవానికి నకిలీ డిస్టలరీ వ్యవహారం బయటకు రాకపోతే ములకలచెరువు, ఇబ్రహీంపట్నంలో జరిగే నకిలీ మద్యం తయారీకి నూతన యంత్ర సామాగ్రిని అమర్చడానికి స్కెచ్ వేశారు. దీన్ని అధ్యయనం చేయడానికి వారు ఆఫ్రికా వెళ్లారని తెలుస్తోంది.

మరకలు ఇంకెంతమందికో..

జనార్దనరావుతో దోస్తీ కట్టి నకిలీ మద్యం తయారీలో పాలు పంచుకున్న రాజకీయ నేతల పేర్లు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. ఇప్పటికే జయచంద్రారెడ్డి పేరు బయటకు రాగా, టీడీపీ ఆయనపై వేటు వేసింది. తాజాగా ఇబ్రహీంపట్నానికి చెందిన మరో నాయకుడి పేరు వెలుగులోకి వచ్చింది. రాష్ట్రంలో ఆనవాళ్లు అంతంతమాత్రంగా ఉన్న ఓ రాజకీయ పార్టీకి చెందిన నేత జనార్దనరావుతో కరచాలనం చేశాడు. ఆయనతో పాటు మరికొంతమంది హైదరాబాద్‌లో ఈ-7 పేరుతో మద్యం దుకాణాన్ని నిర్వహించారు. తర్వాత ఈ బృందమంతా కలిసి గోవా పర్యటనకు వెళ్లింది. అక్కడ బాలాజీ అనే వ్యక్తితో జరిగిన చర్చల నుంచి నకిలీ మద్యం తయారీ ఆలోచనలకు అడుగులు పడ్డాయి. నకిలీ మద్యం తయారీ స్కెచ్ మొత్తం గోవా నుంచి మొదలైంది. ఇప్పటికే ఈ కేసులో పలువురు ప్రముఖుల పేర్లు బయటకు వస్తున్నాయి. త్వరలో ఇంకెన్ని వస్తాయో చూడాలి.

హైటెన్షన్

నగరంలో ప్రమాదకరంగా విద్యుత్ హైటెన్షన్ వైర్లు

- డాన్‌బాస్కో స్కూల్ సమీపంలో తెగిపడిన కేబుల్
- రెండు రోజుల కిందట తప్పిన ప్రమాదం
- నగరాల్లో డబుల్ సస్పెన్షన్ వాడాలన్నది నిబంధన
- విద్యుత్ శాఖ నిర్లక్ష్యం.. సింగిల్ సస్పెన్షన్‌తో సరి



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : నగరంలోని హైటెన్షన్ వైర్లు ప్రమాదకరంగా మారాయి. రెండు రోజుల కిందట ఆయుష్ హాస్పిటల్ వద్ద, డాన్‌బాస్కో స్కూల్ సమీపంలో హైటెన్షన్ వైర్ తెగి ఓ ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీ బస్సుపై పడింది. బస్సులో డ్రైవర్, క్లీనర్ ఉండగా, వారు బస్సు దిగకపోవటంతో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. ఈలోపు విద్యుత్ ప్రవాహం ఆగిపోవటంతో సురక్షితంగా బయటపడ్డారు. ప్రమాద సమయంలో డాన్‌బాస్కో స్కూల్‌లోని పిల్లలు పక్కనే ఉన్న గ్రౌండ్‌లో స్కేటింగ్ నేర్చుకుంటున్నారు. రోడ్డు వెంబడి ఎంతోమంది పాదచారులు వెళ్తున్నారు. అదృష్టవశాత్తూ ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు.

విద్యుత్ శాఖ అధికారుల లోపాలు

హైటెన్షన్ విద్యుత్ టవర్లపై వేసిన కేబుల్స్‌కు సంబంధించి అనేక లోపాలు కనిపిస్తున్నాయి. సాధారణంగా ఇలాంటి వైర్లు తెగిపడవు. అయినప్పటికీ నగర ప్రాంతాల్లో డబుల్ సస్పెన్షన్ కేబుల్స్‌ను ఉపయోగించాలనే నిబంధన ఉంది. ఈ నిబంధనను విద్యుత్ శాఖ అధికారులు అమలు చేయట్లేదు. విజయవాడ నగరం మీదుగా వెళ్లే ట్రాన్స్‌మిషన్ హైటెన్షన్ టవర్లపై మిగతా 6లో..



ఛాంగీ విమానాశ్రయం

సింగపూర్‌కు ఇండిగో

ఆరేళ్ల కల సాకారం



విజయవాడ విమానాశ్రయం

- విజయవాడ-సింగపూర్ సర్వీసు పునరుద్ధరణ
- నవంబరు 15 నుంచి వారంలో మూడుసార్లు
- గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో మంచి ఆదరణ
- 90 శాతం ఆక్యుపెన్సీతో నడిచిన విమానాలు
- వైసీపీ ప్రభుత్వం వచ్చాక సర్వీసు రద్దు
- వ్యాపారులు, పర్యాటకులు, విద్యార్థుల నుంచి డిమాండ్
- కూటమి ప్రభుత్వ చొరవతో ఇన్నాళ్లకు అందుబాటులోకి..

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఆరేళ్ల విరామం తర్వాత ఎట్టకేలకు విజయవాడ విమానాశ్రయం నుంచి సింగపూర్‌కు అంతర్జాతీయ విమాన సర్వీసు ప్రారంభమవుతోంది. నవంబరు 15 నుంచి వారంలో మూడు రోజులు ఈ అంతర్జాతీయ విమానాలు నడవనున్నాయి. ఇండిగో ఎయిర్‌లైన్స్ ఈ విమాన సర్వీసులను ప్రారంభిస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు సింగపూర్ పర్యటనలో అక్కడి పెట్టుబడిదారులు, ప్రతినిధులు సింగపూర్ విమాన సర్వీసు గురించి ప్రత్యేకంగా ప్రస్తావించగా, చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అనంతరం కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు పలుమార్లు విజయవాడ వచ్చినప్పుడు సింగపూర్ సర్వీసు విషయంలో ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. వారి హామీలు నెరవేరి వచ్చేనెల నుంచి సింగపూర్ సర్వీసులు ప్రారంభం కానున్నాయి. విజయవాడ ఎయిర్‌పోర్టు నుంచి మిగతా 6లో..

ఆరేళ్ల కల ఫలించింది. ఎట్టకేలకు విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి సింగపూర్‌కు విమాన సర్వీసులు నడపాలని నిర్ణయించారు. నవంబరు 15 నుంచి వారంలో మూడు రోజులు ఈ సర్వీసులు నడిపేందుకు అంతా సిద్ధమైంది. ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు కృషితో తీసుకున్న ఈ నిర్ణయంపై వ్యాపారులు, విద్యార్థులు, ఎన్నారైలు, పర్యాటకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



శభాష్ పోలీస్

మార్గదర్శకుడిగా నిలిచిన ఓ కానిస్టేబుల్

- ప్రమాదకరంగా నందిగామ వద్ద బైపాస్ రోడ్డు
- గుంతలతో రోజూ రోడ్డు ప్రమాదాలు
- శనివారం గుంతల్లో దిగబడిన ఆటో
- భారీగా నిలిచిపోయిన ట్రాఫిక్
- నేనున్నానంటూ ముందుకొచ్చిన కానిస్టేబుల్
- గుంతలు పూడ్చి మార్గంసుగమం

8

మలివిడతలోనూ నిరాశేనా?

వందేభారత్ మలివిడత రైళ్ల కేటాయింపులో విజయవాడకు ప్రాధాన్యత దక్కుతుందని అందరూ భావించారు. రైల్వేబోర్డు నిర్ణయాల కారణంగా విజయవాడ-బెంగళూరుకు అవకాశం దక్కని పరిస్థితి కనిపిస్తోంది. విజయవాడ-బెంగళూరు మధ్య వందేభారత్ రైలు నడిపితే తక్కువ సమయంలో గమ్యస్థానం చేరుకునే అవకాశం ఉంటుంది. విజయవాడ-బెంగళూరు మధ్య వందేభారత్ ఎక్స్‌ప్రెస్ కావాలనుకునే ప్రయాణికులు.. రైల్వేబోర్డుకు తాకేలా స్వరాన్ని వినిపించాల్సిన అవసరం ఉంది.



బెజవాడ-బెంగళూరు వందేభారత్ ఎప్పటికి?

మలివిడత కేటాయింపుల్లోనూ లేనట్టే..!

- ఇప్పటికే ప్రతిపాదనలు కోరిన రైల్వేబోర్డు
- నివేదిక అందజేసిన విజయవాడ అధికారులు
- అయినా విజయవాడ డివిజన్‌పై చిన్నచూపు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ-బెంగళూరు మధ్య వందే భారత్ ఎక్స్‌ప్రెస్ కలగానే మిగిలిపోనుందా? అని ప్రశ్నించుకుంటే అవుననే సమాధానమే వస్తుంది. మలివిడతగా ఇచ్చే వందేభారత్ రైళ్లలో విజయవాడకు అవకాశం లేదని తెలుస్తోంది. విజయవాడ-బెంగళూరు మధ్య వందేభారత్ ఎక్స్‌ప్రెస్ నడపాలని ఎప్పటినుంచో డిమాండ్ ఉంది. తగిన ప్రతిపాదనలు పంపాలని రైల్వేబోర్డు మిగతా 6లో..



హైకోర్టు జడ్జి మల్లిఖార్జునరావుకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ సూపరింటెండెంట్ అచ్యుత మధుసూదనరావు

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సేవలో హైకోర్టు జడ్జి మల్లిఖార్జునరావు దంపతులు

మోపిదేవి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని హైకోర్టు జడ్జి టి.మల్లిఖార్జునరావు కుటుంబ సమేతంగా శనివారం దర్శించుకున్నారు. దేవస్థానానికి విచ్చేసిన మల్లిఖార్జునరావు దంపతులకు ఆలయ సూపరింటెండెంట్ అచ్యుత మధుసూదనరావు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం నాగపుట్టలో పాలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు. తర్వాత హైకోర్టు జడ్జి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. మల్లిఖార్జునరావు దంపతులకు స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలు అందించి శేషవస్త్రాలతో సత్కరించారు.

వివిధ ప్రాంతాలకు ప్రత్యేక రైళ్లు

రైల్వేస్టేషన్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : పండుగలు దృష్ట్యా ప్రయాణికుల రద్దీని నియంత్రించేందుకు వివిధ ప్రాంతాల మధ్య ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఎ.శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హెచ్.ఎస్.నాందేడ్ - అనకాపల్లి (07037) రైలు ప్రతి మంగళవారాలలో బయలుదేరుతుంది. ఈనెల 14 నుంచి నవంబరు 25 వరకు ఏడు సర్వీసులు నడుస్తుంది. ఇదే రైలు తిరుగు ప్రయాణంలో అనకాపల్లి నుంచి బుధవారాలలో బయలుదేరుతుంది. 07038 నెంబరు గల ఈ రైలు ఈనెల 15 నుంచి నవంబరు 26 వరకు ఏడు సర్వీసులు నడుస్తుంది. ఈ రైలు ముద్కేడ్, ధర్మాబాద్, బాసర, నిజామాబాద్, కామారెడ్డి, మేడ్చల్, చర్లపల్లి, నల్గొండ, మిర్యాలగూడ, నడికుడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, గుడివాడ, కైకలూరు, ఆకువీడు, భీమవరం టౌన్, తణుకు, రాజమండ్రి, సామర్లకోట, అన్నవరం, తుని, యలమంచిలి స్టేషన్లలో ఆగుతుంది. 07070 హైదరాబాద్ - హజరత్ నిజాముద్దీన్ ఈనెల 13వ తేదీ సోమవారం బయలుదేరుతుంది. 07071 తిరుపతి - హజరత్ నిజాముద్దీన్ ఈనెల 12వ తేదీ ఆదివారం బయలుదేరుతుంది. 07099 హెచ్.ఎస్.నాందేడ్ - హజరత్ నిజాముద్దీన్ ఈనెల 12వ తేదీ ఆదివారం బయలు దేరుతుంది. ఈ మూడు రైళ్లు ఒక్కో ట్రిప్పు మాత్రమే తిరుగుతాయి.



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న ఎంపీ కేశినేని శివనాథ్, ఎన్ఐఆర్‌డీపీఆర్ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ మొహమ్మద్

విజయవాడ పార్లమెంటు నియోజకవర్గ సమగ్రాభివృద్ధి లక్ష్యంగా ఎంవోయూ

వన్‌టౌన్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ పార్లమెంటు నియోజకవర్గాన్ని మోడల్‌గా తీర్చిదిద్దే దిశగా మరో కీలక అడుగు పడింది. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీ రాజ్ (ఎన్ఐఆర్‌డీపీఆర్), కేశినేని ఫౌండేషన్ మధ్య శనివారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదిరింది. ఎన్ఐఆర్‌డీపీఆర్ తరపున సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ మొహమ్మద్ ఖాన్, కేశినేని ఫౌండేషన్ తరపున విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) సంతకాలు చేశారు. ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ నియోజకవర్గ సమగ్రాభివృద్ధే లక్ష్యమన్నారు. గ్రామీణాభివృద్ధి, ఉపాధి సృష్టి, మహిళా సాధికారత, నైపుణ్యాభివృద్ధి, సుస్థిర వ్యవసాయం వంటి అంశాల్లో సమగ్ర ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. ప్రాజెక్టు మొదటి దశలో అభివృద్ధికి ఎ.కొండూరు, పెనుగంచిప్రోలు, ఇబ్రహీంపట్నం మండలాలను ఎంపిక చేశారు ఈ మండలాల్లో సామాజిక, ఆర్థిక, పర్యావరణ అభివృద్ధి లక్ష్యంగా ప్రాజెక్టులు అమలు కానున్నాయి. అక్టోబరు 22న స్థానిక పరిపాలన అధికారులతో కలిసి వర్క్‌షాప్ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఐఆర్‌డీపీఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ రవీంద్ర గవలి, డాక్టర్ కేశవరావు, డాక్టర్ ఆర్.రమేష్, డాక్టర్ సంధ్యా గోపకుమారన్, డాక్టర్ నిత్య, మురళీ కృష్ణ, కె.బి. బెహరా, కేశినేని ఫౌండేషన్ డైరెక్టర్ కేశినేని వెంకట్ పాల్గొన్నారు.



ఆటోలో తరలిస్తున్న రేషన్ బియ్యం

రేషన్ బియ్యం అక్రమంగా తరలింపు

● అడ్డుకున్న వీఆర్వో, వీడియో తీస్తున్న పాత్రికేయులకు అంతుచూస్తానంటూ బియ్యం వ్యాపారి బెదిరింపు

వీరులపాడు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా రేషన్ బియ్యం తరలించడమే కాకుండా, అడ్డుకున్న రెవెన్యూ అధికారి , పాత్రికేయుల ఫోన్లను నేలకేసి కొట్టి, మీ అంతు చూస్తానంటూ రేషన్ బియ్యం వ్యాపారి బెదిరించిన సంఘటన అల్లూరులో శుక్రవారం సాయంత్రం జరిగింది. జుజ్జూరు వైపు నుంచివస్తున్న ఆటోలో రేషన్ బియ్యం అక్రమంగా రవాణా జరుగుతున్నట్లు సమాచారం రావడంతో వీఆర్వో బేబి మార్గమధ్యలో అల్లూరు వద్ద ఆటోను ఆపి పరిశీలించారు. ఆటోలో 20 బస్తాల రేషన్ బియ్యం గుర్తించారు. ఆటోను ఆపారని తెలుసుకున్న రేషన్ బియ్యం వ్యాపారి కాజా సత్యనారాయణ అక్కడకు చేరుకొని వీఆర్వోపైన, వీడియో తీస్తున్న ఇద్దరు పాత్రికేయులపైన చిందులేస్తూ, వారి ఫోన్స్ లాక్కొని నేలకేసి కొట్టి మీ అంతు చూస్తానని బెదిరించి, బియ్యం ఆటోతో అక్కడ్నుంచి ఉడాయించాడు. వీఆర్వో బేబి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అనిల్ తెలిపారు.

ప్రభుత్వ డెంటల్ కళాశాలలో ఉద్యోగాల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

● గడువు 20 వరకు పొడిగింపు

ప్రభుత్వాసుపత్రి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): విజయవాడలోని ప్రభుత్వ దంత వైద్యశాలలో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో విడుదల చేసిన నోటిఫికేషన్‌లో దరఖాస్తు గడువు ఈ నెల 13వ తేదీగా ప్రకటించామని, అయితే ఈ గడువును ఈనెల 20వ తేదీ వరకు పొడిగించినట్లు వెల్లడించారు. డెంటల్ మెకానిక్, డెంటల్ టెక్నీషియన్, డెంటల్ హైజినిస్ట్ పోస్టులకు అర్హులైన అభ్యర్థులు ఈనెల 20వ తేదీ సాయంత్రం ఐదు గంటలలోపుగా ఆసుపత్రిలోని కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాల్సిందిగా కోరారు.

దుర్గగుడి పాలకమండలి ప్రమాణ స్వీకారం

● చైర్మన్‌గా బొర్రా రాధాకృష్ణ (గాంధీ) బాధ్యతల స్వీకారం ● మంత్రులు కొల్లు రవీంద్ర, పార్థసారథి, ఎమ్మెల్యేల అభినందన

ఇంద్రకీలాద్రి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం పాలకమండలి ప్రమాణస్వీకారం శనివారం మహామండపం ఏడో అంతస్తు కళావేదిక మీద జరిగింది. దుర్గగుడి ఈవోవి.కె.శీనానాయక్ పర్యవేక్షణలో దుర్గగుడి కమిటీ చైర్మన్‌గా బొర్రా రాధాకృష్ణ (గాంధీ), సభ్యులుగా అవ్వారు శ్రీనివాసరావు, బడేటి ధర్మారావు, గూడపాటి వెంకట సరోజినీ దేవి, జి.వి.నాగేశ్వరరావు, జి.హరికృష్ణ, జింకా లక్ష్మీదేవి, మన్నే కళావతి, మోరు శ్రావణి, పనబాక భూలక్ష్మి, పెనుమత్స రాఘవరాజు, ఏలేశ్వరపు సుబ్రహ్మణ్య కుమార్, సుకాసి సరిత, తంబళ్లపల్లి రమాదేవి, తోటకూర వెంకట రమణారావు, తరిగొప్పల పార్వతి, ప్రత్యేక ఆహ్వానితులుగా వెలగపూడి శంకర్‌బాబు, మార్తి రామబ్రహ్మం, ఎక్స్ అఫిషియో సభ్యుడిగా దుర్గగుడి ప్రధాన అర్చకుడు ఎల్.దుర్గాప్రసాద్ ప్రమాణస్వీకారం చేశారు. ప్రమాణస్వీకారం అనంతరం దుర్గగుడి కమిటీ చైర్మన్ తన చాంబర్‌లో పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఏసీ రంగారావు, ఏఈవోలు సుధారాణి, వెంకటరెడ్డి, పీఆర్వో గంగాధర్, తదితరులు పాల్గొన్నారు. దుర్గగుడి పాలకమండలి సభ్యురాలిగా నియమితులైన భవానీపురానికి చెందిన జనసేన పార్టీ నాయకురాలు పద్మావతి ఠాకూర్ శనివారం జరిగిన పాలకమండలి ప్రమాణ స్వీకారానికి వ్యక్తిగత కారణాల వలన హాజరు కాలేకపోయినట్లు దేవస్థానం అధికారులు తెలిపారు.



చైర్మన్‌గా బాధ్యతలు చేపడుతున్న రాధాకృష్ణ



అభినందించి, సత్కరిస్తున్న మంత్రులు పార్థసారథి, రవీంద్ర

దుర్గగుడి అభివృద్ధికి కృషి : గాంధీ

రాష్ట్రంలోని రెండో అతిపెద్ద దేవాలయం దుర్గామల్లేశ్వర దేవస్థానం అభివృద్ధికి కృషి చేస్తామని దుర్గగుడి కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన బొర్రా రాధాకృష్ణ (గాంధీ) తెలిపారు. ప్రమాణ స్వీకారం అనంతరం ఈవో శీనానాయక్‌తో కలిసి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. దుర్గగుడి చైర్మన్‌గా బాధ్యతలు తీసుకోవటం తన తల్లిదండ్రులు చేసిన పుణ్యమన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పాలక మండలి సభ్యులు, దేవస్థానం అధికారులు, ఉద్యోగులు అందరితో కలిసి దేవస్థానం అభివృద్ధికి కృషి చేస్తూ, భక్తులకు వసతులు, సౌకర్యాలను కల్పిస్తామన్నారు. దేవస్థానం మాస్టర్ ప్లాన్ అమలుకు అన్ని విధాలుగా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. దేవస్థానంలో ఎలాంటి అవినీతి అక్రమాలు జరగకుండా చర్యలు తీసుకుంటామని, రాజకీయాలకు తావులేకుండా సామాన్య భక్తులకు పెద్దపీట వేస్తామన్నారు. తనకు దుర్గగుడి చైర్మన్ పదవి రావటంపై కొందరు విమర్శలు చేస్తున్నారని, తనగురించి పూర్తిగా తెలుసుకుని మాట్లాడాలని సూచించారు. ఈవో వి.కె.శీనానాయక్ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి ధర్మకర్తల మండలి సహకారంతో ముందుకు వెళతామని, భక్తులకు సౌకర్యాల కల్పనకు కృషి చేస్తామన్నారు. భక్తుల అవసరాల కోసం కొండ దిగువన అర్జునవీధిలో నూతనంగా సమాచార కేంద్రం ఏర్పాటు చేశామని, వృద్ధులు, దివ్యాంగులు, చంటిపిల్లలతో వచ్చే వారికి కొత్త బ్యాటరీ వాహనాలు ఏర్పాటు చేస్తున్నామని వివరించారు.

మంత్రులు, ఎమ్మెల్యేల అభినందనలు

దుర్గామల్లేశ్వర దేవస్థానం పాలకమండలి చైర్మన్, సభ్యులను పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, వివిధ కార్పొరేషన్ చైర్మన్‌లు, పార్టీ నాయకులు అభినందించారు. మంత్రులు కొలుసు పార్థసారథి, కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యేలు సుజనా చౌదరి, తంగిరాల సౌమ్య, బోడె ప్రసాద్, వివిధ కార్పొరేషన్‌ల చైర్మన్‌లు, పార్టీ నాయకులు చైర్మన్ బొర్రా రాధాకృష్ణను అభినందించి సత్కరించారు.

అమ్మవారిని దర్శించుకున్న మంత్రులు, ఎమ్మెల్యేలు, దుర్గగుడి పాలక మండలి

పాలకమండలి ప్రమాణస్వీకారం అనంతరం మంత్రులు కొలుసు పార్థసారథి, కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యేలు సుజనా చౌదరి, తంగిరా సౌమ్య, దుర్గగుడి పాలక మండలి చైర్మన్, సభ్యులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈవో శీనానాయక్, అర్చకస్వాములు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. దర్శనం అనంతరం వేద పండితులు వేద ఆశీస్సులు అందజేశారు. అనంతరం ఈవో వారికి అమ్మవారి చిత్రపటం, లడ్డూ ప్రసాదం, శేష వస్త్రం అందజేశారు.

వర్షాలతో పత్తిరైతు కుదేలు

- రాలిపోతున్న పింజలు
- కుళ్లిపోతున్న కాయలు
- నాణ్యతపై తీవ్ర ప్రభావం



వర్షాలకు చెట్లపై కుళ్లిపోతున్న పత్తి కాయలు

(జి.కొండూరు-ఆంధ్రజ్యోతి)

ఈ ఏడాది తెల్ల బంగారం (పత్తి) పండించే రైతులను వర్షాలు కలవర పెడుతున్నాయి. రెండ్రోజులకోసారి పడే వర్షాలు పత్తి పంటకు తీవ్ర నష్టం చేస్తున్నాయని రైతులు వాపోతున్నారు. అధికారిక లెక్కల ప్రకారం ఎన్టీఆర్ జిల్లాలో సుమారు 67,614 వేల ఎకరాల్లో పత్తి పంట సాగయ్యింది. గంపలగూడెం మండలంలో అత్యధికంగా 10,966 ఎకరాల్లో పత్తి సాగు చేశారు. వత్సవాయి మం డలంలో 8,903 ఎకరాల్లో, చందర్లపాడు మండలంలో 7,918 ఎకరాల్లో, జి.కొండూరు మండలంలో 6,684 ఎకరాల్లో పత్తి పంట సాగయ్యింది. వరుస వర్షాల కారణంగా నల్లరేగడి భూముల్లో ఉన్న పత్తి పంట కొన్ని చోట్ల అధిక తేమకు జీవం కోల్పోయింది. కొన్ని చోట్ల పత్తితీతలు ప్రారంభం అయ్యాయి. తొలి తీత ఎకరానికి మూడు క్వింటాళ్ల నుంచి 3.5 క్వింటాళ్ల వరకు వస్తున్నా పెద్దగా నాణ్యత ఉండటం లేదని, దానిని కొనేవారు ఉండరంటున్నారు రైతులు. మరి కొన్ని చోట్ల తేమకు పత్తితీతలు ఇంకా ప్రారంభించలేదు. చెట్లకు ఉంటేనే పత్తి త్వరగా ఆరుతుందనే భావనలో అన్నదాతులున్నారు. వర్షాలు మాత్రం ఆగడం లేదు. వరుస వర్షాలకు కాయలు కుళ్లిపోతున్నాయని, పింజలు రాలి కింద పడిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. ఇంతటితో వర్షాలు ఆగితే పర్వాలేదు కాని మరలా వర్షాలు పడితే మాత్రం పత్తి పంట చేతికి రాదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



రాలిపోయిన పత్తి

సగానికి సగం దెబ్బతింది

వర్షాలకు సగానికి సగం పంట దెబ్బతింది. పైన ఉన్న గూడు రాలిపోయింది. సగం కాయలు కుళ్లిపోయాయి. వాతావరణ ఇలానే ఉంటే అసలు పంట చేతికొచ్చే పరిస్థితి ఉండదు. మందుల ఖర్చు రెట్టింపు అయ్యింది. తేమ శాతం తో సంబంధం లేకుండా పత్తిని కొనుగోలు చేస్తే తప్ప ఖర్చులు సైతం వచ్చే అవకాశాలు లేవు.

-కోమటి సుబ్బారావు, గడ్డమణుగు

రైతులకు సూచనలివే

వర్షాల వల్ల భూమిలోని తేమను నివారించుకునేందుకు ఎకరానికి 20 కిలోల యూరియా, 20 కిలోల పొటాష్ సాళ్లలో వేసుకోవాలి. కాపాక్లోరైడ్ (బ్లైటాక్స్) ఎకరానికి 600 గ్రాముల మందును, ప్లాంటామైసిన్ 50 గ్రాముల మందును 100 లీటర్ల నీటిలో కలిపి పైపాటుగా పిచికారి చేసుకోవాలి. మెగ్నీషియం లోపం ఉంటే మెగ్నీషియం సల్ఫేట్ కిలో 100 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలి.

- కె.సీహెచ్ సూరిబాబు, వ్యవసాయాధికారి, జి.కొండూరు

లంచం ఇస్తేనే లే అవుట్ల క్రమబద్ధీకరణ!

● సీఆర్‌డీఏ పట్టణ ప్రణాళికా విభాగంలో అవినీతి జలగలు ● ఎల్ఆర్ఎస్ దరఖాస్తుకు ముందుకు రాని ప్రజలు

లే అవుట్ల క్రమబద్ధీకరణ పథకాన్ని సీఆర్‌డీఏ ప్లానింగ్ విభాగంలో పనిచేస్తున్న కొందరు ఉద్యోగులు సొమ్ము చేసుకుంటున్నారు. క్రమబద్ధీకరణ కావాలంటే లంచం ఇవ్వాల్సిందేనంటున్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన లే అవుట్ల క్రమబద్ధీకరణ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకుందామనుకుంటుంటే, సీఆర్‌డీఏలోని లంచావతారుల పుణ్యమా అని ప్రభుత్వానికి చెడ్డపేరు వచ్చే పరిస్థితి ఏర్పడింది. దీనిపై వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఉన్నతాధికారులు స్పందించ లేదు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

సీఆర్‌డీఏ పట్టణ ప్రణాళికా విభాగంలోకి కొంత కాలం కిందట సచివాలయాల నుంచి ఉద్యోగులను డిప్యూటేషన్ పద్ధతిలో తీసుకున్నారు.. ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న వారి నాన్ లేవుట్లకు సంబంధించి క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలు సేకరించి ఇవ్వటానికి అధికారులు ఈ ఉద్యోగులను ఫీల్డ్‌కు పంపుతున్నారు. అయితే, క్షేత్ర స్థాయి పరిశీలన పేరుతో వీరు ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకున్న వారికి ఫోన్లు చేస్తున్నారు. కొంతమంది జంకూ గొంకూ లేకుండా ఫోన్లలోనే తాము ఫలానా రోజు, ఫలానా సమయానికి వస్తున్నామని, డబ్బులు సిద్ధం చేసుకోవాలంటూ తెగేసి చెబుతున్నారు. వచ్చిన తర్వాత బేరసారాలుండవంటూ మరికొందరు కరాఖండిగా చెపుతున్నారు. ఇంకొందరు ఫీల్డ్ విజిట్‌కు వచ్చిన క్రమంలో తమ మనసులో మాట బయట పెడుతున్నారు. నాన్ లే అవుట్ల క్రమబద్ధీకరణకు అపరాధ రుసుమును చెల్లించాల్సి ఉంటుంది. క్షేత్ర స్థాయిలో పరిశీలించటానికి వచ్చిన వారు రూ.లక్షల్లో లంచాలివ్వాలని పీక్కుతింటుంటే ముున్ముందు వివిధ స్థాయిల్లో ఉన్న అధికారులకు ఏ రకంగా లంచం సమర్పించుకోవాల్సి వస్తుందోనని దరఖాస్తుదారులు భయపడే పరిస్థితి వచ్చింది.



క్షేత్రస్థాయి పరిశీలనకు వస్తున్న సిబ్బంది నాన్ లేఅవుట్లకు సంబంధించిన వాస్తవ అతిక్రమణలను గుర్తించి నమోదు చేయాల్సి ఉంటుంది. ఒకరకంగా గ్రౌండ్ రిపోర్టును ఇవ్వాల్సి ఉంటుంది. ఎల్ఆర్ఎస్ అనేదే క్రమబద్ధీకరణ పథకం. అపరాధ రుసుము చెల్లించి క్రమబద్ధీకరణ చేయించుకోవటమే ఈ పథకం ఉద్దేశ్యం. కానీ, గ్రౌండ్ రిపోర్టు పేరుతో నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వాస్తవ పరిస్థితులను దాచి, మీకు ప్రయోజనం కలుగుతుందంటూ క్షేత్ర స్థాయి సిబ్బంది లంచాలను డిమాండ్ చేస్తున్నారు. క్షేత్ర స్థాయి సిబ్బంది చెప్పే మాటలకు నాన్ లే అవుట్ల యజమానులేమీ వారి బుట్టలో పడిపోవటం లేదు. ఎందుకంటే ఒక లే అవుట్‌లో నిర్ణయించిన దానికంటే రోడ్డు వెడల్పు లేకపోతే, ఆ రోడ్డు పక్కనే ఉన్న ప్లాట్‌లో ఇంటిని నిర్మించుకుని ఉంటే.. చాలా సమస్యలు వస్తాయి... ఇప్పుడు తప్పించుకున్నా రేపు బీపీఎస్‌లోనూ సమస్యలు వస్తాయి.. కాబట్టి క్షేత్ర స్థాయిలో చాలా మంది నాన్ లే అవుట్ యజమానులు లంచాలు ఇవ్వటానికి ససేమిరా అంటున్నారు. కొందరు అంత కాదులే అంటూ కొంత మేర చేతిలో పెట్టి పంపిస్తున్నారు. గత రెండు దశాబ్దాల కాలంలో చూస్తే ఎన్నో ఎల్ఆర్ఎస్ అవకాశాలు వచ్చాయి. నాన్ లేఅవుట్ల క్రమబద్ధీకరణ పేరుతో మాత్రం కిందిస్థాయిలోనే సిబ్బంది లంచాలు డిమాండ్ చేయటం ఇదే ప్రథమమని భవన నిర్మాణరంగానికి చెందిన పలువురు చెబుతున్నారు.

ఊపందుకోని దరఖాస్తులు

ఎల్ఆర్ఎస్ కు దరఖాస్తు చేసుకోవటానికి ఈ నెల 23వ తేదీ వరకు అవకాశం ఉంది. రాష్ట్ర ప్రభుత్వం గడువు పెంచితే చెప్పలేం కానీ.. మరో పక్షం రోజుల సమయం ప్రస్తుతం ఉంది. దాదాపుగా ఐదు వేలకు పైగా నాన్ లే అవుట్లు ఉంటే.. ఇప్పటి వరకు కేవలం రెండు వేల వరకు మాత్రమే దరఖాస్తులు రావడం చూస్తే, ఎందుకో వేగం లేదనిపిస్తోంది. కారణాలు ఏమై ఉంటాయన్నది అంతు చిక్కటం లేదు.

సీఆర్‌డీఏ పరిధిలో భారీగా అక్రమ లే అవుట్లు

రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ (సీఆర్‌డీఏ) పరిధి ప్రస్తుత ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు, పల్నాడు, గుంటూరు జిల్లాల పరిధిలో ఉంది. డెవలప్‌మెంట్ జోన్ల ప్రాతిపదికన సీఆర్‌డీఏ గతంలో గుర్తించిన కొన్ని నాన్ లే అవుట్ల జాబితాను అధికారికంగా విడుదల చేశారు. ఈ జాబితా ప్రకారం చూస్తే నూజివీడు జోన్ పరిధిలో 29 నాన్ లే అవుట్లు ఉన్నాయి. నందిగామ జోన్‌లో 11, గన్నవరం జోన్‌లో 16, ఉయ్యూరు జోన్‌లో 12 , సెంట్రల్ జోన్ పరిధిలో ఐదు, గుంటూరు జోన్ పరిధిలో 36, తెనాలి జోన్ పరిధిలో 31 లే అవుట్లు ఉన్నాయి. సీఆర్‌డీఏ అధికారిక లెక్కల ప్రకారం చూస్తే కేవలం 130 లే అవుట్లు మాత్రమే ఉన్నాయి. వాస్తవంగా చూస్తే సీఆర్‌డీఏ పరిధిలో వెయ్యికిపైగానే నాన్ లే అవుట్లు ఉన్నాయి. ఈ నాన్ లే అవుట్లు అన్నింటినీ కూడా చాలా వరకు సీఆర్‌డీఏ ప్లానింగ్ విభాగం అధికారులు గతంలో చూసీ చూడనట్టు వదిలేశారు. పాతవి కూడా కలిపితే నాలుగు వేలకు పైగా నాన్ లే అవుట్లు ఉన్నాయి. వీటిలో ఇప్పటి వరకు రెండు వేల వరకు లే అవుట్లు వచ్చాయి.

ఎయిర్ కార్గో ఫోరం ఇండియా ఏపీ చాప్టర్ చైర్మన్‌గా సాంబశివరావు ఎన్నిక

అమరావతి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ఎయిర్ కార్గో ఫోరం ఇండియా (ఏసీఎఫ్ఐ) ఆంధ్రప్రదేశ్ చాప్టర్ చైర్మన్‌గా ఏపీ చాంబర్స్ మాజీ అధ్యక్షుడు డాక్టర్ గడ గొట్టు సాంబశివరావు ఎన్నికయ్యారు. సాంబశివరావు ఎన్నికతో ఏపీ ఛాంబర్స్, ఏసీఎఫ్ఐ కలిసి రాష్ట్రంలో అంతర్జాతీయ ఎయిర్ కార్గో సదుపాయాల అభివృద్ధికి సమర్థంగా పని చేయగలవని ఏపీ చాంబర్స్ అధ్యక్షుడు పొట్లూరి భాస్కరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 'ప్రస్తుతం ఏపీలో ఉన్న విశాఖపట్నం, రాజమండ్రి, విజయవాడ, తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయాల్లో ఎయిర్ కార్గో కార్యకలాపాల అభివృద్ధికి గొప్ప అవకాశాలున్నాయి. రాష్ట్రం నుంచి మెరైన్ ఉత్పత్తులు, పువ్వులు, ఔషధాలు, మొక్కల ఎగుమతులతోపాటు పారిశ్రామిక, ఓడల విడిభాగాలు, బంగారం, వెండి, వజ్రాల వంటి ఉత్పత్తుల దిగుమతులు పెంచేందుకూ అవకాశాలున్నాయి. ప్రస్తు తం ఏపీ నుంచి పచ్చి పదార్థాల ఎగుమతులన్నీ హైదరాబాద్, బెంగళూరు, చెన్నై విమానాశ్రయాల నుంచి జరుగుతున్నాయి. దీనికి రాష్ట్రంలోని ప్రధాన విమానాశ్రయాల్లో సరిపడినంతగా ఎయిర్ కార్గో మౌలిక సదుపాయాలు లేకపోవడమే కారణం. రాష్ట్రంలో ఎయిర్ కార్గో కనెక్టివిటీ బలోపేతమైతే పరిశ్రమలు, ఎంఎస్ఎంఈలు, మహిళా పారిశ్రామికవేత్తలు, స్టార్టప్ కంపెనీలు లాభపడతాయి' అని భాస్కరరావు వివరించారు.

సింగపూర్‌కు ఇండిగో

(5వ పేజీ తరువాయి)

సింగపూర్‌లోని ఛాంగీ విమానాశ్రయానికి కొత్త సర్వీసులు నడుస్తాయి. వారంలో మంగళ, గురు, శనివారాల్లో నడుస్తాయి.

గతంలో భలే డిమాండ్

గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో అమరావతి రాజధాని నిర్మాణ క్రమంలో విజయవాడ నుంచి సింగపూర్‌కు విమాన సర్వీసులను ప్రవేశపెట్టాలని వివిధ వర్గాల నుంచి డిమాండ్ వచ్చింది. వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ (వీజీఎఫ్) విధానంలో ఇండిగో సంస్థ విమాన సర్వీసు నడిపేందుకు ముందుకొచ్చింది. నాటి ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు దీనిని ప్రారంభించారు. ఈ సర్వీసు రూ.9,500 టికెట్‌తో 90 శాతం ఆక్యుపెన్సీతో నడిచింది. ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల ప్రయాణికులే కాకుండా ఉభయగోదావరి, ప్రకాశం జిల్లాలతో పాటు ఖమ్మంజిల్లా ప్రజలు కూడా ఉపయోగించుకున్నారు. వీజీఎఫ్ విధానం ప్రకారం విమాన ప్రయాణికులు తగ్గితే, ఆ న ష్టాన్ని ప్రభుత్వం నిర్దీత కోటా మేరకు భరిస్తుంది. కానీ, సింగపూర్ విమాన సర్వీసుకు వచ్చిన అనూహ్య ఆదరణతో వీజీఎఫ్ అవసరమే లేకుండాపోయింది.

వైసీపీ హయాంలో సర్వీసు రద్దు

వైసీపీ ప్రభుత్వం వచ్చాక వీజీఎఫ్ విధానాన్ని ఉపసంహరించుకుంది. దీంతో ఇండిగో సర్వీసును రద్దు చేసింది. దీని వల్ల వ్యాపార వర్గాలు, పర్యాటకులు, విద్యార్థులు, ఎన్ఆర్ఐలు నష్టపోయారు. నాటి నుంచి ఆరేళ్లుగా విజయవాడ నుంచి సింగపూర్‌కు విమాన సర్వీసు నడవలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. సింగపూర్‌కు విమాన సర్వీసును నడపాలని వ్యాపార వర్గాల నుంచి పెద్ద ఎత్తున డిమాండ్ వచ్చింది. ఏపీ చాంబర్స్ కూడా లేఖలు రాయడంతో ఇన్నాళ్లకు కల సాకారమైంది. అమరావతి పునర్నిర్మాణం దిశగా అడుగులు వేయటంతో పాటు విదేశీ పెట్టుబడిదారులకు కూడా ఆహ్వానం పలుకుతోంది. స్వర్ణాంధ్ర-2047 విజన్ లక్ష్యాలను రూపొందించుకుని పర్యాటకాభివృద్ధిని సాధించాలన్న లక్ష్యాలను నిర్దేశించుకుంది. సింగ పూర్ విమాన సర్వీసు ద్వారా విదేశీ పర్యాటకులను ఆకర్షించటానికి అవకాశాలు ఉంటాయి. విజయవాడ, అమరావతి సందర్శన ద్వారా పర్యాటకాభివృద్ధికి దోహదపడుతుంది. కార్గో రవాణాకు ఆస్కారం ఏర్పడుతుంది. ఉద్యాన పంటలను సింగపూర్ వంటి దేశాలకు ఎగుమతులు చేయవచ్చు.

హైటెన్షన్

(5వ పేజీ తరువాయి)

డబుల్ సస్పెన్షన్ హార్డ్‌వేర్ లేదు. కేవలం సింగిల్ సస్పెన్షన్ హార్డ్‌వేర్ మాత్రమే ఉంది. హైటెన్షన్ టవర్లను పర్యవేక్షించటానికి విద్యుత్ శాఖలో పెద్ద టీమ్ ఉంటుంది. ఈ పెట్రోలింగ్ టీమ్‌లో ఒక ఏడీఈ స్థాయి అధికారి, ఒక ఏఈ, పదిమంది బృందం ఉంటుంది. రోజువారీ పర్యవేక్షణకు వీలుగా వీరికి ప్రత్యేక వాహనాలు ఉంటాయి. మెటీరియల్ తీసుకెళ్లడానికి మినీవ్యాన్, బొలేరో వాహనం కూడా ఉంటుంది. అయినా.. విద్యుత్‌శాఖ అధికారులు సరిగ్గా పర్యవేక్షించట్లేదు. ప్రమాదం జరిగితే గుట్టుగా ఉంచే ప్రయత్నం చేశారు తప్ప.. దానిని విశ్లేషించుకుని దిద్దుబాటు చర్యలు చేపట్టలేదు. విద్యుత్ హైటెన్షన్ వైర్ల పెట్రోలింగ్‌కు ప్రభుత్వం కోట్లాది రూపాయలను ఖర్చు చేస్తుంటే, విద్యుత్ శాఖ అధికారులు ఏం చేస్తున్నారో అర్థంకాని పరిస్థితి. అడపదడపా తప్ప రోజూ పెట్రోలింగ్ జరగటం లేదన్న విమర్శలు వస్తున్నాయి.

డబుల్ సస్పెన్షన్ హార్డ్‌వేర్ ఎందుకు మార్చరు?

ట్రాన్స్‌మిషన్ హైటెన్షన్ టవర్ల కారణంగా నగరంలో ప్రమాదాలను నివారించటానికి వీలుగా డబుల్ సస్పెన్షన్ హార్డ్‌వేర్‌ను ఏర్పాటు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికీ సింగిల్ సస్పెన్షన్ హార్డ్‌వేర్ నడుస్తోంది. డబుల్ సస్పెన్షన్ హార్డ్‌వేర్‌ను ఎందుకు మార్చట్లేదో విద్యుత్‌శాఖ అధికారులే సమాధానం చెప్పాలి.

సూపర్ ఫాస్ట్..

(5వ పేజీ తరువాయి)

ఆధునికీకరణ, రూ.28.34 కోట్లతో రెండు ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, రూ.8.39 కోట్లతో స్కైవాక్, రూ.33.48 కోట్లతో పార్కింగ్ ఫ్లోర్స్, రూ.9.95 కోట్లతో రైల్వే ఆఫీస్ ఫ్లోర్, రూ.10.45 కోట్లతో డీమాలిషన్ పనులు, రూ.37.73 కోట్లతో రెసిడెన్షియల్ క్వార్టర్లు, రూ.35.76 కోట్లతో సైట్ డెవలప్‌మెంట్, రూ.56.44 కోట్లతో ఎక్స్‌టర్నల్ ఎలక్ట్రికల్ వర్క్స్, సబ్‌స్టేషన్, సోలార్ పవర్ జనరేషన్, లైటింగ్ వంటివి ఏర్పాటుచేయాలి. అలాగే, నాన్ మాండేటరీ కాంపోనెంట్ కాస్ట్ (ఎన్ఎంసీసీ) కింద రూ.103.34 కోట్లతో కమర్షియల్ బిల్డింగ్, రూ.61.60 కోట్లతో హోటల్, రూ.19.91 కోట్లతో కమర్షియల్ ఫ్లోర్స్ చేపట్టాలి. కాంట్రాక్టు సంస్థకు 60 ఏళ్ల పాటు లీజుకు ఇచ్చారు. అప్పటివరకు దశలవారీగా అభివృద్ధి చేసుకోవచ్చు.

బెజవాడ- బెంగళూరు వందేభారత్ ఎప్పటికి?

(5వ పేజీ తరువాయి)

నుంచి విజయవాడ డివిజన్ అధికారులకు ఆదేశాలు కూడా వచ్చాయి. విజయవాడ డివిజన్ అధికారులు తగిన ప్రతిపాదనలను సిద్ధం చేశారు. ఏ సమయంలో విజయవాడ-బెంగళూరు వందేభారత్‌ను నడపాలి? ఏయే స్టేషన్లకు హాల్టింగ్ ఇవ్వాలి? వంటి వివరాలతో కూడిన షెడ్యూల్‌ను రూపొందించి అందజేశారు. కానీ, రైల్వేబోర్డు నుంచి సానుకూల స్పందన రాలేదు. మలివిడతగా ఇచ్చే వందేభారత్ రైళ్లలో విజయవాడకు అవకాశం లేదని తెలుస్తోంది.

డిమాండ్ ఉన్నా..

దేశంలోనే రెండో అతిపెద్ద రైల్వే జంక్షన్‌గా ఉన్న విజయవాడ మీదుగా గూడ్స్‌తో కలిపి నిత్యం 400 పైబడి రైళ్ల రాకపోకలు సాగిస్తున్నాయి. ఆదాయం కూడా గణనీయంగా వస్తోంది. కానీ, విజయవాడ డివిజన్ విషయంలో రైల్వేబోర్డు స్థాయిలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. కొత్త రైళ్ల కేటాయింపు విషయంలో అన్యాయం జరుగుతోందన్న ఆరోపణలు కూడా వస్తున్నాయి. విజయవాడ నుంచి తమిళనాడు, కర్నాటక వెళ్లే రైళ్లన్నీ రద్దీగా నడుస్తాయి. సీజన్లతో సంబంధం లేకుండా వీటికి డిమాండ్ ఉంటుంది. డిమాండ్‌కు సరిపడా రైళ్లు మాత్రం తిరగట్లేదు. బెంగళూరుకు వేగవంతమైన ప్రయాణాన్ని కోరుకుంటున్న వారంతా సూపర్‌ఫాస్ట్ రైళ్లలో అడ్వాన్స్‌గా బుకింగ్ చేసుకునే పరిస్థితి ఉంది. వీకెండ్స్ సెలవుదినాల్లో ఈ రెండు ప్రధాన రూట్లలో బెర్త్ దొరకడం కష్టమే.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	130,139, 150
చికెన్ విత్ స్కిన్	248
చికెన్ స్కిన్‌లెస్	258

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 515

ఎన్‌సీసీ మహిళా క్యాడెట్‌ల ఎంపిక



మొగల్రాజపురం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): పీబీ సిద్ధార్థ కళాశాలలో శనివారం ఎన్‌సీసీ మహిళా క్యాడెట్‌ల ఎంపిక జరిగింది. నాల్గవ ఆంధ్రా గర్ల్స్ బెటాలియన్‌లోకి డిగ్రీ మొదటి సంవత్సరం విద్యార్థినుల నుంచి 50 మందిని క్యాడెట్‌లుగా ఎంపిక చేశారు. వీరికి పలు రకాల పరీక్షలు పెట్టి ఎంపిక చేసినట్లు ఏఎన్‌వో డాక్టర్ రోహిణి కుసుమ చెప్పారు. ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్, డైరెక్టర్ వేమూరి బాబూరావు, ఎన్‌సీసీ ఎస్ఎం భగవాన్ దాస్, జీసీఐ ఊర్మిళ పాల్గొన్నారు.



ఆటోనగర్‌లో అన్నప్రసాద వితరణ

ఆటోనగర్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ఇస్కాన్ అన్నామృత, జవహర్ ఆటోనగర్ ఐలా మాజీ చైర్మన్ సుంకర దుర్గాప్రసాద్ మిత్రుల సహకారంతో ఆటోనగర్‌లో శనివారం అన్నప్రసాద వితరణ జరిగింది. గత ఐదు రోజులుగా పేదలకు అన్నప్రసాద వితరణ చేస్తున్నామని, మరో పది రోజుల పాటు చేస్తామని సుంకర దుర్గాప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో ఇస్కాన్ ప్రతినిధులు ఫణిదేవా ప్రభుజీ, లక్ష్మినాథ గోవింద దాస్ ప్రభుజీ, ఆటోనగర్ ప్రముఖులు దుర్గాప్రసాద్, అన్నే శివనాగేశ్వరరావు, బాహుబలేంద్ర కోటేశ్వరరావు, కత్తిక శివ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ మొబైల్ వ్యాన్ ద్వారా ఎయిడ్స్‌పై ప్రచారం

ఆటోనగర్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్, హెచ్ ఐవీ నియంత్రణలో భాగంగా ది కృష్ణా డిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏపీ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ సహకారంతో డిజిటల్ మొబైల్ వ్యాన్ ఐఈసీ(ఇన్ఫర్మేషన్, ఎడ్యుకేషన్, కమ్యూనికేషన్) ద్వారా శనివారం ఆటోనగర్‌లో ఎయిడ్స్‌పై ప్రచారం నిర్వహించారు. వాహనం స్క్రీన్‌పై పలు రకాల చిత్రాలను ప్రదర్శించి ప్రచారం చేశారు. ఆటోనగర్ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ప్రాజెక్టు మేనేజర్ ఎస్ఎస్ సాంబశివరావు మాట్లాడుతూ ఎయిడ్స్‌పై అవగాహన పెంచడానికి విస్తృత స్థాయిలో ప్రచారం చేస్తున్నట్లు వివరించారు. సంస్థ ప్రతినిధులు,లారీ డ్రైవర్లు, క్లీనర్‌లు, పలు విభాగాల మెకానిక్‌లు పాల్గొన్నారు.



మట్టపల్లి పార్థికి అభినందనలు

గుణదల, అక్టోబరు 11 (ఆంధ్ర జ్యోతి): నాట్య సుధామయి అనే బిరుదు అందుకున్న మట్టపల్లి పార్థిని రవీంద్ర భారతి నెక్స్‌జన్ స్కూల్ డైరెక్టర్ శాంతి, సీఈవో గౌతమిలు అభినందించారు. గుణద ల్లోని పాఠశాలలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ తమ పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న మట్టపల్లి పార్థిని విశ్వభారతి కూచిపూడి ఆర్ట్స్ అకాడమి వారు తిరుపతిలో నిర్వహించిన భారతీయ నృత్యం ఔన్నత్యం అనే అంశాన్ని అద్భుతంగా ప్రదర్శించి నాట్య సుధామయి అనే బిరుదు తీసుకుందని తెలిపారు. మట్టపల్లి పార్థిని భవిష్యత్తులో మరింతగా రాణించాలని, ఉన్నత స్థాయికి ఎదగాలని కోరు కుంటున్నట్లు తెలిపారు.



ఆటోనగర్ పాకల వీధిలో, ఏటీఏ రోడ్డులో, ఫైర్‌స్టేషన్ రోడ్డులో నిలిచిన వర్షపు నీరు, మురుగునీరు

ఆటోనగర్‌లో డ్రెయినేజీ అస్తవ్యస్తం

- రోడ్లపైనే మురుగునీరు
- దుర్వాసనతో ఇబ్బందిపడుతున్న స్థానికులు
- పట్టించుకోని ఐలా అధికారులు

ఆటోనగర్, ఆంధ్రజ్యోతి: విజయవాడ జవహర్ ఆటోనగర్‌లో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. ఎక్కడ మురుగునీరు అక్కడే నిలిసి దుర్వాసన కొడుతోంది. ముఖ్యంగా పల్లపు ప్రాంతాల్లో సైడ్ కాల్వల నుంచి మురుగునీరు రోడ్లపైకి వస్తోంది.

ఆటోనగర్‌లోని పాకలవీధి, కోటిరెడ్డివీధి, ఫైర్‌స్టేషన్ రోడ్డుతో పాటు పలు రహదారులు డ్రెయినేజీ నీటితో నిండిపోయి జనజీవనమే ఇబ్బందికరంగా మారింది. వంద అడుగుల రోడ్డు, పలు అంతర్గత రోడ్లలలో సైతం వర్షపునీరు రోడ్లపైనే ఉండటంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందికి గురవుతున్నారు. దీనికి తోడు వర్షపునీరు కూడా బయటకు వెళ్లేందుకు అవకాశం లేకపోవడంతో రోడ్లపైనే నిలుస్తున్నాయి. దీంతో మురుగునీరు, వర్షపునీటిపై ఈగలు, దోమలు వృద్ధిచెంది అనారోగ్య పరిస్థితులు ఏర్పడుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ పరిస్థితి గత కొంత కాలంగా ఉన్నా ఇటు ఐలా అధికారులు గానీ అటు ప్రజాప్రతినిధులు పట్టించుకున్న దాఖలా లేవని ఆటోనగర్ వాసులు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఆటోనగర్‌లో డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపరచాలని వారు కోరుతున్నారు.

డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపరచాలి



జవహర్ ఆటోనగర్‌లో అస్తవ్యస్తంగా ఉన్న డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపరచాలి. వర్షానికి డ్రెయినేజీలు పొంగి మురుగునీటితోపాటు వర్షపు నీరు సైతం రోడ్ల పైకి వచ్చి దుర్వాసన కొడుతోంది. స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దీనిపై ఐలా అధికారులు దృష్టి సారించాలి.

- అబ్దుల్ కలాం, ఆటో ఎలక్ట్రికల్ అసోసియేషన్ అధ్యక్షుడు, జవహర్ ఆటోనగర్

జనజీవనం స్తంభిస్తోంది.



జవహర్ ఆటోనగర్‌లో డ్రెయినేజీ వ్యవస్థ సరిగాలేక మురుగునీరు రోడ్లపైకి వచ్చి జనజీవనం స్తంభిస్తోంది. పాకలరోడ్డు, ఫైర్‌స్టేషన్ రోడ్డు, వంద అడుగుల రోడ్డులోని పలు ప్రాంతాల్లో నీరు నిలుస్తోంది. దీంతో రోడ్డు ప్రమాదాలు కూడా తరచుగా జరుగుతున్నాయి.

- మహమ్మద్ రిజ్వాన్, జామాక్ కోఆపరేటివ్ స్టోర్స్ చైర్మన్, జవహర్ ఆటోనగర్

13వ డివిజన్‌లో కొరవడిన పారిశుధ్యం



పటమట డొంక రోడ్డులో పేరుకున్న వ్యర్థాలు

రామలింగేశ్వరనగర్, ఆంధ్రజ్యోతి: పటమట 13వ డివిజన్‌లో అపరి శుభ్ర వాతావరణం రాజ్యమేలు తోంది. అంతర్గత, ప్రధాన రహదారులన్నీ చెత్తతో పేరుకుపోయి అధ్వాన్నంగా కనిపిస్తున్నాయి. ప్రధానంగా పటమట డొంక రోడ్డులో ఈ సమస్య తీవ్రంగా కనిపి స్తోంది. నివాస ప్రాంతాల నుంచి వచ్చే వ్యర్థాలను రోజుల తరబడి ఎత్తకపోవడంతో గుట్టలుగా పేరుకుపోయాయి. వీటి నుంచి వస్తున్న దుర్వాసన కారణంగా రోగాల బారిన పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్లపై చెత్తను ఎత్తకపోవడంతో ఇటీవల కురిసిన వర్షాలకు చెత్త వ్యర్థాలు దోమలకు ఆవాసాలుగా మారాయని అంటున్నారు. ఇప్పటికైనా కార్పొరేషన్ అధికారులు స్పందించి పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వర్తించాలని వేడుకుంటున్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకతకు సైన్స్ ప్రదర్శన



సోలార్ విద్యుత్‌ను తెలిపే ప్రదర్శన

ప్రిన్సిపాల్ రాయప్పరెడ్డి

భారతీనగర్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేం దుకు సైన్స్ ప్రదర్శన ఎంతో ఉపయోగపడుతుందని ప్రిన్సిపాల్ రాయప్పరెడ్డి తెలిపారు. పటమట ఎన్ఎస్ఎం పబ్లిక్‌స్కూల్‌లో ఇన్నోవా ఎక్స్‌పో-2025(సైన్స్ ఎగ్జిబిషన్)కార్యక్రమం శనివారం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ రాయప్ప రెడ్డి, కరస్పాండెంట్ మోంట్‌ఫోర్ట్ ప్రారంభించారు. విజ్ఞానశాస్త్రం, గణితశాస్త్రం, సాంఘికశాస్త్రాలకు సంబంధించిన ప్రాజెక్టులను, చార్టులను విద్యార్థులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రాయప్పరెడ్డి మాట్లాడుతూ విజ్ఞానశాస్త్రం, గణిత శాస్త్రం, సాంఘికశాస్త్ర అంశాలపై ఆసక్తిని పెంపొందించుటకు ఇలాంటి ప్రదర్శనలు ఉపయోగపడతాయని తెలిపారు. ఈ ఎగ్జిబిషన్‌లో ప్రధానంగా డ్రోన్‌షో, రాకెట్‌షో ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థులు 8రకాల రాకెట్లను, అవి పనిచేసే విధానాన్ని ప్రదర్శించారు. వైస్ ప్రిన్సిపాల్ బాలారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో వైద్య కళాశాల వసతి గృహం

- పెచ్చులూడి పడుతున్న వంటశాల శ్లాబ్
- బిక్కుబిక్కుమంటూనే గడుపుతున్న సిద్ధార్థ విద్యార్థులు, ఉద్యోగులు



వంటశాలలో పెచ్చులూడి పడిన శ్లాబ్



పెచ్చులూడి ఉన్న శ్లాబ్

(ఆంధ్రజ్యోతి, ప్రభుత్వా సుపత్రి):భావితరాలకు వైద్య సేవలు అందించాల్సిన సిద్ధార్థ వైద్య కళాశాల విద్యార్థుల పరి స్థితి మరింత దయనీయంగా మారింది. ఎంతో కష్టపడి వైద్య విద్యలో చేరిన విద్యా ర్థులు నేడు బిక్కుబిక్కు మంటూ భోజనం చేయాల్సిన దుస్థితి దాపురించింది. తమ కష్టాన్ని ఎన్ని సార్లు విన్నవించు కున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడంటూ విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే గుణదల ప్రాంతంలోని కొత్త ప్రభుత్వాసుపత్రి పక్కనే ఉండే సిద్ధార్థ వైద్య కళాశాల వసతి గృహ భవనం నిర్మాణం చేసి 50 ఏళ్లు దాటింది. దాదాపు 15 ఏళ్లుగా శిథిలావస్థలోనే కొట్టుమిట్టాడుతోంది. ఏ క్షణంలో కూలిపోతుందో తెలియని స్థితిలో ఉంది. ప్రస్తుతం వంట గది శ్లాబు పెచ్చులూడటంతో అక్కడ పని చేసే ఉద్యోగులు, విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. రోజూ 150 మంది విద్యార్థులు అదే ప్రాంతంలోని డైనింగ్ హాల్‌లో భోజనాలు చేస్తారు. హాలు పక్కనే వాహనాల పార్కింగ్ ఉంటుంది. వంట చేస్తుండగానే శ్లాబు పెచ్చులూడి పడటంతో వంట వారు బిక్కుబిక్కుమంటూ పనుల చేస్తున్నారు. మరమ్మతులైనా చేపట్టాలని ఎన్నిసార్లు వేడుకున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నారు.

దుర్గగుడి ప్రతిష్ఠను మరింత పెంచాలి

ఎమ్మెల్యే బోడె ప్రసాద్



ప్రమాణస్వీకారానికి వెళుతున్న శంకరబాబు

పెనమలూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడి ప్రతిష్ఠను మరింత పెంచాలని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ నూతన కమిటీకి సూచించారు. శనివారం దుర్గమ్మ ఆలయ పాలక మండలి కమిటీ ప్రమాణ స్వీకారానికి ఎమ్మెల్యే బోడె ప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పాలకమండలి అధ్యక్షుడు బొర్రా రాధాకృష్ణ, కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. పెనమలూరు నుంచి పాలకమండలి సభ్యునిగా ఎంపికయిన టీడీపీ సీనియర్ నాయకులు వెలగపూడి శంకరబాబును ప్రత్యేకంగా అభినందించారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ కూటమి నాయకులు అనుమోలు ప్రభాకరరావు, కోయ ఆనంద్‌ప్రసాద్, చిన్నారి, మంచినేని పరమేశ్ తదితరులు ఉన్నారు.

ఆక్వా రైతుల అభివృద్ధికి మరింత కృషి

- ఆక్వా రైతు ప్రతినిధి గద్దె కాంత్రికుమార్



ప్రధానికి ఆక్వా రైతుల సమస్యలను తెలియజేస్తున్న ఏపీ ఆక్వారైతు ప్రతినిధి గద్దె క్రాంతి కుమార్

భారతీనగర్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): కేంద్రపథకాలను సమర్థవంతంగా ఉపయోగించి ఆక్వా రైతుల అభివృద్ధికి మరింత కృషి చేస్తానని ఆక్వా రైతుల ప్రతినిధి, టీడీపీ యువనేత గద్దె కాంత్రికుమార్ అన్నారు. దేశ రాజధాని ఢిల్లీలో ప్రధాని మోదీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆక్వా రైతుల సమావేశానికి రాష్ట్రం తరపున ప్రతినిధిగా గద్దె క్రాంతికుమార్ శనివారం పాల్గొన్నారు. ఈ సమావేశంలో ప్రధానికి క్రాంతికుమార్ రాష్ట్రంలో ఆక్వారంగం దేశ ఆర్థికాభివృద్ధిలో ప్రధాన పాత్ర పోషిస్తోందని, ప్రస్తుతం ఆక్వా రంగం ఎదుర్కొంటున్న సమస్యలను తెలిపారు. రూ. 100కోట్ల వ్యయంతో నిర్మించిన 16మత్స్యకార ప్రాజెక్టులను ప్రధాని ప్రారంభించడం ద్వారా ఆక్వా రంగానికి నూతన ఊపునిచ్చిందని తెలిపారు.

పర్యావరణహితమే లక్ష్యం కావాలి: ఎమ్మెల్యే సుజనా



హిందుస్థాన్ ఏకో ప్రొడక్షన్స్‌ను ప్రారంభిస్తున్న సుజనా చౌదరి

కానూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): పర్యావరణహిత ప్లాస్టిక్‌ను పునర్వినియోగించడం ద్వారా వనరులు సంరక్షించుకోవచ్చని కేంద్ర మాజీ మంత్రి, పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి తెలిపారు. శనివారం కానూరు న్యూ ఆటోనగర్‌లో హిందుస్థాన్ ఏకో ప్రొడక్షన్స్‌ను స్వచ్ఛఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్, దూదేకుల కార్పొరేషన్ చైర్మన్ నాగుల్ మీరాతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు చక్కటి పర్యావరణాన్ని అందించేందుకు కృషిచేస్తూ వ్యాపారాన్ని ప్రారంభించిన ఏకో ప్రొడక్షన్స్ నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, కూటమి నేతలు పాల్గొన్నారు.







ఇనుములో.. ఓ హృదయం మొలిచెనే!

న్యూ లుక్‌తో స్క్రాప్ పార్క్! వాహనాల విడిభాగాలు, పాత ఐరన్ భాగాలతో విభిన్న ఆకృతులు

ఆంధ్రజ్యోతి, కార్పొరేషన్: స్క్రాప్ పార్క్ సరికొత్తగా ముస్తాబైంది! రంగురంగులతో మెరిసిపోతోంది! బందరు రోడ్డు, ఏలూరు రోడ్డులపై రాకపోకలు సాగించే వారికి కను 'విందు' చేస్తోంది. పోలీస్ కంట్రోల్ రూమ్ సమీపంలో ఉన్న వీఎంసీ స్క్రాప్ పార్కు నూతన హంగులతో సందర్శకులను ఆకట్టుకుంటోంది. పార్క్‌లో లాన్‌ను అభివృద్ధి చేశారు. కళాఖండాలను ఉంచటానికి వీలుగా కొన్ని కట్టడాలు కట్టారు. కట్ చేస్తే.. సరికొత్తగా స్క్రాప్ పార్క్ ముస్తాబైంది. దీంతో అటుగా రాకపోకలు సాగించే ప్రజలతోపాటు ప్రయాణికులను ఇతర ప్రాంతాల నుంచే వచ్చే వారిని ఆకట్టుకుంటున్నాయి. బస్టాండ్, రైల్వేస్టేషన్‌తో

కంట్రోల్ రూమ్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలాన్ని గత టీడీపీ ప్రభుత్వ హయాంలో వాహనాల విడిభాగాలు, ఐరన్ స్క్రాప్, పాత ఇనుము డిస్కులు తదితర ఐరన్ వ్యర్థాలతో అద్భుతమైన ఇనుప కళాఖండాలను సృష్టించారు. వివిధ జంతువులు, పక్షుల బొమ్మలతో అందంగా తీర్చిదిద్దారు. ఇవి సందర్శకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. తాజాగా వాటికి ఇటీవల మరలా మెరుగులు దిద్దారు. అందంగా రంగులు వేశారు. పాటు నగరంలోని ప్రధాన కూడలి కావడంతో నిత్యం వేలాది మంది సందర్శకులు ఈ పార్కును సందర్శించి ఆనందంతో కేరింతలు కొడుతున్నారు. స్క్రాప్ పార్కులో జింక, డైనోసర్, జిరాఫీ, కప్ప, ఈగ, మోటర్ సైకిల్, వివిధ పక్షుల బొమ్మలు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. పార్కులో ఈ ఆకృతులను చూసేందుకు నగరంలోని ప్రజలు అధిక సంఖ్యలో తరలివస్తున్నారు. ఈ పార్కు నగరానికి నూతన శోభను తీసుకొచ్చింది.



సీపీ రాజశేఖరబాబుకు ఆహ్వానం పలుకుతున్న పోలీస్ డాగ్

డాగ్ కెనాల్స్ ప్రారంభం

విజయవాడ సిటీ, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): బందోబస్తులు, నేర పరిశోధనలలో డాగ్స్ సేవలు ప్రశంసనీయమని పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు అన్నారు. నగరంలోని సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్ గ్రౌండ్‌లో నూతనంగా నిర్మాణం చేసిన డాగ్ కెనాల్స్‌ను ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ఈ ఏడాది ఆగస్టు నెలలో డాగ్ కెనాల్స్ నిర్మాణానికి శంకుస్థాపన చేసి అనతి కాలంలోనే నిర్మాణం పూర్తి చేయించామన్నారు. మందస్తు భద్రతా చర్యల్లో భాగంగా ఎక్స్‌ప్లోజివ్స్‌ను గుర్తించడంలో డాగ్స్ కీలకంగా వ్యవహరిస్తాయన్నారు. శిక్షణ తీసుకున్న పోలీస్ డాగ్స్ కమిషనర్‌కు స్వాగతం పలికాయి. అనంతరం డాగ్స్ నైపుణ్యాలను ప్రదర్శించారు.

రాష్ట్రంలో ఎయిర్ కార్గో సేవలు
అందుబాటులోకి రావాలి

● ఏపీ చాంబర్స్ అధ్యక్షుడు భాస్కరరావు

విజయవాడ సిటీ, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎయిర్ కార్గో సేవలు అందుబాటులోకి తీసుకురావాల్సిన ఆవశ్యకత ఉందని ఏపీ చాంబర్స్ అధ్యక్షుడు పొట్లూరి భాస్కరరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో విజయవాడ, తిరుపతి, విశాఖపట్నం, రాజమండ్రిలో ఎయిర్ పోర్టులు ఉన్నాయని, ప్రస్తుతం వాటి విస్తరణ కొనసాగుతుండటంపై సంతోషం వ్యక్తం చేశారు. అయితే రాష్ట్రానికి మత్స్య ఉత్పత్తులు, పువ్వులు, ఔషధాలు, మొక్కలు, బంగారం, వెండి, వజ్రాలు, పారిశ్రామిక పరికరాలకు ఎగుమతులు, దిగుమతులు జరుతాయన్నారు. రాష్ట్రంలో ఎయిర్ కార్గో సర్వీసు అందుబాటులో లేకపోవడంతో నేటికీ ఎగుమతులు, దిగుమతులు బెంగుళూరు, హైదరాబాద్, చెన్నై విమానాశ్రయాల నుంచి జరుగుతుందన్నారు. రాష్ట్రంలో ఎయిర్ కార్గో సేవలు అందుబాటులోకి వస్తే పరిశ్రమలు, ఎంఎస్ఎంఈలు, మహిళా వ్యాపారవేత్తలు, స్టార్టప్‌లు లాభపడతాయన్నారు. రాష్ట్రంలో బలమైన కార్గో వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు చొరవ చూపాలని ఎయిర్ కార్గో ఫోరం ఇండియా (ఎసీఎఫ్ఐ)ను ఆయన కోరారు.



పంచాయతీ కార్యదర్శుల నూతన కార్యవర్గం

కృష్ణాజిల్లా పంచాయతీ కార్యదర్శుల సంఘం ఎన్నిక

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): కృష్ణాజిల్లా పంచాయతీ కార్యదర్శుల సంఘ అధ్యక్షుడిగా బందరు మండలం కరగ్రహారం కార్యదర్శి కే నరసింహారావు ఎన్నికయ్యారు. ఏపీ ఎన్జీవో హోంలో శనివారం జరిగిన ఎన్నికలకు డీపీవో కార్యాలయ ఏవో సీతారామయ్య ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. ప్రధాన కార్యదర్శిగా కే రామ్మోహనరావు, అసోసియేట్ అధ్యక్షుడిగా పెనమలూరు మండలం గంగూరు పంచాయతీ కార్యదర్శి డీ ప్రకాష్‌నాథ్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా బాపులపాడు మండలం మడిచర్ల పంచాయతీ కార్యదర్శి సీహెచ్ రామాంజనేయులు, కోశాధికారిగా మచిలీపట్నం మండలం చిన్నాపురం పంచాయతీ కార్యదర్శి జే రాధాకృష్ణ, ఉపాధ్యక్షుడిగా సీహెచ్ రాజేష్, ఝాన్సీలక్ష్మి, ఎలీషా, ఏవీ చిరంజీవి (గూడూరు), సంయుక్త కార్యదర్శులుగా సాయిరాం (మానికొండ), ఎంఎస్ఎన్‌మూర్తి (మచిలీపట్నం), మునిరాజు (కాటూరు) ఎన్నికయ్యారు. వీరితో పాటు 10 మంది కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పూర్వ అధ్యక్షుడు కొత్త శ్రీనివాసరావు, రాష్ట్ర పంచాయతీ కార్యదర్శుల ప్రధాన కార్యదర్శి జీటీవీ రమణ పాల్గొన్నారు. నూతన కార్యవర్గాన్ని జిల్లా పంచాయతీ అధికారి డాక్టర్ జే అరుణ అభినందించారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

● రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన డైరెక్టర్ జనరల్ పీవీ రమణ

కలెక్టరేట్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): బాణసంచా తయారీ, నిర్వహణ, నిల్వ ప్రక్రియలో భద్రతా ప్రమాణాలను పాటించి అగ్ని ప్రమాదాలు, పేలుళ్లను నివారించేందుకు నిర్దేశించిన ప్రామాణిక నిర్వహణ విధానాలను ఖచ్చితంగా పాటించాలని రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన, అగ్నిమాపక సేవల శాఖ డైరెక్టర్ జనరల్ పీవీ రమణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పేలుడు పదార్థాల నియమాలు, 2008కి అనుగుణంగా, లైసెన్స్ పొందిన తయారీదారులు విధిగా భద్రతా చర్యలను పాటించాలన్నారు. ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోబడతాయని డైరెక్టర్ జనరల్ పీవీ రమణ తెలియజేశారు.

శభాష్ పోలీస్

● శనివారం అర్ధరాత్రి దిగబడిన ఆటో
● బైపాస్ వద్ద భారీగా నిలిచిన ట్రాఫిక్
● ఎవరూ పట్టించుకోని దైన్య పరిస్థితి
● ఇంటికి వెళ్తూ చూసిన సూపర్‌కాప్
● వర్షం పడుతున్నా రాత్రంతా ఒక్కడే శ్రమదానం చేసి గుంతలు పూడ్చిన వైనం
● ఆన్‌లైన్‌లో వైరల్‌గా మారిన వీడియో

బాధ్యతగా వ్యవహరించాల్సిన వారు బాధ్యతా రాహిత్యంగా వ్యవహరిస్తుంటే, తన పని కాకపోయినా ప్రజల ఇబ్బందులు తీర్చేందుకు రవికిరణ్ అనే కానిస్టేబుల్ పడిన ఆరాటం అందరినీ అబ్బురపరిచింది. అర్ధరాత్రి కురిసిన వర్షానికి నందిగామ వద్ద జాతీయ రహదారి జలమయం కావడంతో పాటు రోడ్డుపై ప్రమాదకరమైన గుంతలున్నాయి. తెలిసీ తెలియక వాహనదారులు ఆ గుంతల్లో పడి వాహనదారులు ప్రమాదాల బారిన పడతారేమోనన్న ఆందోళనతో ఆ గుంతల్లోని నీటిని బయటికి పంపాడు. అంతటితో ఆగకుండా ఒక్కడే ఆ గుంతలన్నీ పూడ్చిన మానవత్వాన్ని చాటుకున్నాడు. రవి కిరణాలు సోకకముందే ప్రకాశించిన రవికిరణ్ మానవత్వం అందరికీ ఆదర్శం కావాలి. బాధ్యతలు విస్మరించిన పాలకులు, అధికారులు, కాంట్రాక్టర్లు చివరకు నిర్లక్ష్యాన్ని నిలదీయలేని ప్రజలు సిగ్గుపడేలా శ్రమదానం చేసి వేలాది మంది ప్రజలు ప్రమాదం బారిన పడకుండా చేసిన హైవే కానిస్టేబుల్ రవికుమార్ సూపర్ పోలీస్‌గా నిలిచాడు.

- ఆంధ్రజ్యోతి, నందిగామ





మట్టిని తవ్వుతున్న కానిస్టేబుల్ రవికుమార్, డిప్పలతో మట్టిని తీసుకెళుతున్న రవికుమార్

నందిగామ వద్ద బైపాస్ రోడ్డు నిర్మాణ పనులు అర్థాంతరంగా ఆగిపోయాయి. దాదాపు 9 నెలల క్రితం కాంట్రాక్టర్, సబ్ కాంట్రాక్టర్ విభేదాలతో పనులు నిలిచిపోయాయి. దీంతో బైపాప్ అప్రోచ్ రోడ్డుపైనే వాహనాల రాకపోకలు జరుగుతున్నాయి. నిత్యం వేలాది వాహనాలు పయనిస్తుంటాయి. ఈ క్రమంలో అప్రోచ్ రోడ్డుకు గుంతలు ఏర్పడటంతో పలు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మహిళలు మృతి చెందారు. చాలామందికి గాయాలయ్యాయి. దీనిపై ప్రజలు పలుమార్లు అధికారులకు వినతి పత్రాలిచ్చినా ఫలితం దక్కలేదు. ముఖ్యంగా ఇదేరోడ్డుపై నుంచి పెద్ద పెద్ద అధికారులు, ఎమ్మెల్యేలు, మంత్రులు ఇబ్బంది పడుతూనే ప్రయాణం చేస్తున్నారే కానీ సదరు కాంట్రాక్టర్‌ను వారించేలేని స్థితిలో ఉన్నారు. మరోవైపు కనీస సౌకర్యాలు కల్పించకపోయినా టోల్‌ప్లాజాలు మాత్రం యథేశ్చగా వాహనదారుల నుంచి సొమ్ము గుంజుతున్నాయి. రోడ్లపై ఏమాత్రం అసౌకర్యం కలిగినా టోల్ చెల్లించాల్సిన పని లేదని హైవే అథారిటీ నిబంధనలు చెపుతున్నాయి. ఇదే అంశంపై సుప్రీం కోర్టు తీర్పు లున్నట్లు తెలిసింది. మరి టోల్ ఎలా వసూలు చేస్తున్నారన్నది ప్రశ్నగా మారింది.

అభినవ భారతీయుడు

అధికారులు, ప్రజా ప్రతినిధులు ఆఖరికి ప్రజలు సైతం బాధ్యతారాహిత్యంగా ఉన్నప్పటికీ హైవే కానిస్టేబుల్ రవికిరణ్ మాత్రం ఎంతో బాధ్యతగా వ్యవహరించాడు. హైవే పెట్రోలింగ్‌లో రాత్రి విధులు పూర్తి చేసుకొని ఇంటికి వెళ్లే సమయంలో శనివారం తెల్లవారుజామున భారీ వర్షం కారణంగా రోడ్డుపైకి నీరు చేరింది. దీంతో రోడ్డుపై ఉన్న గుంతలో ఆటో దిగబడింది. దీంతో ఒక్కసారిగా ట్రాఫిక్ నిలిచిపోయింది. క్షణాల్లో వాహనాలు వరుస కట్టాయి. పరిస్థితి ఆందోళనకరంగా మారడంతో రంగంలోకి దిగిన రవికిరణ్ కాంట్రాక్ట్ పనుల కోసం అక్కడే ఉంచిన వస్తువులు తీసుకొని సహాయక చర్యలు ప్రారంభించాడు. తొలుత రోడ్డుపై చేరిన నీటిని బయటికి పంపేశాడు. గుంతలో నిలబడిన నీటిని తోడి మరీ పక్కన పోశాడు. అంతటితో ఆగకుండా రోడ్డు నిర్మాణానికి నిల్వ ఉంచిన కంకరను అందులో పోసి ఒక్కడే గుంతలన్నీ పూడ్చాడు. రాత్రంతా మెళకువతో డ్యూటీ చేశానన్న బడలికను మరిచి మంచి మనస్సుతో శ్రమదానం చేశాడు. విధులు ముగిసిన తరువాత ఇంటికెళ్లి కుటుంబంతో సరదాగా గడపడం మానుకొని తన పని కాకపోయినా ప్రజల ప్రాణాలు కాపాడేందుకు రవికిరణ్ ఎంతో శ్రమించాడు. అధికారులు, ప్రజాప్రతినిధుల సంగతి అలా ఉంచితే ట్రాఫిక్‌లో ఇరుక్కొన్న ఉన్నవారైనా రవికిరణ్‌కు కనీస సాయం అందించలేదు. వాహనాలు దిగి వచ్చి సహకరించాలన్న కనీస బాధ్యత మర్చిపోయారు. గతంలోనూ రవికుమార్ ఇదే తరహాలో పలుచోట్ల గుంతలు పూడ్చినట్టు తెలిసింది. ఈ మొత్తం వ్యవహారాన్ని సెల్‌ఫోన్‌లో బంధించిన కొందరు వాహనదారులు రవికిరణ్ చేసిన పనిని సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. దీనిపై నెటిజన్లు రవికిరణ్‌ను అభినందిస్తున్నారు. ఇదే స్ఫూర్తితో రోడ్డు పనులు నిలిపివేయడంపై స్పందించాల్సి ఉంది. సౌకర్యాలు కల్పించకుండా డబ్బు దండుకుంటున్న టోల్ ప్లాజాలపైనా ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

రైతు సాధికారత లక్ష్యంగా
సరికొత్త పథకాలు

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



కలెక్టరేట్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): రైతుల క్షేమం, సంక్షేమమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎప్పటికప్పుడు సరికొత్త పథకాలు ప్రవేశపెడుతున్నాయని, వీటిని సద్వినియోగం చేసుకుని సాధికారత సాధించవచ్చని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. శనివారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ న్యూఢిల్లీలోని ఇండియన్ అగ్రికల్చర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో జరిగిన కార్యక్రమంలో రూ.24వేల కోటతో ధన్ ధాన్య కృషి యోజన (పీఎండీడీకేవై) పథకంతో పాటు రూ.11,440 కోట్లతో పప్పు ధాన్యాల్లో ఆత్మనిర్భరతా మిషన్‌ను ప్రారంభించారు. అలాగే వ్యవసాయ, అనుబంధ రంగాలకు సంబంధించి వివిధ ప్రాజెక్టులను జాతికి అంకితం చేయడంతో పాటు మరికొన్ని ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ లక్ష్మీశ వర్చువల్‌గా వీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు వివిధ పథకాలు, కార్యక్రమాలు ప్రారంభిస్తున్నాయని, వీటిపై అవగాహన పెంచుకుని సద్వినియోగం చేసుకోవడం ద్వారా సాగును లాభసాటిగా మార్చుకొని, ఆర్థికంగా ఎదగొచ్చన్నారు. జిల్లాలో రైతులను ప్రకృతి వ్యవసాయం దిశగా ప్రోత్సహిస్తున్నామన్నారు. పాడి రంగంలో మంచి వృద్ధికి అవకాశమున్న నేపథ్యంలో జిల్లా, నియోజకవర్గాల దార్శనిక ప్రణాళికల్లో స్పష్టమైన లక్ష్యాలను ఏర్పరచుకొని వాటి సాధనకు ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో కృషిచేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. నగరంలోని రాష్ట్ర వ్యవసాయ అధికారుల సంఘం భవనం (రైతు నిలయం) నుంచి కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా వీక్షించేందుకు ఏర్పాట్లు చేయగా జిల్లా వ్యవసాయ అధికారి డీఎంఎఫ్ విజయకుమారి, ఉద్యాన అధికారి పీ బాలాజీ కుమార్, ఏడీఏ జ్యోత్స్న, వ్యవసాయ అనుబంధ శాఖాధికారులు పాల్గొన్నారు.



అంతర్జాతీయ బాలికా దినోత్సవ పోస్టరును ఆవిష్కరిస్తున్న డీఆర్వో లక్ష్మీ నరసింహం

బాలికా విద్య, సాధికారతకు సమష్టి కృషి: డీఆర్వో

వివక్షకు తావులేకుండా బాలికలకు సమాన అవకాశాలు కల్పించినప్పుడే సమాజం పురోగతి సాధిస్తుందని, బాలికా విద్య, హక్కుల పరిరక్షణకు సమష్టిగా కృషిచేయాల్సిన అవసరముందని, డీఆర్వో ఎం లక్ష్మీ నరసింహం అన్నారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ, చైల్డ్‌రైట్స్ అడ్వొకసీ ఫౌండేషన్ (సీఆర్ఏఎఫ్) అధ్వర్యంలో భాగస్వామ్య పక్షాలకు ప్రత్యేక వర్క్‌షాపు జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన డీఆర్వో మాట్లాడుతూ బాలికా విద్య, ఆరోగ్యం, హక్కుల పరిరక్షణ, సామాజిక వివక్షను రూపుమాపడం, బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేయడం తదితరాల్లో సమన్వయ శాఖల అధికారులు ప్రత్యేక దృష్టిపెట్టాలని కోరారు. గ్రామ స్థాయిలో బాలల సంక్షేమం, భద్రతా కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈనెల 18 వరకు వివిధ రకాల పోటీలు నిర్వహించాలని సూచించారు. అనంతరం అంతర్జాతీయ బాలికా దినోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించారు. సీడీపీవో పీ భానుమతి, చైల్డ్‌వెల్ఫేర్ కమిటీ సభ్యులు రాధకుమారి, డీసీపీవో ఎం రాజేశ్వరరావు, సీఆర్ఏఎఫ్ డైరెక్టర్ ఫ్రాన్సిస్ తంబి, సమగ్రశిక్ష అధికారి శిరీష రాణి, ఎంఈవో పుష్పలత, చిన్నారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఒక వైపు సూపర్ సిక్స్...
ఇంకోవైపు సూపర్ జీఎస్టీ

● జీఎస్టీపై మంత్రి సవిత, ఎమ్మెల్యే గద్దె ప్రచారం

మొగల్రాజపురం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీలో సంస్కరణలు తీసుకురావడంతో నిత్యావసరాలపై పన్నులు తగ్గి అమ్మకాలు పెరగడంతో వ్యాపారులు, సూపర్ సిక్స్ పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారని మంత్రి సవిత, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. శనివారం నియోజకవర్గంలో 8వ డివిజన్ పాలీక్లినిక్ రోడ్డులో జీవీవీ రాధా మాధవ్ అపార్టుమెంట్స్‌లో మంత్రి సవితతో కలిసి ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ జీఎస్టీ-2.0 సంస్కరణలపై ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ ప్రధాని మోదీ తీసుకొచ్చిన జీఎస్టీ సంస్కరణలకు సీఎం చంద్రబాబు మద్దతు తెలపడం, ప్రజలు, వ్యాపారులు స్వాగతించడం మంచి పరిణామమన్నారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి నిత్యావసరాలు ధరలు పెరగడమే కానీ తగ్గింది లేదని కానీ జీఎస్టీ సంస్కరణలతో మోదీ, చంద్రబాబు చేసి చూపించారన్నారు. రాష్ట్ర ఖజానాకు రూ.8 వేల కోట్ల నష్టం జరిగినా ప్రజల కోసం సీఎం చంద్రబాబు, డీసీఎం పవన్ కల్యాణ్, మోదీ సంస్కరణలకు మద్దతు తెలిపినందుకు వారికి ధన్యవాదాలు చెబుతున్నామన్నారు. ఉమ్మడి కృష్ణాజిల్లా జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ గద్దె అనూరాధ, బొండా సుజాత, చెన్నుపాటి ఉషారాణి, పుట్టగుంట వెంకట సతీష్, దండమూరి స్టాలిన్, యార్లగడ్డ రాజశేఖర్, సంజయ్‌జైన్ పాల్గొన్నారు.

అండర్‌పాస్‌లు అటకెక్కినట్టేనా..?

● 2 నెలల క్రితం ఎంపీ చిన్ని, ఎమ్మెల్యే గద్దె, కలెక్టర్ పరిశీలన
● 3 చోట్ల అండర్‌పాస్‌లు అవసరమని నిర్ణయం
● ఇప్పటి వరకు ఆ దిశగా చర్యలు లేవు
● ఆవేదన వ్యక్తం చేస్తున్న స్థానికులు



సత్యం హోటల్ సెంటర్ వద్ద..

కృష్ణలంక, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక జాతీయ రహదారిపై అండర్‌పాస్‌ల నిర్మాణం అటకెక్కినట్టేనా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. 2 నెలల క్రితం ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, కలెక్టర్ లక్ష్మీశ, ఇరిగేషన్, జాతీయ రహదారులు, ఆర్ అండ్ బీ, మున్సిపల్, రెవెన్యూ శాఖల ఉన్నతాధికారులు, సిబ్బంది బస్టాండ్ నుంచి నేతాజి బ్రిడ్జి వరకు పరిశీలించారు. రైతు బజారు వద్ద వంతెన ఎదురుగా, అమెరికన్ ఆస్పత్రి వంతెన వద్ద, పశువుల ఆస్పత్రి వంతెన (నే తాజీ సుభాష్‌చంద్రబోస్ బ్రిడ్జి) వద్ద అండర్‌పాస్‌లు కావాలనివారు గుర్తించారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తామని హామీలు గుప్పించారు. కానీ ఇప్పటి వరకు అతీగతీ లేకపోవడంతో స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. పైగా ఆయా ప్రాంతాల్లో రోడ్డు దాటుతూ చాలా మంది ప్రాణాలు కోల్పోయారు.



'నెయిల్ రింగ్స్'తో నైస్‌గా...





మహిళలు గోళ్లమీద ప్రత్యేక శ్రద్ధ చూపిస్తుంటారు. గోళ్లను పొడవుగా పెంచి వాటిని చక్కగా షేప్ చేసి నెయిల్ పాలిష్ వేసుకుని మురిసిపోతుంటారు. ఫ్యాషన్ ట్రెండ్స్‌ను అమితంగా ఇష్టపడే అమ్మాయిలు మాత్రం నెయిల్ ఆర్ట్‌తో సందడి చేస్తుంటారు. గోళ్లమీద రంగు రంగుల డిజైన్లు సృష్టిస్తూ వాటిమీద చిన్న చిన్న రాళ్లు, పూసలు అతికిస్తూ సరికొత్త పోకడలను అనుసరిస్తున్నారు యువతులు. ఈ క్రమంలోనే 'నెయిల్ రింగ్స్' ట్రెండింగ్‌లోకి వచ్చేశాయి. నెయిల్ ఆర్ట్ కంటే సౌలభ్యంగా ఉండడంతో మహిళలు నేరుగా వీటిపై దృష్టి సారించడం మొదలుపెట్టారు. అన్ని వయసులవారిని అమితంగా ఆకర్షిస్తున్న ఈ 'నెయిల్ రింగ్స్' పై ఓ లుక్కేద్దామా...

ఇలా మొదలైంది...

నెయిల్ రింగ్ అనేది ఇప్పటికిప్పుడు కొత్తగా వచ్చిన ట్రెండ్ కాదంటున్నారు ప్రముఖ జ్యువెలరీ డిజైనర్ ఈనా అహ్లువాలియా. పదిహేనేళ్ల క్రితం బ్రిటిష్ జ్యువెలరీ డిజైనర్ జాస్మిన్ అలెగ్జాండర్ వేలికి ఇలాంటి ఆభరణాన్ని చూశానన్నారు ఆమె. అసలు విషయం ఏమిటంటే... ఆభరణాలను రూపొందించే క్రమంలో ప్రమాదవశాత్తు తన వేలి గోరు భాగాన్ని కోల్పోయారు జాస్మిన్. ఆ లోటును భర్తీచేసేందుకు ఆమె ప్రొస్థటిక్ మెటల్‌తో కృత్రిమ గోరును తయారుచేసుకుని ధరించారు. అప్పట్లో అది ఆమె ప్రత్యేక స్టయిల్‌గా పలువురిని ఆకట్టుకుంది. క్రమంగా దాన్నే కొంతమంది యాక్సస రీలా అనుసరించడం ప్రారంభించారు అంటూ చెప్పుకొచ్చారు ఈనా.

నెయిల్ రింగ్స్ అంటే..?

చేతి వేళ్లకు పెట్టుకున్నట్లే గోళ్లకూ పెట్టుకునే ఉంగరాలే 'నెయిల్ రింగ్స్'. గోరు మొత్తాన్ని కవర్ చేసేవి, గోరు మొదట్లో లేదా చివర్లో పెట్టుకునేవి, గోరు మధ్యలో అమర్చుకునేవి ప్రస్తుతం ట్రెండింగ్‌లో ఉన్నాయి. బంగారం, వెండి, బ్లాక్ మెటల్‌తో తయారుచేసిన నెయిల్ రింగ్స్‌ను మహిళలు ఎక్కువగా ఇష్టపడుతున్నారు. పువ్వులు, ఆకులు, లతలు, నెమళ్లు, సీతాకోక చిలుకలు, హార్ట్, జ్యామెట్రీ ఆకారాలతోపాటు ఎన్నో విభిన్నమైన డిజైన్లు ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయి. వీటి మీద చిన్న చిన్న నక్షత్రాలు, రంగురంగుల్లో మెరిసే రాళ్లు, స్వరోస్కి క్రిస్టల్స్ పొదిగి అందంగా రూపొందిస్తున్నారు. నెయిల్ రింగ్స్‌ను చేతి వేళ్లన్నింటికీ పెట్టుకోవచ్చు. లేదంటే ఒకటి లేదా రెండు వేళ్లకు అమర్చుకున్నా మంచి లుక్ వస్తుంది. అందుకే స్టయిలిష్ యాక్ససరీస్‌లో అగ్రస్థానంలో నిలుస్తున్నాయి 'నెయిల్ రింగ్స్'.

సెలబ్రిటీలు సైతం...

ప్రముఖ హీరోయిన్లతో సహా మోడల్స్, ఫ్యాషన్ మీద ఆసక్తి ఉన్న యువతులు ఈ



ట్రెండ్‌ను ఫాలో అవుతున్నారు. సొనాలి బింద్రే, కృతి సనన్, జాక్వెలిన్ ఫెర్నాండెజ్, హీనా ఖాన్, కరిష్మా తన్నాలు పలు ఈవెంట్లలో నెయిల్ రింగ్స్ ధరించి అందంగా మెరిశారు. చెవి దిద్దులు, జుంకాలు; వేళ్ల ఉంగరాలు; మెడలో నెక్లెస్ లేదా చోకర్‌కు మ్యాచ్ అయ్యేలా నెయిల్ రింగ్స్ ధరించి ఫొటోలకు ఫోజు లిచ్చారు. దీంతో యువతులంతా రకరకాల నెయిల్ రింగ్స్ కోసం నెట్టింట వెదకడం ప్రారంభించారు. అమామా, భవ్య రమేష్, మదిహా జైపూర్, యురుమ్మే, రిచా బైసా, అయేషా, ఓంత్, రాతెల్ అండ్ ఓల్ఫ్, యెప్రెమ్, హగో క్రైట్ లాంటి బ్రాండ్‌ల నుంచి నెయిల్ రింగ్స్ కొనుక్కోవచ్చు.



ఎంపిక ఎలా..?

విభిన్నమైన ఆధునిక స్టయిల్స్‌కి కొత్త భాష్యం చెబుతున్నాయి నెయిల్ రింగ్స్. డిజైనర్ వేర్, భారీ లెహంగాలతోపాటు అన్ని రకాల మోడరన్ డ్రెస్‌లమీద ఇవి చక్కగా సూటవుతాయి. కాలేజీలు, కార్యాలయాలకు వెళ్లేటప్పుడు రోజువారీ ధరించడానికి సింపుల్ డిజైన్లలో; వివాహాది శుభకార్యాలు, పార్టీల్లో ధరించడానికి భారీ డిజైన్లలో నెయిల్ రింగ్స్ లభ్యమవుతున్నాయి. నెయిల్ రింగ్స్ ధరించేటప్పుడు గోళ్లకు వేసుకోవాల్సిన నెయిల్ పాలిష్ రంగులను జాగ్రత్తగా ఎంచుకోవాలంటున్నారు ఫ్యాషన్ నిపుణులు. మెరిసే డిజైన్లతో గోల్డ్ షేడెడ్ నెయిల్ రింగ్స్ ధరించేటప్పుడు ముదురు రంగు నెయిల్ పాలిష్ వేసుకోవాలి. అదే సిల్వర్ షేడెడ్ నెయిల్ రింగ్స్ పెట్టుకునేటట్లయితే లేత రంగుల్లో మెరిసే నెయిల్ పాలిష్ వేసుకుంటే బాగుంటుంది.



కాలంతో మనం కూడా మారాలి!



సోషల్ మీడియాలో రీల్స్ చూసే వారందరికి 'నిహారిక ఎం' గురించి చెప్పాల్సిన అవసరం లేదు. ఆమె అనేక మంది సెలబ్రిటీలతో చేసిన రీల్స్‌ను లక్షల మంది చూస్తూ ఉంటారు. ఇటీవల ఆమె సోషల్ మీడియా నుంచి సినిమాలలోకి కూడా ప్రవేశించింది. తాజాగా ఆమె నటించిన 'మిత్ర మండలి' అనే సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో ఆమెను 'నవ్య' పలకరించింది.

'మిత్రమండలి' సినిమా షూటింగ్ అనుభవమేమిటి?

చాలా ఎక్సైటింగ్‌గా అనిపించింది. డబ్బింగ్ కూడా పూర్తి చేసేశాను. ఈ సినిమా పెద్ద హిట్ అవుతుందనే నమ్మకం నాకుంది. ప్రేక్షకులు నా నమ్మకాన్ని వమ్ము చేయరని ఆశిస్తున్నాను.

సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్.. సినిమాలో హీరోయిన్- ఈ రెండు పాత్రల మధ్య తేడా ఏమిటి?

సోషల్ మీడియాలో ఒక పోస్ట్ వైరల్ కాకపోతే వేరే పోస్ట్ పెట్టుకుంటాం. కానీ సినిమా అలా కాదు. మనని నమ్మి సమయం, డబ్బు, శ్రమ అన్నీ పెడతారు. అనేక అంచనాలు ఉంటాయి. వీటన్నింటి వల్ల విపరీతైన ఒత్తిడి ఉంటుంది. ఇన్‌ఫ్లూయెన్సర్‌గా ఉన్నప్పుడు అంతా ఒంటరి పోరాటమని చెప్పవచ్చు. కానీ సినిమా అనేది సామూహిక శ్రమ. అందువల్ల ఒత్తిడి ఎక్కువ.

ఈ రెండింటిలో ఏది ఎక్కువ శ్రమతో కూడుకున్నది?

రెండింటిలోను కష్టం ఉంది. సోషల్ మీడియాలో నా ప్లాట్‌ఫాంను నేనే స్వయంగా పైకి తీసుకువచ్చా. అక్కడ సృజనాత్మకంగా నేనే ఆలోచించేదాన్ని. నాకు నచ్చింది ప్రేక్షకులకు కూడా నచ్చేది. అదొక జర్నీ. అయితే సినిమాలో సృజనాత్మకంగా మన పాత్ర తక్కువగా ఉంటుంది. డైరక్టర్‌కు ఉన్న విజన్ ఆధారంగా సినిమా తీస్తారు. అంతే కాదు. నేను విధిని నమ్ముతాను. మనకు ఎంతో టాలెంట్ ఉండచ్చు. కానీ సరైన సమయానికి.. సరైన ప్రదేశంలో లేకపోతే ఫలితం ఉండదు.

అసలు మీ సోషల్ మీడియా ప్రయాణం ఎలా ప్రారంభమయింది?

నాకు 16 ఏళ్ల వయస్సులో యూట్యూబ్‌లో వీడియోలు పెట్టడం ప్రారంభించా. ఆ సమయంలో నేను కాలేజీలో చదివేదాన్ని. కాలేజీలో చదువు పూర్తయిన తర్వాత సరదాగా ఒక హాబీగా వీడియోలు చేసేదాన్ని. మొదటి నాలుగేళ్లు చాలా కష్టపడ్డా. ఆ సమయంలో యూట్యూబ్ నుంచి క్రియేటర్స్‌కు ఆదాయం వచ్చేది కాదు. అందువల్ల నాకు డబ్బులు వచ్చేవి కాదు. ఆ తర్వాత కోవిడ్ వచ్చింది. ఆ రెండేళ్లు వీడియోలు ఎక్కువగా చేయలేదు. ఆ తర్వాత మాస్టర్స్ చేయటానికి లాస్ ఏంజలిస్ వెళ్లాను. ఆ సమయంలో వీడియోలు చేసేదాన్ని. ఆ తర్వాత ఇక వెనక్కి తిరిగి చూసుకోవాల్సిన అవసరం లేకపోయింది.



సినిమాల్లోకి ఎందుకు వచ్చారు?

మార్పు అనేది అవసరం. కాలంతో పాటుగా మనం కూడా మారాలి. సోషల్ మీడియాలో ట్రెండ్స్ ఎప్పటికప్పుడు మారిపోతూ ఉంటాయి. మ్యాజిక్ ఒక సారి జరుగుతుంది. రెండు మూడు సార్లు ప్రయత్నిస్తే జరగవచ్చు. కానీ ప్రతి సారి మ్యాజిక్‌ను క్రియేట్ చేయలేం. అంతే కాకుండా నేను ఎంత కాలం ఇన్‌ఫ్లూయెన్సర్‌గా ఉంటాను? నాకు నటన అంటే ఇష్టం. అందుకే సినిమాల్లోకి వచ్చాను.

ఎన్ని ఆడిషన్స్‌కు వెళ్లారు? మీ అనుభవమేమిటి?

నేను చాలా ఆడిషన్స్‌కు వెళ్లాను. లుక్‌టెస్ట్‌లు చేయించుకున్నాను. నా ఉద్దేశంలో ఒక సినిమాకి ఇవి చాలా ముఖ్యం. ఎందుకంటే రకరకాల పాత్రల మధ్య కెమిస్ట్రీ కుదురుతోందా? టైమింగ్ ఎలా ఉంటోంది? ఒక ఫ్రేమ్‌లో అందరూ ఎలా ఉన్నారు? అనే విషయాలు ఆడిషన్లు, లుక్ టెస్ట్‌ల ద్వారానే తెలుస్తాయి. నేను నటిస్తున్న సినిమాలన్నింటి కోసం ఆడిషన్స్ ఇచ్చాను. చాలా మందికి తెలియదు. ఇదంతా చాలా శ్రమతో, ఓర్పుతో కూడిన వ్యవహారం. నెలల తరబడి వేచి ఉండాల్సి వస్తుంది.

ఇప్పుడు రీల్స్ చేయటం మానేసారా?

లేదు. నా మనసుకు నచ్చిన టాపిక్ దొరికినప్పుడు చేస్తున్నాను. అయితే అది నా ప్రధాన వృత్తి కాదు కాబట్టి స్లో అయింది. అయినా ఇప్పటికీ నా రీల్సే నా ఐడెంటిటీ.

ఒక రోజు ఎయిర్‌పోర్టులో ఒక ఆవిడ నన్ను కలిసారు. వాళ్ల అమ్మాయి చావు చివరి అంచుల్లో ఉందని.. తనతో ఒక సారి మాట్లాడమని రిక్వెస్ట్ చేశారు. అక్కడ నుంచి ఆమెకు వీడియో కాల్ చేశాం. ఆ అమ్మాయి- "నేను మీ రీల్స్ రోజూ చూస్తాను. వాటిని చూస్తుంటే మొత్తం బాధలన్నీ మర్చిపోతాను" అంది. నా జీవితంలో అంత కన్నా పెద్ద కాంప్లిమెంట్ ఎప్పుడూ రాలేదు. అందరినీ నవ్వించటం.. ఆనందంగా ఉంచటం కన్నా గొప్ప విషయమేమి ఉంటుంది? ఇప్పటి దాకా నాతో పనిచేసిన సహచర నటీనటులందరూ నా రీల్స్ గురించి చెబుతూ ఉంటారు. అప్పుడు నాకు చాలా ఆనందంగా, గర్వంగా అనిపిస్తూ ఉంటుంది.

• సీవీఎల్ఎన్ ప్రసాద్

లైబ్రరీ.. చాలా మందికి ఒక అందమైన జ్ఞాపకం.. పుస్తకాల వాసన.. గంభీరమైన నిశబ్దాలను చాలా మంది మరచిపోరు. ఒకప్పుడు వేసవి సెలవులలో లైబ్రరీకి వెళ్లటం పిల్లలకు ఒక దినచర్య. కానీ కాలంతో పాటుగా సమాజంలో అనేక మార్పులు వచ్చాయి. ప్రజలలో పుస్తకాలను చదివే అలవాటు తగ్గింది. దీనితో పాటుగా లైబ్రరీల సంఖ్య తగ్గుతూ వచ్చింది. మళ్లీ ప్రజలలో పుస్తకాలను చదివే అలవాటును పెంచటానికి కోఫోర్జ్ అనే సంస్థ ప్రయత్నాలు మొదలుపెట్టింది. ఈ ప్రయత్నాల్లో భాగంగా ఢిల్లీ, నోయిడాలలో లైబ్రరీలను ఏర్పాటు చేసింది. తాజాగా 15 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో హైదరాబాద్‌లో కూడా ఒక లైబ్రరీని ప్రారంభించింది. ఈ లైబ్రరీలను ప్రారంభించటానికి వెనకున్న ఉద్దేశాలను ఆ కంపెనీ చీఫ్ బ్రాండ్ ఆఫీసర్ అనురాధ సేహగల్ 'నవ్య'కి వివరించారు. ఆ వివరాలు ఆమె మాటల్లోనే..

అందరి కోసం ఓ లైబ్రరీ!

"పిల్లలు కొత్త కొత్త విషయాలు తెలుసుకోవటానికి ఇష్టపడతారు. ముఖ్యంగా బొమ్మల పుస్తకాలు.. రకరకాల రంగు రంగుల ఆట వస్తువులు వారిని ఆకర్షిస్తాయి. ఇదే విధంగా యుక్త వయస్సులో ఉన్నవారికి పుస్తకాలు మంచి స్నేహితులు. అయితే మొబైల్స్, ఐపాడ్స్ వంటి సాంకేతిక సాధనాలు అందుబాటులోకి రావటంతో ప్రజలలో కాగితపు పుస్తకాలు చదివే అలవాటు తగ్గిపోతోంది. ఈ ఒరవడికి తగ్గట్టుగానే ప్రభుత్వాలు నిర్వహించే లైబ్రరీల సంఖ్య తగ్గుతూ వస్తోంది. వీటిని దృష్టిలో పెట్టుకొని- మా కంపెనీ సీఈఓ సింగ్ మా వద్ద ఉన్న సీఎస్ఆర్ నిధులతో పబ్లిక్ లైబ్రరీలను స్థాపించాలని పూనుకున్నారు. ఆయన ఉద్దేశం వెనక ఒక నేపథ్యముంది. వారి తండ్రి ఆర్మీ అధికారి. అందువల్ల దేశంలోని అనేక ప్రాంతాలలో ఆయన పెరిగారు. ఆయన ఎక్కడికి వెళ్లినా- అక్కడ లైబ్రరీలు ఉండేవి. ఆయన అక్కడికి వెళ్లి పుస్తకాలు చదువుకొనేవారు. ఆ తర్వాతి కాలంలో ఆయన అమెరికా వెళ్లిపోయారు. అక్కడ స్థిరపడ్డారు. అమెరికాలో ఆయన పిల్లలు చదువుకొనేందుకు పెద్ద పెద్ద లైబ్రరీలు ఉండేవి. ఆయన మన దేశానికి తిరిగి వచ్చిన తర్వాత పబ్లిక్ లైబ్రరీలు తక్కువగా ఉండటం గమనించారు. సమాజానికి ఏదైనా చేయాలనే ఉద్దేశంతో ఈ లైబ్రరీలను ప్రారంభించాం.



నోయిడా లైబ్రరీ పెద్ద హిట్..

ఒక సాధారణ వ్యక్తి కాసేపు ఎక్కడికైనా వెళ్లి తనకు నచ్చిన పుస్తకం చదువుకోవటానికి వీలైన పరిస్థితులు కల్పించాలనేది మా ఉద్దేశం. దీనితో పాటుగా ఈ మధ్యకాలంలో తల్లితండ్రులు తమ పిల్లలను మాల్స్‌కు మాత్రమే తీసుకువెళ్తున్నారు. పార్కులకు, లైబ్రరీలకు తీసుకువెళ్లటం లేదు. దీనికి కారణం సరైన మౌలిక సదుపాయాలు లేకపోవటం. అన్ని రకాల మౌలిక సదుపాయాలతో అందరూ వచ్చి గడపటానికి వీలైన లైబ్రరీలను నిర్మించాలనేదే మా ఉద్దేశం. దీనిలో భాగంగా గత ఏడాది ఫిబ్రవరిలో నోయిడాలో ఒక లైబ్రరీ ప్రారంభించాం. ఈ ఏడాది జూన్‌లో ఢిల్లీలో మరో లైబ్రరీ నిర్మించాం. ఈ రెండింటికి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. వేల మంది ప్రజలు ఈ లైబ్రరీలకు రావటం మొదలుపెట్టారు. వారి దగ్గర నుంచి వచ్చిన రెస్పాన్స్ ఆధారంగా ఈ వారం హైదరాబాద్‌లో లైబ్రరీని ప్రారంభించాం. సుమారు 15 వేల చదరపు అడుగులలో ఈ లైబ్రరీ ఉంది. దీనిలో సుమారు 15 వేల పుస్తకాలు ఉన్నాయి. తెలుగు, ఇంగ్లీషు, హిందీ భాషల్లో అన్ని విభాగాల్లో అందరి ప్రశంసలు పొందిన పుస్తకాలను దీనిలో ఉంచాం. ముఖ్యంగా పిల్లల కోసం ఒక ప్రత్యేకమైన విభాగాన్ని ప్రారంభించాం. తమ ఖాళీ సమయాల్లో తల్లితండ్రులు- పిల్లలను మాల్స్‌కు మాత్రమే కాకుండా ఇక్కడికి కూడా తీసుకురావచ్చు. అయితే ఇక్కడ ఒక విషయాన్ని స్పష్టంగా చెప్పాలి. ఈ లైబ్రరీ ప్రజలందరూ తమ ఖాళీ సమయంలో వచ్చి మనసుకు నచ్చిన పుస్తకాలను చదువుకోవటానికి మాత్రమే! సాధారణంగా లైబ్రరీలలో రకరకాల కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉంటారు. కానీ ఇక్కడ ఆ తరహా కార్యక్రమాలను ఇంకా అనుమతించటం లేదు. ఈ లైబ్రరీకి తొలి రోజు నుంచి వస్తున్న స్పందన చూస్తుంటే చాలా ఆనందంగా ఉంది.




ఒత్తయిన శిరోజాల కోసం...

కొంతమందికి విపరీతంగా జుట్టు రాలడాన్ని చూస్తూ ఉంటాం. అందుకు పోషకాహార లోపం, వాతావరణ కాలుష్యం, ఒత్తిడి, ఆందోళనలు కారణం కావచ్చని నిపుణులు చెబుతున్నారు. అలాకాకుండా కుదుళ్లు బలోపేతమై శిరోజాలు ఒత్తుగా పెరగడానికి పాటించాల్సిన చిట్కాల గురించి తెలుసుకుందాం...

- ఒక గిన్నెలో అర కప్పు మెంతులు వేసి నిండా నీళ్లు పోసి రాత్రంతా నానబెట్టాలి. ఉదయాన్నే ఈ మెంతులను మెత్తగా గ్రైండ్ చేసి ఆ పేస్టుని తలకు పట్టించాలి. అరగంటసేపు ఆరనిచ్చి ఆపై తేలికపాటి షాంపూతో తలస్నానం చేయాలి. ఇలా వారానికి ఒకసారి చేస్తూ ఉంటే.. శిరోజాలు రాలడం తగ్గి నల్లగా ఒత్తుగా పెరుగుతాయి.
- ఎర్ర ఉల్లిపాయ రసాన్ని తలకు పట్టించి పావుగంట తరువాత గోరువెచ్చని నీటితో తలస్నానం చేయాలి. ఇలా రెండు రోజులకోసారి చేస్తే జుట్టు ఒత్తుగా పెరుగుతుంది.
- రాత్రి పడుకునే ముందు తలకు ఉసిరి నూనె లేదా కొబ్బరినూనెతో మర్దన చేసుకుని ఉదయాన్నే తలస్నానం చేస్తే శిరోజాల కుదుళ్లు బలపడతాయి.



- రెండు రోజులకోసారి తలకి కలబంద గుజ్జు పట్టించి పావుగంట తరువాత గోరువెచ్చని నీటితో తలస్నానం చేస్తుంటే జుట్టు నల్లగా పొడవుగా పెరుగుతుంది. తగినంత తేమ అంది శిరోజాలు చక్కగా మెరుస్తుంటాయి.
- కోడిగుడ్డులోని తెల్ల సొనకు కొద్దిగా పెరుగు కలిపి తలకు పట్టించి పది నిమిషాల తరువాత తలస్నానం చేసినా జుట్టు ఆరోగ్యంగా పెరుగుతుంది.
- ప్రొటీన్లు, విటమిన్లు, మినరల్స్, ఐరన్ ఎక్కువగా ఉండే పోషకాహారాన్ని తరచూ తీసుకుంటూ ఉంటే శిరోజాలు బలంగా పెరుగుతాయి. గ్రీన్ టీని తాగినా, తలకు పట్టించినా మంచి ఫలితం కనిపిస్తుంది.





ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
ది డిప్లొమాట్3	వెబ్‌సిరీస్	అక్టోబర్ 16
బ్యాడ్ షబ్బోస్	హాలీవుడ్ మూవీ	అక్టోబర్ 16
గుడ్‌న్యూస్	కొరియన్ చిత్రం	అక్టోబర్ 17
అమెజాన్ ప్రైమ్		
బెర్ ఫాల్ట్	ఒరిజినల్ మూవీ	అక్టోబర్ 16
జీ 5		
కిష్కింధపురి	తెలుగు చిత్రం	అక్టోబర్ 17
భగ్‌వత్ 1	హిందీ చిత్రం	అక్టోబర్ 17
ఆహా...		
ఆనందలహరి	తెలుగు సిరీస్	అక్టోబర్ 17

ఇలా బ్రష్ చేసుకోవాలి...

మనం రోజూ ఉదయం నిద్ర లేవగానే టూత్‌బ్రష్‌తో దంతాలను శుభ్రం చేసుకుంటూ ఉంటాం. సరైన రీతిలో బ్రష్ చేసుకోకుంటే దంత సమస్యలు తప్పవని నిపుణులు హెచ్చరిస్తున్నారు. దంతాలు పటిష్టంగా ఉండాలంటే ఏవిధంగా బ్రష్ చేసుకోవాలో తెలుసుకుందాం..

- రోజూ ఉదయం లేవగానే.. రాత్రి పడుకునే ముందు.. తప్పనిసరిగా దంతాలను బ్రష్ చేసుకోవాలి. అప్పుడే పళ్ల మధ్య ఇరుక్కున్న ఆహారపదార్థాలు, పళ్లమీద పేరుకున్న బ్యాక్టీరియాలు తొలగిపోయి దంతాలు సురక్షితంగా ఉంటాయి.



- దంతాలను కనీసం రెండు నిమిషాలపాటు సున్నితంగా వృత్తాకారంలో బ్రష్ చేయాలి. దంతాలు, చిగుళ్లు కలిసి ఉన్న ప్రాంతంలో బ్రష్ చేసేటప్పుడు జాగ్రత్త వహించాలి.
- దంతాలను బ్రష్ చేయడానికి ఫ్లోరైడ్ ఉన్న టూత్‌పేస్టును వాడడం మంచిది. ఇది దంతాల మీద ఉండే ఎనామిల్ పొరను కాపాడడంతోపాటు అకాల దంతక్షయాన్ని నివారిస్తుంది. బ్రష్ మీద బఠానీ గింజంత పేస్టు మాత్రమే వేసుకుని పళ్లు తోముకోవాలి.

అటు బ్యాట్‌తో.. ఇటు బంతితో

భారత్ ఆల్‌రౌండ్ షో

రెండో టెస్టు

- తొలి ఇన్నింగ్స్ 518/5 డిక్లేర్
- కెప్టెన్ గిల్ అజేయ శతకం
- విండీస్ తొలి ఇన్నింగ్స్ 140/4
- జడేజాకు మూడు వికెట్లు


గిల్ (129 నాటౌట్)


జడేజా (3/37)

న్యూఢిల్లీ: వెస్టిండీస్‌తో రెండో టెస్టులో టీమిండియా ఆల్‌రౌండ్‌షోతో అదరగొడుతోంది. బ్యాటర్లు విజృంభించిన చోట.. భారత స్పిన్నర్లు సైతం పర్యాటక విండీస్‌ను కట్టడి చేస్తున్నారు. యశస్వీ జైస్వాల్ (175) డబుల్ సెంచరీ కోల్పోయినా.. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (129 నాటౌట్) తన చివరి ఏడు టెస్టుల్లో ఐదో శతకంతో సూపర్ ఫామ్‌ను చాటుకున్నాడు. దీంతో భారత్ తొలి ఇన్నింగ్స్‌ను 518/5 స్కోరు దగ్గర డిక్లేర్ చేసింది. ధ్రువ్ జురెల్ (44), నితీశ్ కుమార్ (43) ఫర్వాలేదనిపించారు. స్పిన్నర్ వారికన్‌కు 3 వికెట్లు దక్కాయి. ఆ తర్వాత రెండో సెషన్ మధ్యలో తొలి ఇన్నింగ్స్ ఆరంభించిన విండీస్ ఫ్లాట్ పిచ్‌పైనా పట్టు తప్పింది. స్పిన్నర్ జడేజా (3/37) ధాటికి రెండో రోజు శనివారం ఆట ముగిసేసరికి 43 ఓవర్లలో 140/4 స్కోరుతో విండీస్ కష్టాల్లో పడింది. అథనజె (41), చందర్‌పాల్ (34) కాస్త పోరాడడంతో రెండో వికెట్‌కు 66 రన్స్ చేరాయి. క్రీజులో షాయ్ హోప్ (31), ఇమ్లాచ్ (14) ఉన్నారు. కుల్దీప్‌నకు ఓ వికెట్ దక్కింది. ప్రస్తుతం 378 పరుగులు వెనుకబడిన విండీస్ ఫాలోఆన్ ప్రమాదంలో పడింది.

గిల్ జోరు: ఓవర్‌నైట్ స్కోరు 318/2తో రెండోరోజు ఆట ఆరంభించిన భారత్ తమ సెషన్నర ఆటలో మరో 200 రన్స్ జోడించి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. అయితే తొలి సెషన్ రెండో ఓవర్‌లోనే గట్టి ఝలక్ తగిలింది. డబుల్ సెంచరీ ఖాయమనిపించిన జైస్వాల్ సమన్వయలోపంతో రనౌట్‌గా వెనుదిరిగాడు. మిడాఫ్ దిశగా డ్రైవ్ ఆడిన అతను సింగిల్ కోసం పరుగుతీశాడు. అయితే నాన్‌స్ట్రయిక్ ఎండ్‌లో గిల్ కాస్త ముందుకు వచ్చినా మళ్లీ వెనక్కి మళ్లాడు. అప్పటికే యశస్వీ సగం క్రీజు దాటేశాడు. అటు చందర్‌పాల్ నుంచి అందుకున్న త్రోతో కీపర్ ఇమ్లాచ్ రనౌట్ చేయడంతో జైస్వాల్ పెవిలియన్‌కు చేరాడు. వీరిద్దరి మధ్య మూడో వికెట్‌కు 74 పరుగుల భాగస్వామ్యం జత చేరింది. తొలిరోజు చివర్లో నిదానంగా ఆడిన గిల్ శనివారం మాత్రం బ్యాట్ ఝుళిపించాడు. అతడికి నితీశ్ సహకరించాడు. 4 ఫోర్లు, 2 సిక్సర్లతో ఆకట్టుకున్న నితీశ్.. గిల్‌తో కలిసి నాలుగో వికెట్‌కు 91 పరుగులు జోడించాక వారికన్‌కు చిక్కాడు. లంచ్ బ్రేక్ తర్వాత గిల్-జురెల్ ఆధిపత్యం చూపారు. కెరీర్‌లో పదో శతకం పూర్తి చేశాక గిల్ ఎదురుదాడి ఆరంభించాడు. చేజ్ ఓవర్‌లో సిక్సర్ బాదిన వెంటనే పియర్ ఓవర్‌లో మూడు ఫోర్లతో 12 రన్స్ రాబట్టాడు. అయితే ఐదో వికెట్‌కు 102 పరుగులు జోడించాక జురెల్ అవుట్ కాగా.. ఆ వెంటనే భారత్ ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది.

2 ఒకే ఏడాదిలో ఐదు శతకాలు బాదిన రెండో భారత కెప్టెన్‌గా గిల్. కోహ్లీ (2017, 2018) రెండు సార్లు ఈ ఫీట్ సాధించాడు. అలాగే అలిస్టర్ కుక్ (9), గవాస్కర్ (10) తర్వాత తక్కువ ఇన్నింగ్స్ (12)లోనే ఐదు సెంచరీలు సాధించిన సారథిగా గిల్ నిలిచాడు.

64 ఏళ్ల తర్వాత విండీస్‌పై తొలి ఐదుగురు బ్యాటర్ల మధ్య 50+ భాగస్వామ్యాలు నమోదయ్యాయి. 1960లో చివరిసారి ఆసీస్ జట్టు ఈ రికార్డు నెలకొల్పింది.

స్కోరుబోర్డు

భారత్ తొలి ఇన్నింగ్స్: జైస్వాల్ (రనౌట్) 175, రాహుల్ (స్టంప్) ఇమ్లాచ్ (బి) వారికన్ 38, సాయి సుదర్శన్ (ఎల్బీ) వారికన్ 87, గిల్ (నాటౌట్) 129, నితీశ్ (సి) సీల్స్ (బి) వారికన్ 43, జురెల్ (బి) చేజ్ 44; **ఎక్స్‌ట్రాలు: 2; మొత్తం: 134.2 ఓవర్లలో 518/5 డిక్లేర్. వికెట్ల పతనం:** 1-58, 2-251, 3-325, 4-416, 5-518. **బౌలింగ్:** సీల్స్ 22-2-88-0; ఫిలిప్ 17-2-71-0; గ్రీవ్స్ 14-1-58-0; పియర్ 30-2-120-0; వారికన్ 34-6-98-3; చేజ్ 17.2-0-83-1.

వెస్టిండీస్ తొలి ఇన్నింగ్స్: కాంప్‌బెల్ (సి) సుదర్శన్ (బి) జడేజా 10, చందర్‌పాల్ (సి) రాహుల్ (బి) జడేజా 34, అథనజె (సి) జడేజా (బి) కుల్దీప్ 41, హోప్ (బ్యాటింగ్) 31, చేజ్ (సి అండ్ బి) జడేజా 0, ఇమ్లాచ్ (బ్యాటింగ్) 14; **ఎక్స్‌ట్రాలు 10; మొత్తం: 43 ఓవర్లలో 140/4. వికెట్ల పతనం:** 1-21, 2-87, 3-106, 4-107. **బౌలింగ్:** బుమ్రా 6-3-18-0; సిరాజ్ 4-0-9-0; జడేజా 14-3-37-3; కుల్దీప్ 12-3-45-1; సుందర్ 7-1-23-0.

కంగారూలతో కఠిన పరీక్షే!



నేడు ఆస్ట్రేలియాతో భారత్ పోరు

మహిళల వన్డే ప్రపంచ కప్

మ. 3 గం. నుంచి స్టార్ నెట్‌వర్క్‌లో..


ప్రాక్టీస్‌లో ఆసీస్ క్రికెటర్లు

విశాఖపట్నం స్పోర్ట్స్ (ఆంధ్రజ్యోతి): ప్రపంచ కప్‌లో రెండ్రోజుల క్రితం దక్షిణాఫ్రికా చేతిలో కంగుతిన్న భారత మహిళల జట్టు మరో కఠిన పరీక్షను ఎదుర్కోనుంది. ఆదివారం జరిగే కీలక మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంప్ ఆస్ట్రేలియాతో హర్మన్‌సేన తలపడనుంది. సఫారీలతో మ్యాచ్‌లో టాపార్డర్ బ్యాటర్లు మరోసారి విఫలం కాగా.. ఆరో బౌలర్ లేని లోటు కనిపించింది. దాన్ని పూడ్చడానికి హర్మన్ బంతిని అందుకోవాల్సి వచ్చింది. 40 ఓవర్ల తర్వాత సఫారీ బ్యాటర్లు.. పేసర్లను టార్గెట్ చేయడంతో కెప్టెన్ హర్మన్‌కు ఏం చేయాలో పాలుపోలేదు. ఆరంభంలో మెరుగ్గా బౌలింగ్ చేసిన క్రాంతి గౌడ్, అమన్‌జోత్ డెత్ ఓవర్లలో బ్యాటర్లను కట్టడి చేయలేకపోయారు. మన జట్టు ఫీల్డింగ్ వైఫల్యాలు కూడా ప్రత్యర్థులకు లాభించాయి. ఈ నేపథ్యంలో బలమైన ఆసీస్‌పై జట్టు కూర్పు మేనేజ్‌మెంట్‌ను కలవరపెడుతోంది. కంగారూలపై పార్ట్‌టైమ్ బౌలర్లను దించితే ఆ జట్టు బ్యాటర్లు మరింత విరుచుకుపడే చాన్సుంది. దీంతో లోయర్డార్‌లో బ్యాటింగ్ కూడా చేయగల రాధా యాదవ్‌ను ఆరో బౌలర్‌గా తుది జట్టులోకి తీసుకోవచ్చు ఇదే జరిగితే వన్‌డౌన్‌లో ఇబ్బందిపడుతున్న హర్లీన్‌పై వేటుపడొచ్చు. ప్రధాన బ్యాటర్లు స్మృతి మంధాన, హర్మన్‌ప్రీత్, జెమీమాలు తమ వైఫల్యాన్ని అధిగమించాలి. మరోవైపు ఆస్ట్రేలియా మరోసారి ఫేవరెట్‌గా కనిపిస్తోంది. గత మ్యాచ్‌ల్లో కీలక ప్లేయర్లు విఫలమైనా, గార్డ్‌నర్, బెత్ మూనీ శతకాలతో అదరగొట్టారు. అయితే, లోపాలను సరిదిద్దుకొని ఘన విజయం సాధించాలని అలిస్సా హీలీ సేన పట్టుదలతో ఉంది.

పిచ్/వాతావరణం

వికెట్ బ్యాటింగ్‌కు అనుకూలం. ఆరంభంలో బంతి స్వింగ్ అయినా.. మ్యాచ్ సాగేకొద్దీ పిచ్ స్పిన్నర్లకు సహకరించే చాన్సుంది. ఆకాశం మేఘావృతమై ఉన్నా వర్ష ఛాయలు తక్కువగా ఉన్నాయి. మంచు కురిసే అవకాశం ఉండడంతో టాస్ కీలకం కానుంది.

జట్లు (అంచనా)

భారత్: ప్రతీక రావల్, స్మృతి మంధాన, హర్లీన్ డియోల్/రాధ యాదవ్, హర్మన్‌ప్రీత్ (కెప్టెన్), జెమీమా రోడ్రిగ్స్, దీప్తి శర్మ, అమన్‌జోత్, రిచా ఘోష్ (వికెట్ కీపర్), స్నేహ్ రాణా, క్రాంతి, శ్రీచరణి.

ఆస్ట్రేలియా: అలిస్సా హీలీ (కెప్టెన్, వికెట్ కీపర్), లిచ్‌ఫీల్డ్, ఎలిస్ పెర్రీ, బెత్ మూనీ, సదర్లాండ్, గార్డ్‌నర్, తహిల మెక్‌గ్రాత్, జార్జియా వేర్హమ్/సోఫీ మోలినెక్స్, కిమ్‌గార్త్, అలెన్ కింగ్, మేగన్ షట్.

30 ఏళ్ల నాటి సీన్ మళ్లీ..



ఆనంద్‌పై కాస్పరోవ్ గెలుపు

క్లచ్ చెస్ టైటిల్ కైవసం

సెయింట్ లూయిస్ (అమెరికా): సరిగ్గా 30 ఏళ్ల నాటి చరిత్ర పునరావృతమైంది. 1995 అక్టోబరు 10న వరల్డ్ చెస్ చాంపియన్‌షిప్‌ను రష్యాకు చెందిన గ్యారీ కాస్పరోవ్ గెలుచుకున్నాడు. నాడు..చాలెంజర్, భారత గ్రాండ్‌మాస్టర్ విశ్వనాథన్ ఆనంద్‌పై విజయంతో కాస్పరోవ్ ప్రపంచ విజేతగా నిలిచాడు. సీన్ కట్ చేస్తే..ప్రస్తుతం అదే విషీపై నెగ్గిన కాస్పరోవ్ లెజెండ్స్ క్లచ్ చెస్ చాంపియన్‌షిప్ టైటిల్‌ను దక్కించుకోవడం గమనార్హం. 12 గేమ్‌ల క్లచ్ చెస్ టోర్నీలో కాస్పరోవ్ 13-11 స్కోరుతో విజేతగా నిలిచాడు. టైటిల్‌తోపాటు గ్యారీకి రూ. 69 లక్షలు లభించాయి. ఇక ఆనంద్ రూ. 59 లక్షలు అందుకున్నాడు.

ఇంగ్లండ్ హ్యాట్రిక్

బ్రంట్ సెంచరీ • శ్రీలంకపై విజయం

కొలంబో: మహిళల వన్డే ప్రపంచ కప్‌లో ఇంగ్లండ్ వరుసగా మూడో విజయం సాధించింది. కెప్టెన్ నాట్ సివర్ బ్రంట్ (117) రికార్డు శతకానికి తోడు స్పిన్నర్ సోఫీ ఎకెల్‌స్టోన్ (4/17) సూపర్ బౌలింగ్‌తో సత్తా చాటడంతో.. ఇంగ్లండ్ 89 పరుగుల తేడాతో శ్రీలంకపై ఘనవిజయం సాధించింది. ముందుగా ఇంగ్లండ్ 50 ఓవర్లలో 253/9 స్కోరు చేసింది. బ్రంట్‌కు తోడు బ్యూమంట్ (32), హీథర్ నైట్ (29) రాణించారు. వన్డే వరల్డ్‌కప్ చరిత్రలో సివర్‌కు ఇది రికార్డుస్థాయిలో ఐదో శతకం కావడం విశేషం. ఇనోకకు 3.. ఉదేశిక, సుగందికలకు రెండేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో శ్రీలంక 45.4 ఓవర్లలో 164 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్ హాసిని (35), హర్షిత (33), నీలాక్షి (23) మాత్రమే ఆకట్టుకున్నారు. సివర్ బ్రంట్, డీన్‌లకు రెండేసి వికెట్లు లభించాయి.

సంక్షిప్త స్కోర్లు: ఇంగ్లండ్: 50 ఓవర్లలో 253/9 (సివర్ 117, బ్యూమంట్ 32; ఉదేశిక 3/33); **శ్రీలంక:** 45.4 ఓవర్లలో 164 ఆలౌట్ (హాసిని 35, హర్షిత 33; ఎకెల్‌స్టోన్ 4/17, బ్రంట్ 2/25, డీన్ 2/47).

తెలుగు అథ్లెట్లకు పతకాలు



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి): జాతీయ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో ఆంధ్రప్రదేశ్ అథ్లెట్లు వెంకట్రామ్ రెడ్డి, షేక్ రోషన్ పతకాలతో సత్తా చాటారు. శనివారం భువనేశ్వర్‌లో జరిగిన అండర్-20 విభాగం 1500 మీటర్ల పరుగులో కర్నూలుకు చెందిన వెంకట్రామ్ రెడ్డి విజేతగా నిలిచి స్వర్ణం కొల్లగొట్టాడు. 110 మీటర్ల హర్డిల్స్‌లో గుంటూరు అథ్లెట్ రోషన్ రెండో స్థానంతో రజతం దక్కించుకున్నాడు. వీళ్లిద్దరిని గచ్చిబౌలి సాయ్ కోచ్ సుబ్బారావు, ఆంధ్ర అథ్లెటిక్స్ సెలెక్షన్ కమిటీ ఛైర్మన్ నారాయణరావు అభినందించారు.

నమీబియా సంచలనం

ఏకైక టీ20లో సౌతాఫ్రికాకు షాక్

విండ్‌హోక్ (నమీబియా): టీ20ల్లో పసికూన నమీబియా సంచలనం సృష్టించింది. శనివారం ఉత్కంఠభరితంగా జరిగిన ఏకైక టీ20 మ్యాచ్‌లో నమీబియా నాలుగు వికెట్లతో దక్షిణాఫ్రికాకు షాకిచ్చి అతిపెద్ద విజయాన్ని అందుకుంది. ఆఖరి ఓవర్‌లో నమీబియా విజయానికి 11 పరుగులు కావాల్సి ఉండగా.. జేన్ గ్రీన్ (30 నాటౌట్) సిక్స్, ఫోర్‌తో జట్టుకు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు. తొలుత సౌతాఫ్రికా 20 ఓవర్లలో 8 వికెట్లకు 134 పరుగులు చేసింది. జాసన్ స్మిత్ 31, రూబిన్ హెర్మన్ 23 రన్స్ చేశారు. పేసర్ రూబెన్ ట్రంపెల్మన్ 3, హింగో 2 వికెట్లు పడగొట్టారు. ఛేదనలో నమీబియా ఓవర్లన్నీ ఆడి 138/6 స్కోరు చేసి గెలిచింది. గ్రీన్‌కు తోడు కెప్టెన్ ఎరాస్మస్ (21) రాణించాడు.

యువ భారత్ బోణీ

జొహోర్ కప్ జూ. హాకీ

జొహోర్ బహ్రు (మలేసియా): సుల్తాన్ జొహోర్ కప్ జూనియర్ హాకీ చాంపియన్‌షిప్‌లో భారత్ బోణీ చేసింది. శనివారం జరిగిన తొలి మ్యాచ్‌లో మన జూనియర్లు 3-2తో గ్రేట్ బ్రిటన్‌పై గెలిచారు. కెప్టెన్ రోహిత్ రెండు గోల్స్ (45+, 52ని.), రవ్‌నీత్ (23ని.) ఓ గోల్ చేశాడు. ఆదివారం న్యూజిలాండ్‌తో భారత్ ఆడనుంది.

అన్మోల్ జోరుకు బ్రేక్

వాంటా (ఫిన్లాండ్): ఆర్కిటిక్ ఓపెన్ సూపర్ 500 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత వర్ధమాన షట్లర్ అన్మోల్ ఖరబ్ జోరుకు సెమీఫైనల్లో బ్రేక్ పడింది. మూడుసార్లు ప్రపంచ విజేత అకానె యమగూచి (జపాన్) 21-10, 21-13తో 18 ఏళ్ల అన్మోల్‌ను ఓడించింది.

బిజినెస్ ప్లస్



ఎంత అక్షరాస్యులైనా మన దేశంలో చాలా మందికి ఆర్థిక అక్షరాస్యత లేదు. దీంతో మంచి ఉద్యోగం, ఆర్థిక స్థోమత ఉన్నా జీవితం చివరి దశలో ఆర్థికంగా ఇబ్బందులు అనుభవిస్తుంటారు. నాలుగు రాళ్లు సంపాదించేటప్పుడే క్రమానుగత పెట్టుబడి ప్రణాళిక (సిప్) పద్ధతిలో రిటైర్మెంట్ ప్లాన్ చేసుకుంటే ఈ తిప్పలు ఉండవు. 25 ఏళ్ల వయసులో చక్కటి పెట్టుబడి ప్రణాళిక, ఓర్పు ఉంటే 50 ఏళ్ల వయసు వచ్చే సరికి సిప్ ద్వారా రూ.5 కోట్లు వెనుకేసుకోవచ్చు. ఎలాగంటే?

@50 రూ.5 కోట్ల నిధి..!

సిప్ ద్వారా రిటైర్మెంట్ ప్లానింగ్‌తో సాధ్యమే..

మ్యూచువల్ ఫండ్స్ (ఎంఎఫ్)లో మదుపు చేసే వారికి సిప్ గురించి చెప్పాల్సిన అవసరం లేదు. నెలనెలా మీ ఆదాయానికి తగ్గట్టు ఈ పద్ధతిలో కొంత నిర్ణీత మొత్తాన్ని ఆయా పథకాల్లో మదుపు చేస్తూ పోవాలి. పెరిగే ఆదాయానికి అనుగుణంగా సిప్ మొత్తాన్నీ పెంచుకోవచ్చు.

సిప్ పెట్టుబడులు

నెలనెలా రూ.10,000 పెట్టుబడితో 25 ఏళ్ల వ్యక్తి సిప్ పద్ధతిలో మంచి ఈక్విటీ పథకాల్లో పెట్టుబడులు ప్రారంభించాలి. అప్పుడే చిరుద్యోగాల్లో చేరిన వారికి ఇది కొద్దిగా భారంగానే ఉంటుంది. దుబారా ఖర్చులు, జీవన శైలి మార్పుల ద్వారా ఈ మొత్తాన్ని నెలనెలా సిప్ పద్ధతిలో పెట్టుబడిగా పెట్టడం చాలా మందికి ముఖ్యంగా వృత్తి నిపుణులకు పెద్ద కష్టమేమీ కాక పోవచ్చు. జీతాలు పెరిగినపుడల్లా ఈ సిప్ పెట్టుబడులను 10 శాతం పెంచుకోవాలి. ఇలా పెరిగిన జీతం లేదా ఆదాయాలకు అనుగుణంగా సిప్ పెట్టుబడులు పెంచుకుంటూ పోతే దీర్ఘ కాలంలో ఆ మొత్తమే మీ పెట్టుబడులను మరింత పెంచుతాయి. వాల్యూ రీసెర్చ్ సంస్థ సర్వే ప్రకారం గత 20 ఏళ్లలో మంచి మ్యూచువల్ ఫండ్స్ నిర్వహణలోని 36 పథకాలు ఏటా సగటున 15 శాతానికి పైగా రాబడులు ఇచ్చాయి.

రూ.5 కోట్లు ఎలా?

- నెలవారీ సిప్ రూ.10,000
- సగటు రాబడి అంచనా 10 శాతం
- పాతికేళ్లలో వార్షిక సగటు రాబడి 15 శాతం
- పెట్టుబడుల కాల పరిమితి 25 సంవత్సరాలు

25 ఏళ్లకు సమకూరే మొత్తం

- తొలి ఏడాది నెలకు రూ.10,000 చొప్పున ఏడాదికి రూ.1.2 లక్షలు
- రెండో ఏడాది నెలకు రూ.11,000 చొప్పున ఏడాదికి రూ.1.32 లక్షలు
- మూడో సంవత్సరం నెలకు రూ.12,100 చొప్పున ఏడాదికి రూ.1,45,200
- పాతికేళ్లలో మొత్తం పెట్టుబడి సుమారు రూ.1.18 కోట్లు
- పాతికేళ్లకు (50 ఏళ్ల వయసు వచ్చే సరికి) సమకూరే మొత్తం రూ.4.54 కోట్లు

వడ్డీ మీద వడ్డీ

సిప్ పద్ధతిలో పెట్టే ప్రతి రూపాయి పెట్టుబడి మీద ఏటికేటికి వడ్డీ జమ అవుతుంది. ఇలా రూ.10,000తో ప్రారంభించి ఏటా క్రమం తప్పకుండా సిప్ పెంచుకుంటూ పోతే పాతికేళ్ల అయ్యే సరికి రూ.5 కోట్ల మూలనిధి సమకూర్చుకోవడం పెద్ద కష్టం కాకపోవచ్చు. ఈక్విటీ మార్కెట్ మధ్యలో ఎన్ని ఆటుపోట్లకు లోనైనా పాతికేళ్ల దీర్ఘకాలానికి చూస్తే మంచి రాబడులే ఇస్తుందని చరిత్ర చెబుతున్న సత్యం.

రిస్క్ వద్దనుకుంటే?

మార్కెట్ ఆటుపోట్లను ఏ మాత్రం తట్టుకోలేమనుకుంటే బులియన్ మార్కెట్‌ను ఎంచుకోవచ్చు. అసలు ఈ గోల అంతా ఎందుకనుకుంటే ఎంఎఫ్‌లు అందించే మల్టీ అసెట్ ఫండ్స్ సిప్‌ను ఎంచుకోవడం మంచిది. ఈ ఫండ్స్ మదుపరుల నుంచి సమీకరించిన నిధులను లోతైన పరిశోధన ద్వారా మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా ఈక్విటీ, బులియన్, రుణ పత్రాల మార్కెట్లలో మదుపు చేస్తాయి. గత రెండు మూడేళ్లుగా ఈ ఫండ్స్ కూడా పెద్దగా రిస్క్ లేకుండా మదుపరులకు మంచి రాబడులు పంచాయి. కొద్దిగా రిస్క్ తీసుకోగలిగితే సిప్ పద్ధతిలో బ్లూచిప్ కంపెనీల షేర్లలోనూ మదుపు చేయవచ్చు. అయితే ఈ మదుపరులు ఎప్పటికప్పుడు మార్కెట్ పరిస్థితులను గమనిస్తుండాలి. లేకపోతే పెట్టిన పెట్టుబడి అంతా బూడిదలో పోసిన పన్నీరవుతుంది.

సెప్టెంబరుతో త్రైమాసికంలో డీమార్ట్ రూ.16,676.30 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.684.85 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే లాభం 3.85%, ఆదాయం 15.45% పెరిగింది.



జోయాలుక్కాస్.. రాజస్థాన్, జైపూర్‌లోని వైశాలీ నగర్‌లో కొత్త షోరూమ్‌ను ఏర్పాటు చేసింది. ఈ షోరూమ్‌ను రాజస్థాన్ రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి కృష్ణన్ కుమార్ విష్ణోయ్, మిస్ సుప్రానేషనల్ ఇండియా 2025 ఆయుశ్రీ మాలిక్, మిస్ యూనివర్స్ రాజస్థాన్ 2025 షీనా పరాశర్, జోయాలుక్కాస్ సీఈఓ బాబీ జార్జ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వరల్డ్ జువెలరీ సమాఖ్య వైస్ ప్రెసిడెంట్ ప్రమోద్ అగర్వాల్, జోయాలుక్కాస్ రిటైల్ హెడ్ రాజేష్ కృష్ణన్ పాల్గొన్నారు.

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	102	విజయవాడ	119
వరంగల్	102	గుంటూరు	114
కరీంనగర్	102	ఒంగోలు	114
మహబూబ్‌నగర్	102	చిత్తూరు	95
కర్నూలు	102	నెల్లూరు	100
విశాఖపట్నం	127	అనంతపురం	100
గోదావరి	119		

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

12వ తేదీ			
హైదరాబాద్	500	విజయవాడ	515
వరంగల్	502	గోదావరి	505
చిత్తూరు	553	విశాఖపట్నం	500
		డజను గుడ్లు రూ. 72	

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,24,260 ▲	1,13,900 ▲	1,75,000 ▲
విజయవాడ	1,27,000 ▲	1,20,500 ▲	1,71,000 ▲
విశాఖపట్నం	1,24,150 ▼	1,13,800 ▼	1,87,000 ▲
రాజమండ్రి	1,24,250 ▲	1,13,900 ▲	1,74,000 ▲
ప్రొద్దుటూరు	1,29,600 ▲	1,19,200 ▲	1,71,000 ▲
ముంబై	1,21,525 ▼	1,11,317 ▼	1,64,500 ▲

పోస్ట్ సేల్ డిస్కౌంట్‌పై జీఎస్‌టీ ఎలా!



రాంబాబు గొండాల

ఉత్పత్తిదారులు తమ వ్యాపారాన్ని పెంచుకోవడంలో భాగంగా పలు ప్రోత్సాహకాలను డీలర్లకు ఇస్తుంటారు. వీటిలో చాలా వరకు క్రెడిట్ నోట్ ద్వారా ఇస్తుంటారు. ఇలా వివిధ సందర్భాల్లో డీలర్లు పొందే క్రెడిట్ నోట్స్‌ను జీఎస్‌టీ నిబంధనల ప్రకారం ఎలా చూడాలనే విషయంలో పలు సందేహాలు ఉన్నాయి. అంటే క్రెడిట్ నోట్‌కు సంబంధించి ఐటీసీ రివర్స్ చేయాల్సి ఉంటుందా? లేదా ఆ మొత్తం మీద పన్ను చెల్లించాలా? ఇలా పలు సందేహాలు ఉన్నాయి. వీటిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఇటీవల వివరణ ఇచ్చింది. వివిధ సందర్భాల్లో ఇచ్చే క్రెడిట్ నోట్స్‌ను జీఎస్‌టీ నిబంధనల ప్రకారం ఎలా అర్థం చేసుకోవాలి. డీలర్లు పాటించాల్సిన నియమ నిబంధనలు ఏమిటో తెలుసుకుందాం.

మొదటిది, పోస్ట్ డిస్కౌంట్‌కు సంబంధించి ఇచ్చే క్రెడిట్ నోట్స్. కంపెనీలు, డీలర్లకు సరుకులు కొనుగోలు చేసే సమయానికే కొంత డిస్కౌంట్ ఇవ్వటం ఒక విధానం కాగా, వార్షిక, త్రైమాసిక, నెలవారీ లక్ష్యాలను చేరుకుంటే అదనంగా డిస్కౌంట్ ఇవ్వటం మరో విధానం. రెండోది పోస్ట్ సేల్ డిస్కౌంట్. ఉదాహరణకు ఒక డీలర్ ఒక త్రైమాసికంలో రూ.కోటి విలువైన సరుకు కొనుగోలు చేస్తే 5 శాతం అదనపు డిస్కౌంట్ ఇస్తామని ఒప్పందం ఉంటే, టార్గెట్ నెరవేరిన తర్వాత మాత్రమే ఆ డిస్కౌంట్ వర్తిస్తుంది. కాబట్టి, అది ఇన్వాయిస్‌లో ముందు చూపబడదు. తర్వాత కంపెనీ, ఆ డీలర్‌కు క్రెడిట్ నోట్ జారీ చేస్తుంది. ఈ క్రెడిట్ నోట్స్ రెండు రకాలు. మొదటిది, జీఎస్‌టీ చట్టం ప్రకారం పన్నుతో కలిపి ఇచ్చే క్రెడిట్ నోట్. రెండోది, కేవలం రెండు పార్టీల మధ్య లెక్క సర్దుబాటు కోసం ఇచ్చే క్రెడిట్ నోట్. దీన్ని కమర్షియల్ లేదా ఫైనాన్షియల్ క్రెడిట్ నోట్ అంటారు. జీఎస్‌టీ నిబంధనల ప్రకారం ఒక వ్యక్తి క్రెడిట్ నోట్ తీసుకుంటే దానికి సరిపోను ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) రివర్స్ చేయాల్సి ఉంటుంది. ఇక్కడ చాలా మందికి వచ్చే సందేహం ఏమిటంటే కమర్షియల్ క్రెడిట్ నోట్ పొందినప్పుడు కూడా ఐటీసీ రివర్స్ చేయాల్సి ఉంటుందా అని? ప్రభుత్వ వివరణ ప్రకారం పోస్ట్ సేల్ డిస్కౌంట్‌ను కమర్షియల్ క్రెడిట్ నోట్ ద్వారా అందిస్తే ఐటీసీ రివర్స్ చేయాల్సిన అవసరం లేదు.

ఎందుకంటే జీఎస్‌టీ చట్టం ప్రకారం సాధారణ క్రెడిట్ నోట్ ద్వారా డిస్కౌంట్ ఇస్తే, సరఫరాదారు (కంపెనీ) తన అవుట్‌పుట్ ట్యాక్స్‌ను తగ్గించుకునే సౌలభ్యం ఉంది. అంటే, ముందుగా ప్రభుత్వానికి చెల్లించిన పన్ను నుంచి క్రెడిట్ నోట్ మేరకు పన్ను తగ్గించుకోవచ్చు. కాబట్టి, ఆ మేరకు డీలర్ ఐటీసీని రివర్స్ చేయాల్సి ఉంటుంది. అదే కమర్షియల్ క్రెడిట్ నోట్ ఇచ్చినప్పుడు ఈ విధంగా పన్ను సర్దుబాటు చేసుకునే సౌలభ్యం సరఫరాదారునికి లేదు. అంటే ప్రభుత్వానికి చెల్లించిన పన్నులో ఎలాంటి మార్పు ఉండదు. కాబట్టి డీలర్ ఐటీసీ రివర్స్ చేయనవసరం లేదు. దీన్ని ఒక ఉదాహరణ ద్వారా తెలుసుకుందాం.

ఒక డీలర్ ఒక కంపెనీ నుంచి రూ.10 లక్షల విలువైన సరుకును కొన్నాడు. పన్ను 18 శాతంతో కలిపి మొత్తం రూ.11.80 లక్షలు చెల్లించాడు. టార్గెట్ పూర్తి చేసినందుకుగాను కంపెనీ 5 శాతం పోస్ట్ సేల్ డిస్కౌంట్‌ను క్రెడిట్ నోట్ ద్వారా అందించటం జరిగింది. ఒకవేళ కంపెనీ ఈ మొత్తాన్ని సాధారణ క్రెడిట్ ద్వారా అంటే రూ.50,000 ప్లస్ జీఎస్‌టీ (రూ.9,000)తో కలిపి రూ.59,000కు ఇస్తే జీఎస్‌టీ రూ.9,000ను కంపెనీ తదుపరి తగ్గించుకుంటుంది. కాబట్టి డీలర్ ఐటీసీ రివర్స్ చేయాలి. అలాకాకుండా కంపెనీ ఫైనాన్షియల్ క్రెడిట్ నోట్‌ను కేవలం రూ.50,000కు మాత్రమే ఇస్తే అప్పటికే చెల్లించిన పన్నులో ఎలాంటి మార్పు ఉండదు. కాబట్టి డీలర్ ఐటీసీ రివర్స్ చేయనవసరం లేదు.

అలాగే చాలా ఇండస్ట్రీల్లో ముఖ్యంగా ఎలక్ట్రానిక్స్ రంగంలోని తయారీదారులు.. డీలర్లు తమ అమ్మకాలు పెంచుకోవటానికి వీలుగా అదనపు డిస్కౌంట్స్ ఇస్తాయి. ఇలా ఇచ్చే అదనపు డిస్కౌంట్స్‌ను డీలర్లు.. వినియోగదారులకు ఇస్తారు. దాంతో వినియోగదారులకు తక్కువ ధరలో వస్తువులు దొరుకుతాయి. అమ్మకాలు పెరుగుతాయి. ఈ సందర్భంలో వచ్చే సందేహం ఏమిటంటే.. తయారీదారు ఇచ్చిన డిస్కౌంట్‌ను కూడా ఆ వస్తువు అమ్మకానికి సంబంధించి పొందిన చెల్లింపుగా డీలర్ పరిగణించి దాని పైన కూడా పన్ను చెల్లించాలా అని? ఇక్కడ కూడా ప్రభుత్వం వివరణ ఇచ్చింది. ఒకసారి సరుకు ఉత్పత్తిదారుని నుంచి డీలర్ పొందితే ఉత్పత్తిదారుడికి ఆ వస్తువు మీద ఎలాంటి హక్కులు ఉండవు. కాబట్టి ఆ డిస్కౌంట్‌ను డీలర్.. వినియోగదారునికి చేసిన అమ్మకం తాలుకు చెల్లింపు కింద భావించనవసరం లేదు. దీనికి సంబంధించి ఎలాంటి జీఎస్‌టీ చెల్లించాల్సిన అవసరం లేదు. అయితే తక్కువ ధరకే వస్తువును అందించటానికి గాను కొన్ని సందర్భాల్లో ఉత్పత్తిదారునికి, వినియోగదారునికి మధ్య నేరుగా అగ్రిమెంట్ ఉంటుంది. అలాంటప్పుడు కంపెనీ ఆ డిస్కౌంట్‌ను డీలర్ ద్వారా అందిస్తుంది. తద్వారా ఆ డిస్కౌంట్ వినియోగదారునికి చేరటానికి వీలుగా. అప్పుడు మాత్రమే డీలర్ ఆ డిస్కౌంట్ మొత్తాన్ని కన్సిడరేషన్ కింద భావించి తగు జీఎస్‌టీ చెల్లించాలి.

ఇకపోతే చాలా సందర్భాల్లో డీలర్ తన అమ్మకాలు పెంచుకునేందుకు కొన్ని సర్వీస్‌లు, సేవలు చేస్తుంటాడు. ఉదాహరణకు సేల్స్ మేళా, ప్రకటనలు, ఎగ్జిబిషన్స్ మొదలైనవి. ఇవన్నీ డీలర్ తన కోసం కాకుండా కంపెనీ కోసం చేస్తున్నాడు. కాబట్టి కంపెనీలు ఇచ్చే పోస్ట్ సేల్ డిస్కౌంట్స్‌ను డీలర్ చేసిన ఇలాంటి సర్వీస్‌కు సంబంధించిన చెల్లింపుగా భావించి జీఎస్‌టీ చెల్లించాలా? అనే సందేహం కూడా ఉండేది. ఇక్కడ కూడా ప్రభుత్వం వివరణ ఇచ్చింది. ఎప్పుడైతే డీలర్‌కు కంపెనీ మధ్య ఒక సర్వీస్‌కు సంబంధించి చెల్లింపుతో కూడిన అగ్రిమెంట్ ఉంటుందో అప్పుడు మాత్రమే ఆ డీలర్ కంపెనీ నుంచి పొందిన మొత్తాన్ని ఆ సర్వీస్‌కు సంబంధించిన ప్రతిఫలంగా భావించాలి. అప్పుడు మాత్రమే తగిన జీఎస్‌టీ చెల్లించాలి.

ప్రభుత్వం ఇచ్చిన ఈ వివరణల ద్వారా ఏదేనీ ప్రత్యేక సందర్భాల్లో తప్ప, సాధారణ పరిస్థితుల్లో పొందే ఫైనాన్షియల్ లేదా కమర్షియల్ క్రెడిట్ నోట్స్ మీద ఐటీసీ రివర్స్ లేదా జీఎస్‌టీ చెల్లింపు అవసరం లేదు. కాకపోతే, డీలర్లు తాము పొందే క్రెడిట్ నోట్స్ మీద పూర్తి అవగాహన పొంది ఉండాలి.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.

మహిళలతోనే సమాజంలో మార్పు సాధ్యం

- పుస్తక పఠనంతో ఎన్నో నేర్చుకున్నా
- 'ఆమె సూర్యుడిని కబళించింది' పుస్తకావిష్కరణ సభలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్
- పవన్ నా అభిమాన నాయకుడు: మంత్రి సత్యకుమార్


'ఆమె సూర్యుడిని కబళించింది' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం పవన్, మంత్రి సత్యకుమార్, మండలి బుద్ధప్రసాద్, కృష్ణారావు తదితరులు

విజయవాడ, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): సమాజంలో బలమైన మార్పు మహిళల ద్వారా మాత్రమే సాధ్యమవుతుందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అభిప్రాయపడ్డారు. అందుకే జనసేన మహిళా విభాగానికి వీరమహిళ అని నామకరణం చేశామన్నారు. మన సంస్కృతిలో అత్యున్నత గౌరవం మహిళలకు ఉంటుందన్నారు. లక్ష్మీ ముర్డేశ్వర్ పురి రాసిన 'ఆమె సూర్యుడిని కబళించింది' పుస్తకావిష్కరణ కార్యక్రమం విజయవాడ తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో శనివారం జరిగింది. ఈ పుస్తకాన్ని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆవిష్కరించారు. అనంతరం పవన్ కల్యాణ్ మాట్లాడుతూ... 'పుస్తకం ప్రభావం నాపై ఉంది. పుస్తక పఠనం ద్వారా ఎన్నో నేర్చుకున్నా. సాంకేతిక పరిజ్ఞానం ఎంత అందుబాటులోకి వచ్చినా పుస్తక పఠనం ద్వారా మరింత విజ్ఞానం వస్తుంది. నేను మారిపోయానని కమ్యూనిస్టులు అంటున్నారు. నేను ఎప్పుడూ ఒకే ఆలోచనతో ఉంటాను. కమ్యూనిస్టు చరిత్ర, భారతీయ చరిత్ర, విశ్వదర్శనం వంటి పుస్తకాలు ఒకే సమయంలో చదివాను. అన్ని అంశాలపై లోతుగా పరిశీలన చేస్తా. మంచి పుస్తకాల కోసం తపన పడతాను. ఒక్కో పుస్తకంలో రాసే జీవితం, వాటిలో అంశాలు మనల్ని ప్రభావితం చేస్తాయి. ఓజీ అంటే ఏమిటి? అని ఎలా చూశారో... 'ఆమె సూర్యుడిని కబళించింది' అన్న టైటిల్ కూడా అలాగే ఉత్సుకతను రేకెత్తించేలా ఉంది. ఐఎఫ్ఎస్ చదువుకున్న లక్ష్మి నుంచి ఇలాంటి పుస్తకం రావడం ఆశ్చర్యం కలిగించింది. స్వాతంత్య్ర సంగ్రామ సమయంలో ధీరోదాత్త వనిత మాలతి పోరాటాన్ని ఈ పుస్తకంలో ప్రస్తావించారు. మనం దుర్గాదేవిని పూజిస్తాం. నేను ప్రతి మహిళనూ దుర్గాదేవిగా చూస్తాను. మా అమ్మ నాకు ఎంతో అండగా నిలిచింది. మా నాన్న బదిలీల కారణంగా అనేక ప్రాంతాలకు వెళ్లినా కొత్త ప్రదేశంలో అమ్మ అనేక అంశాలను మాకు చెప్పేది. ఎవరికీ భయపడకు... నిలబడు... పది దెబ్బలు తిన్నా ఎదురు తిరిగి ఒక్క దెబ్బయినా కొట్టు... అంటూ అమ్మ చెప్పేవారు. అటువంటి తల్లి, వదిన దగ్గర పెరిగిన నేను ఎన్నో నేర్చుకున్నా. ఈ పుస్తకం ఎంతోమందిలో స్ఫూర్తిని నింపుతుంది' అని పవన్ కల్యాణ్ అన్నారు. వైద్య ఆరోగ్య మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ... 'పురాతన కాలం నుంచి మన సమాజంలో మహిళలకు ప్రాధాన్యం ఉంది. అన్ని సాహిత్యాలను ఈ పుస్తకంలో మేళవించారు. ఆర్థిక శాఖ లక్ష్మీదేవి వద్ద, విద్యాశాఖ సరస్వతీదేవి వద్ద, రక్షణ శాఖ దుర్గామాత వద్ద ఉండేవి. ఇదంతా మన సంస్కృతిలో నిబిడీకృతమై ఉంది. ఏ దేశంలో ఇది కనిపించదు. సామాజిక, రాజకీయ, ఆర్థిక సమకాలీన అంశాలపై రాసిన పుస్తకం పవన్ కల్యాణ్ ఆవిష్కరించాల్సి ఉంది. అది జరగలేదు. పవన్ కల్యాణ్ సాహిత్యప్రియుడు. ఆయన నా అభిమాన నాయకుడు. పవన్ కల్యాణ్ ప్రభావం సమాజంపై ఉంది. ఆయన సినిమా పాటలో చేగువేరా ప్రస్తావన విని ఆయన గురించి తెలుసుకున్నా' అని అన్నారు. కార్యక్రమంలో ఆంధ్రజ్యోతి ఢిల్లీ బ్యూరో ఇన్‌చార్జి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమంతోనే దేశాభివృద్ధి

పప్పుధాన్యాల సాగుకు ప్రోత్సాహం

పంట ఉత్పత్తుల్లో నాణ్యత పెంచాలి: అచ్చెన్న


పీఎం ధన్-ధాన్య కృషి యోజన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రధాని మోదీ ప్రసంగాన్ని వింటున్న మంత్రి అచ్చెన్నాయుడు

గుంటూరు సిటీ, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే దేశ అభివృద్ధికి పునాది అని, కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రంలోని డబుల్ ఇంజన్ సర్కార్ రైతులకు మేలు చేసే కార్యక్రమాల అమలుకు చిత్తశుద్ధితో కృషి చేస్తోందని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. గుంటూరు సమీప లాంలోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయంలో న్యూఢిల్లీ నుంచి ప్రధాని మోదీ ప్రారంభించిన పీఎం ధన్-ధాన్య కృషి యోజన, పప్పు ధాన్య ఆత్మ నిర్భరత మిషన్ ప్రారంభోత్సవ ప్రత్యక్ష ప్రసార కార్యక్రమంలో మంత్రి అచ్చెన్నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పీఎం ధన్ ధాన్య యోజన రైతుల ఆర్థిక పరిపుష్టికి దారితీస్తుందని అన్నారు. దేశవ్యాప్తంగా రూ.42,000 కోట్ల విలువైన వ్యవసాయ, మత్స్య, పశుసంవర్ధక తదితర అనుబంధ రంగాలకు చెందిన ప్రాజెక్టులను ప్రధాని ప్రారంభిస్తున్నారని తెలిపారు. పీఎం ధన్-ధాన్య కృషి యోజనలో రాష్ట్రంలో ఎంపికైన అల్లూరి, అనంతపురం, శ్రీ సత్యసాయి, అన్నమయ్య జిల్లాల్లో వచ్చే ఆరేళ్లలో.. వ్యవసాయ అనుబంధ రంగాల్లో ఉత్పత్తుల పెంపు, నాణ్యతపై దృష్టి, పంట నష్టాల తగ్గింపు లక్ష్యంగా ప్రోత్సాహం అందిస్తారని తెలిపారు. ప్రజల ఆహార అలవాట్లు మారిన నేపథ్యంలో ప్రోటీన్‌తో కూడిన పప్పుధాన్యాలను ప్రజలకు అందచేయడానికి.. వాటి సాగును ప్రోత్సహిస్తారని చెప్పారు. రైతులు సాగుచేసిన పప్పు ధాన్యాలను చివరి గింజ వరకు మద్దతు ధరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. రైతులు ఒకే విధమైన పంటలను సాగు చేయకుండా ప్రకృతి సాగు పద్ధతులను అవలంబించాలని మంత్రి సూచించారు. విదేశీ ఎగుమతులకు వీలుగా పంట ఉత్పత్తుల్లో నాణ్యతను పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, వ్యవసాయ శాఖ ఎక్స్అఫిషియో సెక్రటరీ బి.రాజశేఖర్, ఉప కులపతి శారద జయలక్ష్మిదేవి, విశ్వ విద్యాలయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.


న్యూఢిల్లీలో అనిల్ కామినేని సారథ్యంలో నిర్వహించిన తొలి ప్రపంచ ఆర్చరీ ప్రీమియర్ లీగ్ విజయవంతమైన సందర్భంగా హీరో రామ్‌చరణ్, ఆయన సతీమణి ఉపాసన ప్రధాని నరేంద్ర మోదీని శనివారం కలిశారు. లీగ్‌కు సంబంధించిన వివరాలను చరణ్, ఉపాసన, అనిల్ కామినేనిలు ప్రధానికి వివరించారు. ఈ సందర్భంగా వారు ఆర్చరీ విల్లు, శ్రీ వేంకటేశ్వర స్వామి ప్రతిమను ప్రధానికి బహూకరించారు. 'ప్రధాన మంత్రిని కలవడం ఎంతో గర్వంగా అనిపించింది' అని రామ్‌చరణ్ ట్వీట్ చేశారు.
న్యూఢిల్లీ(ఆంధ్రజ్యోతి)

ఘనంగా నార్నె నితిన్ వివాహం



జూనియర్ ఎన్టీఆర్ బావమరిది, 'మ్యాడ్' సిరీస్ ఫేమ్ నార్నె నితిన్ ఓ ఇంటి వాడయ్యాడు. తాళ్లూరి కృష్ణప్రసాద్, స్వరూప దంపతుల కుమార్తె లక్ష్మీ శివానితో ఆయన వివాహం హైదరాబాద్‌లో శుక్రవారం రాత్రి ఘనంగా జరిగింది. ఈ వేడుకకు జూనియర్ ఎన్టీఆర్, ఆయన సతీమణి లక్ష్మీ ప్రణతి, హీరోలు వెంకటేశ్, కల్యాణ్‌రామ్, నిర్మాత సురేశ్‌బాబుతో పాటు పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు విచ్చేసి నూతన జంటను ఆశీర్వదించారు.

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

సెట్స్ పైకి కొత్త చిత్రం



విజయ్ దేవరకొండ కథానాయకుడిగా నటించబోయే కొత్త చిత్రం శనివారం సెట్స్‌పైకి వెళ్లింది. ముహూర్తపు షాట్‌కు అల్లు అరవింద్ క్లాప్ ఇచ్చారు. నిరంజన్ రెడ్డి కెమెరా స్విచ్ఛాన్ చేశారు. దర్శకుడు హను రాఘవపూడి తొలి షాట్‌కు గౌరవ దర్శకత్వం వహించారు. 'రాజావారు రాణిగారు' చిత్రంతో ప్రతిభావంతుడైన దర్శకుడిగా పేరు తెచ్చుకున్న రవికిరణ్ కోలా ఈ చిత్రాన్ని తెరకెక్కించనున్నారు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్‌రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. ఈ బేనర్‌లో రూపొందుతున్న 59వ చిత్రమిది. ఇందులో విజయ్ సరసన కీర్తిసురేశ్ కథానాయికగా నటిస్తున్నారు. 'రూరల్ యాక్షన్ డ్రామా నేపథ్యంలో ఈ చిత్రం తెరకెక్కుతోంది, ఈ నెల 16 నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలుపెడతాం, వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం' అని యూనిట్ తెలిపింది.

వాటన్నింటికీ భిన్నంగా తెలుసు కదా

రాశీ ఖన్నా



'ఇప్పటివరకూ వెండితెరపై వచ్చిన ప్రేమకథలకు భిన్నంగా 'తెలుసు కదా' చిత్రాన్ని దర్శకురాలు నీరజ కోన తీర్చిదిద్దారు. ముక్కోణపు ప్రేమకథలో ఓ కొత్త కోణాన్ని హృదయాలకు హత్తుకునేలా ఆవిష్కరించారు.కథ విన్నప్పుడు నేను సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యాను. సినిమా చూసిన ప్రేక్షకులు కూడా అదే అనుభూతికి లోనవుతారు' అని కథానాయిక రాశీ ఖన్నా అన్నారు. సిద్ధు జొన్నలగడ్డ, శ్రీనిధి శెట్టి, రాశీఖన్నా ప్రధాన తారాగణంగా తెరకెక్కిన చిత్రమిది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించారు. ఈ నెల 17న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా రాశీఖన్నా సినిమా విశేషాలను మీడియాతో పంచుకున్నారు.

- ఇప్పటివరకూ నేను చాలా ప్రేమకథా చిత్రాలు చేశాను. కానీ 'తెలుసుకదా' మాత్రం వాటన్నింటికీ భిన్నంగా ఉంటుంది. ఇందులో అంజలి అనే అమ్మాయి పాత్రలో కనిపిస్తాను.
- సిద్ధూకి అన్ని విభాగాల మీద అవగాహన ఉంది. సెట్స్‌లో అన్నింటినీ సమన్వయం చేసుకుంటాడు.శ్రీనిధిశెట్టి ఈ చిత్రం షూటింగ్‌లో మంచి స్నేహితురాలయ్యారు. మా కాంబినేషన్‌లో వచ్చే సన్నివేశాలను ప్రేక్షకులను కదిలిస్తాయి. ఈ బేనర్‌లో నాకు ఇది రెండో చిత్రం. విశ్వప్రసాద్ మంచి అభిరుచి ఉన్న నిర్మాత. ప్రస్తుతం పవన్ కల్యాణ్ గారితో 'ఉస్తాద్ భగత్‌సింగ్' చేస్తున్నాను. హిందీలో నాలుగు చిత్రాలు చేస్తున్నాను.

నా అభిమానుల కోసమే కె ర్యాంప్


కిరణ్ అబ్బవరం



'కొత్త స్ర్కిప్ట్ చేద్దామనే ఉద్దేశంతో 'క' అనే సినిమా చేశాను. కె-ర్యాంప్'ని మాత్రం ప్రత్యేకంగా నా అభిమానుల కోసమే చేశాను. ఈ చిత్రంలో నేటి తరం యువతకు దగ్గరగా ఉండే పాత్ర నాది. సందర్భాన్ని బట్టి యువత అసహనంతో ప్రవర్తించే తీరులోనే నా సంభాషణలు ఉంటాయి. అయితే ఈ డైలాగ్స్‌లో ఎవరికీ ఎలాంటి ఇబ్బంది కలగదని మాత్రం చెప్పగలను. గతేడాది దీపావళి కంటే ఈసారి ఈ దీపావళి బాగా ఉంటుంది. నన్ను నమ్మండి' అని అన్నారు హీరో కిరణ్ అబ్బవరం. ఆయన కథానాయకుడిగా జైన్స్ నాని దర్శకత్వంలో తెరకెక్కిన 'కె ర్యాంప్' చిత్రం ఈనెల 18న విడుదల కానుంది. యుక్తి తరేజా కథానాయిక. రాజేశ్ దండా, శివ బొమ్మకు నిర్మించారు. శనివారం ఈ చిత్రానికి సంబంధించిన ట్రైలర్ లాంచ్ వేడుకను నిర్వహించారు. చిత్ర దర్శకుడు జైన్స్ నాని మాట్లాడుతూ 'ట్రైలర్‌లోని ఎనర్జీకి సినిమా ఏ మాత్రం తగ్గదు' అని అన్నారు. నిర్మాత రాజేశ్ దండా మాట్లాడుతూ 'ఈ దీపావళికి వస్తున్న నాలుగు సినిమాలు హిట్ కావాలి. అందులో కె ర్యాంప్' ఒక మెట్టు పైనే ఉండాలి' అని ఆకాంక్షించారు. సీనియర్ నటుడు వీకే నరేశ్ మాట్లాడుతూ 'దీపావళి పండక్కి మీరు కొనే టపాసు రెండు నిమిషాలే ఉంటుంది. కానీ మీరు కొనే టిక్కెట్టుతో మా సినిమా రెండు గంటలు వినోదం పంచుతుంది' అని అన్నారు.

నా చిన్నప్పటి కోరిక తీరింది

రిషబ్ శెట్టి



'మా ఊళ్లో సినిమా షూటింగ్ చేయాలనేది నా చిన్నప్పటి కోరిక. అది 'కాంతార: చాప్టర్ 1'తో తీరింది. ఇప్పుడు ఆ సినిమా సక్సెస్ అవ్వడం ఆ ఆనందాన్ని రెండింతలు చేసింది' అని రిషబ్‌శెట్టి అన్నారు. ఆయన కథానాయకుడిగా స్వీయ దర్శకత్వంలో తెరకెక్కించిన చిత్రమిది. ఇటీవలే విడుదలై పాన్ ఇండియా స్థాయిలో చక్కటి ఆదరణతో కొనసాగుతోంది. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు.

- ఈ సినిమా చిత్రీకరణలో చాలా సవాళ్ల ఎదుర్కొన్నాం. ముఖ్యంగా కాంతార ప్రపంచాన్ని సృష్టించడం కోసం చాలా శ్రమించాం. అన్ని విభాగాలు కూడా చాలా లోతైన పరిశోధన చేశాయి. సంగీత దర్శకుడు అజనీశ్ గిరిజన ప్రాంతాలకు వెళ్లి అక్కడి ఒరిజినల్ స్కోర్‌ని రికార్డ్ చేశారు. హోంబలే లాంటి నిర్మాణ సంస్థ వెనుక ఉండడం వల్లే ఎన్నో అడ్డంకులను దాటుకొని ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురాగలిగాం.
- నటుడిగా కన్నా నాలోని దర్శకుడు సక్సెస్ కొడితే వచ్చే ఆనందాన్ని నేను ఎక్కువగా ఆస్వాదిస్తాను. ప్రస్తుతం తెలుగులో 'జై హనుమాన్' చిత్రం చేస్తున్నాను.

'మిత్ర మండలి' సెన్సార్ పూర్తి



ప్రియదర్శి, నిహారిక ఎన్.ఎమ్ జంటగా విజయేందర్ తెరకెక్కించిన చిత్రం 'మిత్రమండలి'. వెన్నెల కిశోర్, వీటీవీ గణేశ్, రాగ్ మయూర్, విష్ణు ఓయ్ కీలక పాత్రల్లో నటించారు. బీవీ వర్క్స్ బ్యానర్, బన్నీ వాసు సమర్పణలో కల్యాణ్ మంతిన, భానుప్రతాప, డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల నిర్మించారు. ఈ నెల 16న చిత్రం విడుదలవుతోంది. తాజాగా ఈ సినిమా సెన్సార్ పూర్తైంది. యూ/ఏ సర్టిఫికేట్ వచ్చింది. ఈ చిత్రం ఆద్యంతం వినోదభరితంగా ఉందని, సమాజంలోని కులవ్యవస్థపై వ్యంగ్యంగా విమర్శనాస్త్రాలు సంధించిందని సెన్సార్ సభ్యులు అభినందించినట్లు చిత్రబృందం తెలిపింది.

విజయవాడ టు సింగపూర్

వచ్చే నెల 15 నుంచి ఇండిగో విమాన సర్వీసు ప్రారంభం

- ప్రతి మంగళ, గురు, శనివారాల్లో సేవలు అందుబాటులోకి
- అంతర్జాతీయ కనెక్టివిటీతో అమరావతికి విదేశీ పెట్టుబడులు
- పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు



విజయవాడ సిటీ/న్యూఢిల్లీ, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): విజయవాడ నుంచి సింగపూర్‌కు నూతన విమాన సర్వీసులను ఇండిగో సంస్థ ప్రారంభించనుందని కేంద్ర పౌర విమానాయన శాఖ మంత్రి కింజారపు రామ్మోహననాయుడు తెలిపారు. నవంబరు 15 నుంచి ఈ సర్వీసు అందుబాటులోకి వస్తుందని, ప్రతి మంగళ, గురు, శని వారాల్లో ఈ విమానం విజయవాడ నుంచి సింగపూర్‌లోని చాంగీ విమానాశ్రయాల మధ్య నడుస్తుందని పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు సింగపూర్ పర్యటన చేసిన రోజే (జూలై 28) ఈ సర్వీసు విషయంపై ప్రస్తావన వచ్చిందని అన్నారు. ప్రవాసాంధ్రుల సమావేశంలో చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు వంద రోజుల్లోనే విమాన సర్వీసులు అందుబాటులోకి తెచ్చామన్నారు. స్వర్ణాంధ్ర-2047 లక్ష్యాల సాధనలో ప్రవాసాంధ్రుల పాత్ర అత్యంత కీలకమని ఆయన అభిప్రాయపడ్డారు. భవిష్యత్తులో కోటి మందికి పైగా ప్రవాసాంధ్రులు సింగ్‌పూర్‌కు ప్రయాణం చేసే అవకాశం ఉందన్నారు. రానున్న రోజుల్లో అంతర్జాతీయ విమాన అనుసంధానాన్ని విస్తృతం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సర్వీసు విజయవాడతో పాటు తూర్పు ఆంధ్ర ప్రజలకు ఉపయోగపడుతుందన్నారు. అంతర్జాతీయ కనెక్టివిటీతో అమరావతికి విదేశీ పెట్టుబడులు వస్తాయని, అమరావతిని ప్రపంచ స్థాయి రాజధాని నగరంగా తీర్చిదిద్దేందుకు ఇది దోహదం చేస్తుందని వివరించారు. ఈ నూతన విమాన సేవలు ఏపీని సన్ రైజ్‌స్టేట్‌గా ప్రపంచానికి మరింత దగ్గర చేస్తాయని రామ్మోహన్ పేర్కొన్నారు. కాగా, ప్రజా విజ్ఞప్తులను దృష్టిలో ఉంచుకుని విమాన సమయాలను రూపొందించడం పట్ల ప్రయాణికుల నుంచి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. అంతర్జాతీయ స్థాయిలో విజయవాడ అభివృద్ధి చెందేందుకు ఈ సర్వీసులు దోహదపడతాయని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని విమాన సర్వీసులు అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

‘బనకచర్ల’పై ఏకాభిప్రాయ సాధన!

- తెలంగాణ సీఎంకు పాటిల్ లేఖ
- సహకరించాలని కోరిన కేంద్ర మంత్రి

అమరావతి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): రాయలసీమకు గేమ్ చేంజర్‌గా భావిస్తున్న పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు విషయంలో రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం సాధించేందుకు కేంద్రం ప్రయత్నం చేస్తోంది. దీనిలో భాగంగా కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ గత నెల 21న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. ప్రాజెక్టు విషయంలో సహకరించాలని ఆయనను కోరినట్టు తెలిసింది. ఈ లేఖకు సంబంధించిన సమాచారం తాజాగా వెలుగులోకి వచ్చింది. ఇదిలావుంటే.. ఈ ఏడాది జూన్‌లో ప్రాజెక్టుకు సంబంధించిన ప్రీ-ఫీజిబిలిటీ రిపోర్టును రాష్ట్ర జల వనరుల శాఖ.. కేంద్ర జల సంఘానికి పంపింది. అయితే, ఇతర రాష్ట్రాలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో అసలు వరద జలాల లభ్యతపై గణాంకాలు ఇవ్వాలని కేంద్రం కోరింది. ఈ గణాంకాలను కూడా సిద్ధం చేసిన రాష్ట్ర జల వనరుల శాఖ.. సోమవారం తర్వాత కేంద్రానికి నివేదిక పంపేందుకు సిద్ధమవుతోంది. అదేవిధంగా సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్)ను కూడా త్వరలోనే కేంద్రానికి పంపేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. డీపీఆర్ తయారు చేసేందుకు ఈ నెల 5న టెండర్లు పిలిచింది. టెండరు దక్కించుకున్న సంస్థ ప్రీ-ఫీజిబిలిటీ రిపోర్టును ఆధారం చేసుకుని.. ప్రజాభిప్రాయ సేకరణతో సహా ప్రాజెక్టు వ్యయాన్ని సాంకేతికంగా అంచనా వేస్తుంది. ఈ నివేదికను సాధ్యమైనంత త్వరగా కేంద్రానికి పంపాలని రాష్ట్రం నిర్ణయించింది. ఇదిలావుంటే, వివాదాల పరిష్కారానికి ఇబ్రహీంపట్నం ఎగువన దాములూరు వద్ద అక్విడెక్టు నిర్మించాలని నిపుణులు సూచిస్తున్నారు.

ప్రధాని కర్నూలు పర్యటన ఖరారు

- ఉదయం నుంచి సాయంత్రం వరకు రాష్ట్రంలోనే మోదీ
- గంటన్నరపాటు జరగనున్న జీఎస్టీ విజయోత్సవ సభ
- గంటపాటు శ్రీశైలం ఆలయంలో మోదీ పూజలు



అమరావతి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రాష్ట్ర పర్యటన ఖరారైంది. 16న కర్నూలులో జరిగే ‘సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్’ విజయోత్సవ సభకు ప్రధాని హాజరవుతున్నారు. మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమంలో ప్రధానితోపాటు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, రాష్ట్ర మంత్రులు లోకేశ్ తదితరులు పాల్గొంటారు. 16వ తేదీ ఉదయం 10.20కు ఢిల్లీ నుంచి కర్నూలు విమానాశ్రయానికి ప్రధాని చేరుకుంటారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో సుండిపెంట చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో 11.45కు శ్రీశైలం చేరుకుని, భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయంలో 50 నిమిషాలపాటు పూజలు నిర్వహిస్తారు. మధ్యాహ్నం 2.30కు కర్నూలు చెంతనే ఉన్న నన్నూరు గ్రామానికి చేరుకుని జీఎస్టీ విజయోత్సవ సభలో పాల్గొంటారు. అక్కడే పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన, పూర్తయిన ప్రాజెక్టులను జాతికి అంకితం చేస్తారు. సభ ముగిసిన తర్వాత 4.45కి తిరిగి ఢిల్లీ వెళ్తారు.

కల్తీ మద్యం వ్యాపారులు జగన్ బినామీలే: వర్ల



అమరావతి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో రాష్ట్రంలో కల్తీ మద్యం ఏరులై పారిందని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య ఆరోపించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో కల్తీ మద్యానికి మూల కారణం జగన్ అని, ఇక్కడ సరిపోక కల్తీ మద్యం వ్యాపారాన్ని సౌత్ఆఫ్రికాకు విస్తరించారని, తన బినామీలతో అక్కడ కల్తీ మద్యం వ్యాపారం చేయించారని ఆరోపించారు. జయచంద్రారెడ్డిని ఎన్నికలకు ముందు టీడీపీలోకి వైసీపీ కోవర్టుగా పంపారని ఆరోపించారు.

మెడికల్ కళాశాలలకు పీపీపీ విధానమే మేలు

- వైసీపీ హయాంలో అసంపూర్తిగా నిర్మాణాలు: కొండపల్లి

విజయనగరం, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న మెడికల్ కళాశాలల విషయంలో పీపీపీ విధానమే మేలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ స్పష్టం చేశారు. విజయనగరంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ హయాంలో మెడికల్ కళాశాలలు అసంపూర్తిగా ఉండిపోయాయన్నారు. ప్రస్తుతం ప్రారంభమైన మెడికల్ కాలేజీల్లో పూర్తి స్థాయి భవనాలు, పరికరాల కొనుగోలుకు ఒక్కోదానికి రూ.500 కోట్లు అవసరం అన్నారు. జగన్ తన ఉనికి కోసమే వైద్య కళాశాలల నిర్మాణాల పరిశీలన బాట పట్టారన్నారు. పీపీపీ పద్ధతిలో మెడికల్ కాలేజీల నిర్మాణంపై జగన్ ప్రజలకు అవాస్తవాలు చెబుతున్నారని విమర్శించారు.

వైద్య కళాశాలల పీపీపీపై పిల్

అమరావతి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 10 మెడికల్ కాలేజీలను ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ) విధానంలో నిర్మించాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. దీనికి సంబంధించి గతనెల 9న ప్రభుత్వం జారీ చేసిన జీవో 590ని రద్దు చేయాలని కోరుతూ అన్నమయ్య జిల్లా మదనపల్లెకు చెందిన బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు బి. గౌతమ్‌కుమార్ ఈ పిటిషన్ దాఖలు చేశారు. పీపీపీ విధానం అమలుతో కలిగే సామాజిక, ఆర్థిక, రాజ్యాంగపరమైన ప్రభావాలను సమగ్రంగా సమీక్షించి, ప్రజా సంప్రదింపులు జరిపేవరకు టెండర్, బిడ్డింగ్ ప్రక్రియలను నిలుపుదల చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. పీపీపీ విధానంలో అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదించిన 10 కళాశాలలతో పాటు రాష్ట్రంలో చేపట్టిన మొత్తం 17 వైద్య కాలేజీలను ప్రభుత్వ నిధులతో అభివృద్ధి చేసేలా ఆదేశాలు ఇవ్వాలని, ఈ కళాశాలల్లో ఉన్న అన్ని సీట్లలో రాజ్యాంగబద్ధంగా కల్పించిన రిజర్వేషన్లు అమలు చేయాలని అభ్యర్థించారు. పేద, సామాజికంగా వెనుకబడిన విద్యార్థులకు వైద్య విద్య అందుబాటులో ఉండేలా ఏడాదికి గరిష్ఠ ఫీజు రూ.50 వేలకు మించకుండా పరిమితం చేయాలన్నారు. టెండర్ ప్రక్రియ, మార్కెట్ విలువకు విరుద్ధంగా వైద్య కళాశాలలకు భూముల బదిలీ, ప్రజాధనం దుర్వినియోగంపై హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి నేతృత్వంలో కమిషన్‌ను ఏర్పాటు చేసి 6 నెలల్లో నివేదిక ఇచ్చేలా ఆదేశాలు ఇవ్వాలని పేర్కొన్నారు. వైద్య కళాశాలలపై విద్యార్థి సంఘాలు, వైద్య నిపుణులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజిక వర్గాల ప్రతినిధులు, భాగస్వాములు, పౌర సంఘాలతో సంప్రదింపులు జరిపేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని విన్నవించారు. జీవో 590 ఆధారంగా తదుపరి చర్యలు నిలుపుదల చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని పిటిషనర్ కోరారు. వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి, కమిషనర్, ఏపీఎంఎస్ఐడీసీ ఛైర్మన్, వీసీ, ఎండీలను వ్యాజ్యంలో ప్రతివాదులుగా చేర్చారు.

శిక్షణ సరే.. కుట్టుమిషన్లు ఏవీ?

- ముందుకు సాగని మిషన్ల కొనుగోలు ప్రక్రియ
- 65వేల మందికి పైగా శిక్షణ
- మిషన్ల కోసం మహిళల ఎదురుచూపులు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రవ్యాప్తంగా బీసీ సంక్షేమశాఖ ద్వారా 65వేల మందికి కూటమి ప్రభుత్వం కుట్టుశిక్షణ ఇప్పించింది. అయితే, శిక్షణ పూర్తయి నెలలు గడుస్తున్నా వారికి ఇస్తామన్న కుట్టుమిషన్లు పంపిణీ చేయకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వాస్తవానికి తొలుత లక్ష మంది బీసీ, ఈబీసీ మహిళలకు కుట్టు శిక్షణ ఇచ్చి ఉచితంగా మిషన్లు పంపిణీ చేయాలని సంకల్పించగా 3,43,413మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. దీంతో 680 కేంద్రాలను ఏర్పాటుచేసి 1326బ్యాచ్‌ల ద్వారా 65,987 మందికి మొదట శిక్షణ ఇచ్చేందుకు నిర్ణయించారు. ప్రతి జిల్లాలో ఆయా మండల/మున్సిపాలిటీల్లో అవసరమైన వసతులతో శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేశారు. కుట్టు మిషన్లు, ఇతర సామగ్రి సమకూర్చడంతోపాటు ఆయా సంస్థల ద్వారా అనుభవజ్ఞులైన ట్రైనర్లను నియమించారు. రాష్ట్రవ్యాప్తంగా బీసీ, ఈడబ్ల్యూఎస్ శాఖల ద్వారా ఏర్పాటు చేసిన ఈ శిక్షణ కేంద్రాలను సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి సవితతో పాటు పలువురు మంత్రులు సందర్శించారు. స్థానిక ప్రజాప్రతినిధులు నిరంతరం పర్యవేక్షించారు. శిక్షణా కేంద్రాల్లో వసతులను ఎంపీడీవోలు పర్యవేక్షించారు. శిక్షణ పొందిన ప్రతి మహిళకూ కుట్టుమిషన్ ఉచితంగా ఇస్తామని ప్రభుత్వం పేర్కొనడంతో భారీసంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. చివరికి శిక్షణకు హాజరయ్యే వారికి మాత్రమే మిషన్లు ఇస్తామని నిబంధనలు కఠినతరం చేశారు. దీంతో వాస్తవంగా శిక్షణ పొంది కుట్టుమిషన్ల ద్వారా జీవనభృతి పొందాలనుకున్న మహిళలు మాత్రమే హాజరయ్యారు. దరఖాస్తు చేసుకున్న మహిళందరికీ శిక్షణ ఇచ్చే పరిస్థితులు లేకపోవడంతో వడపోతతో ఎంపిక చేశారు. ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు సిఫారసులు చేస్తుండటంతో డిమాండ్ పెరిగిపోయింది. మహిళల నుంచి ఇంకా స్పందన వస్తుండడంతో పీ4 కింద శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. అయితే ఇప్పటికే శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలు తమకు ఇస్తామన్న ఉచిత కుట్టుమిషన్లు అందిస్తే.. తమకాళ్లపై తాము నిలబడతామని ఎదురు చూస్తున్నా, ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టడంలేదు. అడగకపోయినా తమకోసం ఏటా రూ.2వేల కోట్లు వెచ్చించి ఉచిత బస్సు పథకం ప్రవేశపెట్టిన ప్రభుత్వం.. ఇస్తామన్న కుట్టుమిషన్లు ఇవ్వకుండా జాప్యం చేయడం ఏంటని మహిళలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



ఆర్థిక ప్రోత్సాహమేదీ?

కుట్టుమిషన్ పథకం ప్రారంభించి నాలుగు నెలలు పైబడినా ఈ శిక్షణకు అవసరమైన నిధులు మాత్రం విడుదల కావడం లేదు. బీసీ సంక్షేమ శాఖ, ఈడబ్ల్యూఎస్ శాఖ అధికారులు ఆర్థికశాఖకు ఫైల్ పంపినా ఏవేవో కొర్రీలు వేసి ఒక్క పైసా విడుదల చేయడం లేదు. శిక్షణకు అవసరమైన నిధులే విడుదల చేయని అధికారులు కుట్టుమిషన్ల కొనుగోలుకు ఎప్పుడు నిధులు విడుదల చేస్తారో అని వేచి చూస్తున్నారు.

స్వయం ఉపాధి ఊసేదీ?

మహిళల స్వయం ఉపాధికి సంబంధించి బీసీ, ఈబీసీ కార్పొరేషన్లు లబ్ధిదారుల ఎంపిక కూడా పూర్తిచేసి గత మార్చికి ముందే బ్యాంకులకు అందించింది. బీసీలకు సంబంధించి 18వేల మందికి, ఈబీసీ కార్పొరేషన్ల ద్వారా 4831 మందికి రుణాలిచ్చేందుకు బ్యాంకులు మంజూరు పత్రాలు జారీచేశాయి. జనరిక్ ఫార్మసీ షాపులు కూడా అందులో ఉన్నాయి. సబ్సిడీ నిధులు ప్రభుత్వం అందిస్తే బ్యాంకులు లబ్ధిదారులకు యూనిట్లు గ్రౌండ్ చేస్తాయి. కానీ, బీసీ సంక్షేమశాఖ, ఈడబ్ల్యూఎస్ విభాగంలోని ఆయా కార్పొరేషన్లు గత ఏడాదికి సంబంధించి ప్రక్రియనే పూర్తి చేయకపోవడంతో, ఈ ఏడాదికి సంబంధించి దరఖాస్తుల ప్రక్రియ కూడా ప్రారంభించలేని పరిస్థితి ఏర్పడింది. సాంఘిక సంక్షేమశాఖ, మైనారిటీ సంక్షేమశాఖలు కూడా రుణాల ప్రక్రియ (2025-26) ప్రారంభించి ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరించేందుకు అడుగు ముందుకేసింది. అయితే, ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ లేకపోవడంతో అవి కూడా దరఖాస్తుల ప్రక్రియను నిలిపేశాయి. గిరిజన సంక్షేమశాఖ అయితే వారి వద్ద కేంద్ర నిధులు ఉన్నప్పటికీ ట్రైకార్ ద్వారా రుణాలిచ్చేందుకు ఒక్క అడుగూ వేయలేకపోతోంది. స్వయం ఉపాధి పథకాలను పునరుద్ధరించి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఈబీసీలకు రుణాలను పునరుద్ధరిస్తామని కూటమి ప్రభుత్వం మేనిఫెస్టోలో సైతం పేర్కొంది. అయినా అమల్లో వెనుకడుగు వేయడం పట్ల బీసీ, ఈడబ్ల్యూఎస్ వర్గాల్లో నిరాశ పెల్లుబుకుతోంది. ప్రభుత్వం ఇకనైనా చొరవ తీసుకుని శిక్షణకు అవసరమైన నిధుల విడుదలతోపాటు, ఉచితంగా కుట్టుమిషన్ల పంపిణీ చేయాలని, అలాగే స్వయం ఉపాధి రుణాలు మంజూరు చేయాలని మహిళలు కోరుతున్నారు.

ఆ విద్యార్థులకు చికిత్స బాధ్యత ప్రభుత్వానిదే

- అన్నపర్రు హాస్టల్‌లో కలుషిత ఆహార ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష
- విద్యార్థులు పూర్తిగా కోలుకునే వరకు ఆస్పత్రి నుంచి డిశ్చార్జి చేయవద్దు
- వసతి గృహాల్లో శానిటేషన్ డ్రైవ్ చేపట్టాలి
- నాణ్యమైన ఆహారం అందించాలని ఆదేశం

గుంటూరు మెడికల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): బీసీ బాలుర వసతి గృహంలో కలుషిత ఆహారంతో అస్వస్థతకు గురైన విద్యార్థులకు చికిత్స అందించే బాధ్యతను పూర్తిగా ప్రభుత్వం తీసుకుంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. పిల్లల ఆరోగ్యం పట్ల ఆందోళన చెందవద్దంటూ తల్లిదండ్రులకు భరోసా ఇచ్చారు. గుంటూరు జిల్లా పెదనందిపాడు మండలంలోని అన్నపర్రు బీసీ బాలుర వసతి గృహంలో పలువురు విద్యార్థులు కలుషిత ఆహారం కారణంగా ఆసుపత్రిపాలైన ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షకు రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత, సంబంధిత శాఖ అధికారులు హాజరయ్యారు. 24 మంది విద్యార్థులు ప్రస్తుతం గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆస్పత్రిలో ఉన్నారని, మెరుగైన చికిత్స కోసం ఒక విద్యార్థిని మంగళగిరి ఎయిమ్స్‌కు తరలించినట్లు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ప్రాథమిక సమాచారం ప్రకారం ఆహారం కలుషితం కావడం వల్లే విద్యార్థులు అస్వస్థతకు గురైనట్లు చెప్పారు. ఆహార పదార్థాల నమూనాలను పరీక్షల కోసం ల్యాబ్‌కు పంపినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ, విద్యార్థులు పూర్తిగా కోలుకొనే వరకు ఆసుపత్రి నుంచి డిశ్చార్జి చేయవద్దని ఆదేశించారు. రాష్ట్రంలో అన్ని వసతి గృహాల్లో ఆరోగ్యకరమైన వాతావరణం ఉండేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని, విద్యార్థులందరికీ నాణ్యమైన ఆహారం అందించాలని స్పష్టం చేశారు. తక్షణం అన్ని వసతి గృహాల్లో ప్రత్యేకంగా శానిటేషన్ డ్రైవ్ చేపట్టాలని, పరిసరాల పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు.

పదోన్నతుల ఫైలు కదిలేదెన్నడో!

నిరీక్షణలో 3 వేల మంది ఆర్టీసీ ఉద్యోగులు

- ఐదేళ్ల పాటు పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం
- ఆగస్టులోనే ఆమోదించిన సీఎం చంద్రబాబు
- దాటవేత ధోరణిలో ఆర్టీసీ ఉన్నతాధికారులు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ప్రజా రవాణా శాఖ(పీటీడీ)లో పదోన్నతుల ఫైలుకు మోక్షం లభించడం లేదు. ఏపీఎస్ఆర్టీసీలో కండక్టర్ నుంచి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వరకూ దాదాపు 3వేల మందికి పైగా ప్రమోషన్ల కోసం సుదీర్ఘ కాలం నుంచి ఎదురు చూస్తున్నారు. వీరి పదోన్నతులకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆగస్టులోనే పచ్చజెండా ఊపినా ఇంతవరకూ ఆ దిశగా అడుగు ముందుకు పడలేదు. ఎప్పటికప్పుడు ఫైళ్లు క్లియర్ చేయాలని సీఎం పదేపదే హెచ్చరిస్తున్నా ఆర్టీసీ ఉన్నతాధికారులు మాత్రం దాటవేత ధోరణి అవలంబిస్తున్నారని సిబ్బంది ఆరోపిస్తున్నారు. పదోన్నతుల ఫైలు ముందుకు కదలాలంటే తాము రోడ్డెక్కడం తప్ప మరో మార్గం కనిపించడం లేదని వాపోతున్నారు. నిత్యం 45లక్షల మందికి పైగా ప్రయాణికుల్ని 11వేలకు పైగా బస్సుల్లో గమ్యానికి చేరుస్తున్న ఆర్టీసీలో సుమారు 47వేల మంది వివిధ హోదాల్లో పనిచేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు వీరికి బోర్డు ఆమోదంతో ఎప్పటికప్పుడు పదోన్నతులు లభించేవి. అయితే 2020లో బస్సులు, ఆస్తులను ఆర్టీసీలో.. సిబ్బందిని ప్రభుత్వంలో విలీనం చేశారు. అప్పటి నుంచి కార్పొరేషన్ నిబంధనలు వర్తించబోవని, ప్రభుత్వ మార్గదర్శకాల మేరకే పదోన్నతులు లభిస్తాయంటూ పదోన్నతుల కమిటీ(డీపీసీ) మెలిక పెట్టింది. పలుమార్లు మార్గదర్శకాలు సవరించి పంపినా వైసీపీ సర్కారు ఐదేళ్ల పాటు పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆర్టీసీ సిబ్బంది పదోన్నతులు త్వరగా పూర్తి చేస్తామని సీఎం చంద్రబాబు మాటిచ్చారు. అందుకు అనుగుణంగా ఆర్టీసీ ఉన్నతాధికారులు పంపిన మెరిట్ రేటింగ్ రిపోర్టు(ప్రభుత్వ శాఖల్లో ఏసీఆర్)లకు ఒకటి, రెండు సవరణల తర్వాత ఎట్టకేలకు డీపీసీ ఆమోదం లభించింది. ఆ వెంటనే ప్రమోషన్ల ఫైలుపై సీఎం కూడా సంతకం చేశారు. దీంతో డిపో మేనేజర్ నుంచి ఈడీ వరకూ 110 మంది అధికారులతో సహా 3వేల మందికి పదోన్నతులు వచ్చేసినట్లేనని ఈయూ, ఎన్ఎంయూ, ఎస్‌డబ్ల్యూఎఫ్ తదితర అసోసియేషన్లు హర్షం వ్యక్తం చేశాయి. వినాయక చవితితో పాటు పదోన్నతుల శుభాకాంక్షలు కూడా సిబ్బంది తెలియజేసుకున్నారు. ఆ తర్వాత దసరా వెళ్లిపోయి త్వరలో దీపావళి కూడా వస్తోంది. వరుసగా పండుగలు అయితే వస్తున్నాయి.. పోతున్నాయి.. కానీ పదోన్నతుల జాబితాతో కూడిన జీవో మాత్రం వెలువడటం లేదని ఆర్టీసీ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇన్‌చార్జిలే దిక్కు

ఆసియాలోనే గొప్ప పేరు తెచ్చుకున్న ఏపీఎస్ఆర్టీసీ పరిస్థితి అత్యంత దయనీయంగా తయారైంది. రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఎండీగా కొనసాగుతుంటే కీలకమైన ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ల పోస్టుల్లో అందరూ ఇన్‌చార్జిలే ఉన్నారు. విజయనగరం జోన్ ఈడీ కేఎస్‌బీ రెడ్డి మినహా ఇతర జోన్ల ఈడీలతో పాటు కీలకమైన అడ్మిన్, ఆపరేషన్స్, ఇంజనీరింగ్ విభాగాలకు ఇన్‌చార్జిలే దిక్కయ్యారు. రవాణా మంత్రి సొంత జిల్లా కడపతో పాటు నెల్లూరు, విజయవాడ ఈడీలదీ అదే పరిస్థితి. ఆర్టీసీ హెడ్ ఆఫీస్‌లో చీఫ్ పర్సన్ మేనేజర్లు, చీఫ్ ట్రాఫిక్ మేనేజర్, చీఫ్ ఇంజనీర్లు, సీసీవోఎస్ ఇలా అంతటా ఇన్‌చార్జిలతోనే నెట్టుకొస్తున్నారు. విజయవాడ మినహా రీజినల్ మేనేజర్లందరూ ఇన్‌చార్జిలే. రాష్ట్ర వ్యాప్తంగా 129 బస్ డిపోలు ఉంటే సుమారు 35చోట్ల డిపో మేనేజర్లుగా ఇన్‌చార్జిలు కొనసాగుతున్నారు. స్వయంగా రవాణా శాఖ మంత్రి సొంత నియోజకవర్గం రాయచోటి బస్ డిపో మేనేజర్ కూడా ఇన్‌చార్జే కావడం గమనార్హం. సంస్థను ఆర్థికంగా బలోపేతం చేయాలంటే తక్షణమే పదోన్నతులు కల్పించడంతో పాటు ఇన్‌చార్జిల స్థానంలో పూర్తి స్థాయి బాధ్యతలు అప్పగించి పనితీరుపై సమీక్షిస్తేనే ఫలితం ఉంటుందని ఆర్టీసీ హౌస్ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి.

బొత్సకు జగన్ నుంచే ప్రాణహాని

- బొత్స కోరితే భద్రత కల్పిస్తాం: పల్లా



అమరావతి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): సీనియర్ నేతగా బొత్స సత్యనారాయణ అంటే తమకు గౌరవం ఉందని, అలాంటి నేత తనకు ప్రాణహాని ఉందని చెబితే ఆలోచించాల్సిందేనని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ అన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బొత్స మాటలను బట్టి ఆయనకు జగన్ వల్లే ప్రాణహాని ఉందనిపిస్తోందని చెప్పారు. వైసీపీలో తనకన్నా ఎక్కువ పేరు సంపాదించుకున్న వాళ్లను జగన్ అంతం చేస్తాడని, వివేకా హత్యే దానికి నిదర్శనమన్నారు. ప్రతిపక్ష నేతగా బొత్స బాగా ఫోకస్ అవుతున్నారని, అదే ఆయన ప్రాణహానికి కారణం కావొచ్చన్నారు. బొత్సకు కావాలంటే ప్రభుత్వపరంగా భద్రత కల్పిస్తామని చెప్పారు. రాష్ట్రంలో ఉన్న మూడు ప్రాంతాలను కూటమి ప్రభుత్వం సమానంగా అభివృద్ధి చేస్తోందని పల్లా తెలిపారు. రాష్ట్రానికి పెట్టుబడిదారులు రాకుండా జగన్ కుట్రలు చేస్తున్నారని, మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేస్తున్నారంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. కల్తీ మద్యానికి ఆద్యుడు జగనేనని ఆరోపించారు.

డిజిటల్ శకంలోనూ బాలికలకు దీనస్థితే

- రక్షణకు ప్రత్యేక చట్టాలను తేవాలి.. సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ గవాయ్

న్యూఢిల్లీ, అక్టోబరు 11: డిజిటల్ శకంలోనూ బాలికలు దీన పరిస్థితి ఎదుర్కొంటున్నారని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ అన్నారు. ఆన్‌లైన్‌లో వేధించడం, సైబర్ బుల్లీయింగ్, డిజిటల్ వేట, వ్యక్తిగత డేటా దుర్వినియోగం, డీప్‌ఫేక్ ఫొటోలు తదితరాలతో బాలికలు ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. బాలికల రక్షణకు ప్రత్యేకమైన చట్టాలు తేవాలన్నారు. అలాగే చట్టాలు అమలు చేసేవారికి, నిర్ణయాధికారులకు శిక్షణ ఇవ్వాలన్నారు. బాలికల రక్షణపై యునిసెఫ్‌తో కలసి సుప్రీం కోర్టు జువైనల్ జస్టిస్ కమిటీ (జేజేసీ) ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో సీజేఐ జస్టిస్ గవాయ్ మాట్లాడుతూ, రాజ్యాంగం, చట్టాలు రక్షణ కల్పిస్తున్నా కూడా దేశంలో చాలా మంది బాలికలకు కనీసం ప్రాథమిక హక్కులు కూడా లభించడంలేదని అన్నారు.

మచాడో మాదిరే రాహుల్ పోరాటం


- ఎన్డీఏ నియంతృత్వంపై పోరాడుతున్నారు
- ఎక్స్‌లో కాంగ్రెస్ అధికార ప్రతినిధి పోస్ట్
- 99సార్లు ఓడిపోయినందుకు నోబెల్ ఇవ్వాలి: బీజేపీ ఎద్దేవా

న్యూఢిల్లీ, అక్టోబరు 11: నోబెల్ శాంతి పురస్కార గ్రహీత మరియా కొరినా మచాడో మాదిరే ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కూడా రాజ్యాంగ రక్షణ కోసం అలుపెరుగని పోరాటం చేస్తున్నారని కాంగ్రెస్ నేత చేసిన పోస్టు వైరల్‌గా మారింది. రాజ్యాంగ రక్షణ కోసం పోరాటం పేరుతో కాంగ్రెస్ అధికార ప్రతినిధి సురేంద్ర రాజ్‌పుట్ ఎక్స్‌లో ఒక పోస్టు చేశారు. "ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం పోరాడుతున్న వెనెజువెలా ప్రతిపక్ష నేత మచాడోకు నోబెల్ శాంతిపురస్కారం దక్కింది. ఆమె మాదిరే ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఇక్కడి ఎన్డీఏ ప్రభుత్వ నియంతృత్వానికి వ్యతిరేకంగా యుద్ధం చేస్తున్నారు" అని సురేంద్ర పేర్కొన్నారు. దీనిపై బీజేపీ స్పందించింది. 99 ఎన్నికల్లో ఓడిపోయినందుకు రాహుల్ గాంధీకి నోబెల్ ప్రైజ్ ఇవ్వాలని బీజేపీ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా వ్యాఖ్యానించారు.

పరీక్ష రాశాక ప్రశ్నపత్రం, జవాబులు చూసుకోవచ్చు

- ఎస్ఎస్‌సీ అభ్యర్థులకు నూతన అవకాశం
- మార్కులకు బదులుగా పర్సంటైల్ విధానం
- ఆధార్ ఆధారిత హాజరు విధానం
- అమలులోకి స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ కీలక సంస్కరణలు
- అభ్యర్థులకు అందుబాటులో ఉండేందుకు ఎక్స్‌లోకి ‘ఎస్ఎస్‌సీ’

న్యూఢిల్లీ, అక్టోబరు 11 : కేంద్ర ప్రభుత్వ శాఖలు, వివిధ విభాగాల్లో నాన్ గెజిటెడ్ పోస్టులను భర్తీ చేసే స్టాఫ్ సెలెక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ) తాను నిర్వహించే పరీక్షలకు సంబంధించి కీలక సంస్కరణలు చేసింది. పరీక్ష అనంతరం అభ్యర్థులు తమ ప్రశ్న, జవాబు పత్రాలు చూసుకునే అవకాశం కల్పించిన ఎస్ఎస్‌సీ... ఇకపై మార్కుల ఆధారంగా కాక పర్సంటైల్ విధానంలో మెరిట్ జాబితాను నిర్ణయించనుంది. ప్రశ్నపత్రం లీకేజీలు నిరోధానికి డిజిటల్ వాల్ట్‌ల వినియోగించనున్న ఎస్ఎస్‌సీ.. పరీక్ష కేంద్రాల్లో ఆధార్ గుర్తింపు ఆధారంగా అభ్యర్థుల హాజరు తీసుకోనుంది. పరీక్షల నిర్వహణ మరింత పకడ్బందీగా, అభ్యర్థుల ఎంపిక మరింత పారదర్శకంగా జరిగేలా ఈ సంస్కరణలను అమలులోకి తెచ్చామని ఎస్ఎస్‌సీ ప్రకటించింది. ప్రశ్నపత్రాన్ని బహిర్గతం చేయడం, అందరికీ అందుబాటులో ఉండేలా చేయడం తాము అమలులోకి తెచ్చిన సంస్కరణల్లో అత్యంత కీలకమైనదని ఎస్ఎస్‌సీ పేర్కొంది. ఇకపై, అభ్యర్థులు పరీక్ష రాసిన వెంటనే తమకు వచ్చిన ప్రశ్నపత్రం, దానికి తామిచ్చిన సమాధానాలతోపాటు కీని కూడా చూసుకోవచ్చునని, వాటిని డౌన్‌లోడ్ కూడా చేసుకోవచ్చని ఎస్ఎస్‌సీ అధికారులు పేర్కొన్నారు. వాటి ఆధారంగా అభ్యర్థులు ఏదైనా ప్రశ్నపై బోర్డును సవాలు చేయవచ్చని వివరించారు. అయితే, ఏదైనా పరీక్ష వేర్వేరు షిఫ్ట్‌ల్లో జరుగుతుంటే మాత్రం.. ఆ పరీక్షలన్నీ పూర్తయిన తర్వాతే ప్రశ్నపత్రాలు, సమాధానాలు కనిపిస్తాయని, ఆ తర్వాతే సవాలు చేసుకోవాల్సి ఉంటుందని వివరించారు. పరీక్ష జరుగుతున్న సమయంలో ప్రశ్నపత్రం బహిర్గతం కాకూడదనే ఈ నిబంధన అని తెలిపారు. ఓ ప్రశ్నను సవాలు చేసేందుకు గతంలో రూ.100గా ఉన్న రుసుమును కూడా ఎస్ఎస్‌సీ రూ.50కి తగ్గించింది. అంతేకాక, ఎంపిక చేసిన పలు పరీక్షల పాత ప్రశ్నపత్రాలను ఇక నుంచి అభ్యర్థులకు అందుబాటులో ఉంచుతామని ఎస్ఎస్‌సీ ప్రకటించింది. దీని ద్వారా పరీక్ష సిలబస్, మోడల్ ప్రశ్నపత్రం తదితర అంశాలపై అభ్యర్థులకు స్పష్టమైన అవగాహన ఏర్పడుతుందని తెలిపింది.



పర్సంటైల్ విధానం..

ఎస్ఎస్‌సీ అమలులోకి తెచ్చిన సంస్కరణల్లో భాగంగా ఇకపై అభ్యర్థుల ర్యాంకింగ్ లేదా మెరిట్ జాబితాను నిర్దేశిత పరీక్షలో వారు సాధించిన మార్కుల ఆధారంగా కాక పర్సంటైల్ విధానంలో నిర్ణయించనున్నారు. ఇక, ఒకరి బదులు మరొకరు పరీక్ష రాయడం, ఒక అభ్యర్థి ఒకే పరీక్షను పలుమార్లు రాయడం వంటి వాటిని నిరోధించేందుకు ఆధార్ అథెంటికేషన్ హాజరు విధానాన్ని కూడా అమలులోకి తెచ్చామని బోర్డు ప్రకటించింది. ప్రశ్నపత్రాల లీకేజీ సమస్యకు చెక్ పెట్టేందుకు ఇకపై డిజిటల్ వాల్ట్‌ల ద్వారా ప్రశ్నపత్రాలను ట్రాన్స్‌ఫర్ చేయనున్నామని పేర్కొంది. కాగా, అభ్యర్థుల సందేహాల నివృత్తి, ఫిర్యాదుల స్వీకరణకుప్రస్తుతం 18003093063 టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ నెంబర్ అందుబాటులో ఉండగా.. దీనికి అదనంగా ఆన్‌లైన్‌లో ఫిర్యాదుల స్వీకరణకు ప్రత్యేక పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చామని తెలిపింది. ఎస్ఎస్‌సీ ఇటీవల నిర్వహించిన సీజీఎల్ఈ-2025 పరీక్షల్లో సాంకేతిక సమస్యలతో కొన్ని పరీక్ష కేంద్రాల్లో అభ్యర్థులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అభ్యర్థుల నుంచి అందిన విజ్ఞప్తులకు స్పందించిన ఎస్ఎస్‌సీ.. సమస్య తలెత్తిన కేంద్రాల్లో పరీక్ష రాసిన వారికి అక్టోబరు 14న మళ్లీ పరీక్ష నిర్వహిస్తామని ప్రకటించింది. అభ్యర్థులకు ఎస్ఎంఎస్, ఈ మెయిల్ ద్వారా సమాచారం అందిస్తామని వెల్లడించింది. ఈ పరీక్ష రాసిన అభ్యర్థులు కొత్త విధానం ప్రకారం అక్టోబరు 15 నుంచి ప్రశ్నలను సవాలు చేయవచ్చు.



జనార్దన్‌రావుని కోర్టుకు తీసుకువెళ్తున్న పోలీసులు

సూత్రధారి జనార్దనే!

వైసీపీ జమానాలోనే నకిలీ మద్యం

- 2023లో విచ్చలవిడిగా లిక్కర్ తయారీ
- బెంగళూరు, ముంబై, ఢిల్లీల నుంచి స్పిరిట్
- హైదరాబాద్ నుంచి ఆర్టీసీ ద్వారా ఏపీకి సరఫరా
- ఫినాయిల్ సరఫరా చేస్తున్నట్టు ఇన్వాయిస్‌లు
- అద్దేపల్లి రిమాండ్ రిపోర్టులో కీలక విషయాలు
- రిమాండ్ విధించిన విజయవాడ కోర్టు

విజయవాడ, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సంచలనం సృష్టించిన నకిలీ మద్యం కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. కేసులో ప్రధాన నిందితుడు అద్దేపల్లి జనార్దన్‌రావే నకిలీ మద్యం తయారీ, విక్రయాలకు సూత్రధారి అని ఎక్సైజ్ పోలీసులు స్పష్టం చేశారు. అంతేకాదు.. వైసీపీ హయాం నుంచే నకిలీ మద్యం తయారీకి శ్రీకారం చుట్టినట్టు పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని నిజాంపేటలో ఒక గదిని అద్దెకు తీసుకుని అక్కడ నకిలీ మద్యం తయారు చేసి, దానికి ఫినాయిల్ కలరింగ్ ఇచ్చి.. సరఫరా చేసినట్టు తెలిపారు. ఇన్వాయిస్‌లు సైతం ఫినాయిల్ సరఫరా కోసమేనని తీసుకుని ఆర్టీసీ కార్గోలో ఇబ్రహీంపట్నంలో ఉన్న బార్‌కు పంపేవారు. నిజాంపేటలో ఏర్పాటు చేసిన నకిలీ మద్యం డిస్టలరీని తర్వాత అన్నమయ్య జిల్లాలోని మొలకలచెరువు, ఎన్టీఆర్ జిల్లాలోని ఇబ్రహీంపట్నానికి విస్తరించారు. జనార్దన్‌రావును ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు గన్నవరం విమానాశ్రయంలో అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. శనివారం సాయంత్రం విజయవాడలోని ఆరో అదనపు జిల్లా జడ్జి కోర్టు న్యాయాధికారి లెనిన్‌బాబు.. జనార్దన్‌రావుకు రిమాండ్ విధించారు. కాగా.. రిమాండ్ రిపోర్టులో కీలక విషయాలను పేర్కొన్నారు.

పని పంచుకున్నారు!

నకిలీ మద్యం వ్యవహారంలో ఒక్కొక్కరు ఒక్కొక్క పనిని పంచుకున్నారు. శ్రీనివాసరెడ్డి అనే వ్యక్తి ఖాళీ ప్లాస్టిక్ సీసాలను సరఫరా చేయగా వాటిపై అతికించే లేబుళ్లు, బ్రాండ్ స్టిక్కర్లను రవి సమకూర్చారు. నకిలీ మద్యాన్ని విజయవాడ పరిధిలోని విద్యాధరపురంలోని ఉన్న శ్రీనివాస వైన్స్‌లో మేనేజర్ కల్యాణ్ ద్వారా విక్రయించారు. బాట్లింగ్, లేబుల్ ఫిక్సింగ్, ప్యాకింగ్‌లను సయ్యద్ హాజీ, కట్టా రాజు, బాదల్‌దాస్, ప్రదీప్‌దాస్, మిధున్ దాస్, అంతా దాస్ చేసేవారు. జయచంద్రారెడ్డి ఆఫ్రికాలో ఉండడంతో జనార్దన్‌రావు గత నెల 25న ఆఫ్రికాలోని రువాండాకు వెళ్లారు. ఈ నకిలీ మద్యం తయారీలో ఇంకా అధునాతన పద్ధతులను పరిశీలించడానికి ఆఫ్రికా వెళ్లినట్టు ఎక్సైజ్ పోలీసులు రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు.

ఇంజనీరింగ్ చదివి..

జనార్దన్‌రావు నెల్లూరు జిల్లాలోని వాకాడు కాలేజీలో ఇంజనీరింగ్‌ను పూర్తిచేశారు. తర్వాత కిరాణా వ్యాపారం చేసి, 2012లో మద్యం వ్యాపారంలోకి దిగారు. ఇబ్రహీంపట్నంలో ఏఎన్నార్ బార్ అండ్ రెస్టారెంట్‌ను ఏర్పాటు చేసి, భారీ లాభాలను చవి చూశారు. అయితే, జాతీయ రహదారులకు పక్కన మద్యం షాపులు ఉండరాదని సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలతో బార్‌ను మరోచోటకు మార్చుకోవాల్సి వచ్చింది. దీంతో వ్యాపారం దెబ్బతింది. ఈ నేపథ్యంలో నకిలీ మద్యాన్ని విక్రయించడం మొదలు పెట్టారు. హైదరాబాద్‌లోని నిజాంపేటలో ఒక గదిని అద్దెకు తీసుకుని, సమీపంలో ఉన్న మద్యం దుకాణం నుంచి హెచ్‌డీ విస్కీ కేసులను కొనుగోలు చేశారు. వాటి ద్వారా నకిలీ మద్యం తయారు చేసేవారు. వాటిని కేసులుగా పార్శిల్ చేసి అందులో ఫినాయిల్ ఉన్నట్టుగా అట్టపెట్టెలపై లేబుల్స్ అతికించి వాటిని ఆర్టీసీ కొరియర్ ద్వారా ఇబ్రహీంపట్నం పంపారు. బార్‌లో పనిచేసే ఉద్యోగి హాజీ ఆ పార్శిళ్లను తీసుకుని, వాటిని బార్‌లో అమ్మేవారు. 2022లో తుంగల సుధాకర్, చింతమనేని కృష్ణమోహన్, మహంకాళి పూర్ణచంద్రరావు, బొర్రా కిరణ్‌తో పాటు జనార్దన్‌రావు సోదరి సుబా భారతి, షరీఫ్ అనే వారిని వ్యాపార భాగస్వాములుగా చేసుకుని హైదరాబాద్‌లో ఈ-7 పేరుతో బార్‌ను నిర్వహించారు. అక్కడి నుంచి 35 లీటర్ల క్యానుల్లో చీప్ లిక్కర్‌ను సరఫరా చేసి విక్రయించేవారు. 2023లో జనార్దన్‌రావు గోవా వెళ్లారు. అక్కడ ఈ కేసులో నిందితుడిగా ఉన్న బాలాజీని కలిసి, మరిన్ని వ్యాపార అవకాశాల కోసం చర్చించారు. ఈ క్రమంలో 'నకిలీ ఫార్ములా'ను ఉపయోగించి లిక్కర్ తయారీ చేయాలని నిర్ణయించుకున్నారు. స్పిరిట్, చక్కెర, ఇతరత్రా ముడిపదార్థాలతో 2023, ఏప్రిల్‌లో ఏఎన్నార్ బార్ ఏర్పాటుచేసి, తొలగించిన ప్రదేశంలో నకిలీ మద్యం తయారీ మొదలుపెట్టారు. బెంగుళూరు, ముంబై, ఢిల్లీ ప్రాంతాల నుంచి స్పిరిట్, ఇతర ముడిపదార్థాలను బాలాజీ కొనుగోలు చేసి ఇబ్రహీంపట్నం పంపేవారు. తయారైన నకిలీ మద్యాన్ని జనార్దన్‌రావు సోదరుడు జగన్ మోహనరావు, మరికొందరు ఉద్యోగులు సీసాల్లో నింపి, వాటిపై కేరళ మార్ట్ విస్కీ, మంజీరా విస్కీ, ఓల్డ్ అడ్మిరల్ బ్రాందీ, క్లాసిక్ బ్లూ విస్కీ వంటి లేబుళ్లు అంటించేవారు. దీనికిగాను బాలాజీకి అడ్వాన్స్‌గా రూ.20 లక్షలను జనార్దన్‌రావు చెల్లించారు. లీటర్ బాటిల్‌కు రూ.350-450 బాలాజీ వసూలు చేసేవారు. వాటిని జనార్దన్‌రావు 180 ఎంఎల్ సీసాల్లోకి మార్చి ఒక్కోదానిపై రూ.30 నుంచి 40 లాభాన్ని ఆర్జించారు. 2024 ఎన్నికల సమయంలో నిఘా పెరగడంతో బాలాజీ స్పిరిట్‌ను సరఫరా చేయలేకపోయారు. దీంతో జనార్దన్‌రావు నకిలీ మద్యం తయారీ కార్యకలాపాలను తాత్కాలికంగా నిలుపుదల చేశారు. గత ఏడాది ఎన్నికల అనంతరం.. ఇంజనీరింగ్‌లో స్నేహితుడైన టీడీపీ తంబళ్లపల్లె నియోజకవర్గ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డితో పాటు మరికొంతమంది స్నేహితులను కలిశారు. ప్రభుత్వం ప్రకటించిన మద్యం విధానంలో జయచంద్రారెడ్డి అనుచరుడు సురేంద్రనాయుడు, అతని పీఏ రాజేశ్ మద్యం షాపులను దక్కించుకున్నారు. వాటి ద్వారా నకిలీ మద్యం విక్రయించారు. ఇంతకుముందు మాదిరిగానే బాలాజీ ముడిసరుకును సరఫరా చేశారు.

రైతన్నకు ధనధాన్యం

- రూ.35,440 కోట్లతో కేంద్రం 2 పథకాలు
- ప్రారంభించిన ప్రధాని నరేంద్ర మోదీ
- 11,440 కోట్లతో పప్పుధాన్యాల్లో ఆత్మనిర్భరత మిషన్
- 100 జిల్లాల్లో పప్పు ధాన్యాల మెరుగైన వృద్ధే లక్ష్యం
- వచ్చే రబీ సీజన్ నుంచి 2030-31 వరకు అమలు
- అప్పటికి 350 లక్షల టన్నుల పప్పుధాన్యాల ఉత్పత్తి లక్ష్యం
- 24 వేల కోట్లతో ప్రధానమంత్రి ధన ధాన్య కృషి యోజన
- గోధుమ, వరిపైనే కాక పప్పులపైనా రైతులు దృష్టి పెట్టాలి
- సాగును కాంగ్రెస్ ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేశాయి: ప్రధాని



ఢిల్లీలోని పూసా క్యాంపస్‌లో రైతులు, శాస్త్రవేత్తలతో ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, అక్టోబరు 11: దేశంలో పప్పుధాన్యాల ఉత్పత్తిని పెంచడానికి, వ్యవసాయ రంగంలో వెనుకబడిన వంద జిల్లాల్లో వృద్ధిని మెరుగుపరచడమే లక్ష్యంగా రూ.35,440 కోట్లతో రెండు భారీ వ్యవసాయ పథకాలను ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. శనివారం భారత వ్యవసాయ పరిశోధనా సంస్థ (ఐఏఆర్ఐ) పూసా క్యాంపస్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమం ఇందుకు వేదికైంది. 'ప్రధాన మంత్రి ధన్ ధాన్య కృషి యోజన' (పీఎం-డీడీకేవై)ను రూ.24వేల కోట్లతో, పప్పు ధాన్యాల్లో ఆత్మనిర్భరత మిషన్‌ను రూ.11,440 కోట్లతో ప్రధాని ప్రారంభించారు. అలాగే వ్యవసాయం, పశుసంవర్థక, చేపల పెంపకం, ఆహార ప్రాసెసింగ్ రంగాలకు సంబంధించిన రూ.5,450 కోట్ల ప్రాజెక్టులను కూడా ప్రధాని ప్రారంభించారు. దాదాపు రూ.815 కోట్ల విలువైన అదనపు ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అరగంట పాటు మోదీ ప్రసంగించారు. దేశం దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడంతోపాటు ఎగుమతులను పెంచేందుకు రైతులు కృషి చేయాలని ఆయన కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వాలపై ఆయన విరుచుకుపడ్డారు. వ్యవసాయం, అనుబంధ రంగాల వృద్ధికి సంబంధించి కాంగ్రెస్ ప్రభుత్వాలకు ఎలాంటి విజన్, వ్యూహం లేదని, ఫలితంగా వ్యవసాయ పర్యావరణ వ్యవస్థ (ఏకోసిస్టమ్) బలహీనపడిందన్నారు. కొత్తగా ప్రారంభించిన పథకాల గురించి మాట్లాడుతూ.. పీఎం-డీడీకేవై, పప్పుధాన్యాల మిషన్‌లో కేంద్ర ప్రభుత్వం రూ.35వేల కోట్లకు పైగా పెట్టుబడి పెడుతుందని, ఇది కోట్లాది మంది రైతుల తలరాతను మార్చుతుందన్నారు. ఈ రెండు పథకాలకు ఇప్పటికే కేంద్ర క్యాబినెట్ ఆమోదం లభించింది. ఈ పథకాలను వచ్చే రబీ (శీతాకాలం) సీజన్ నుంచి 2030-31 వరకు అమలు చేస్తారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్ (వికసిత్ భారత్) లక్ష్యాన్ని సాకారం చేయడంలో రైతులు కీలక పాత్ర పోషించాలని మోదీ పేర్కొన్నారు. స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత ఆహార ధాన్యాల్లో భారత్ స్వయం సమృద్ధి సాధించేలా రైతులు కృషి చేశారని, ఇప్పుడు దేశాన్ని వికసిత్ భారత్‌గా మార్చడంతో రైతుల పాత్ర కీలకంగా ఉందన్నారు. ఒకవైపు ఆహారంలో స్వయం సమృద్ధి సాధించాలని, మరోవైపు అంతర్జాతీయ మార్కెట్ కోసం ఉత్పత్తి చేయాలని పేర్కొన్నారు. ప్రపంచమార్కెట్లో డిమాండ్ ఉన్న పంటల ఉత్పత్తిపై రైతులు దృష్టి పెట్టాలని కోరారు. మన దిగుమతులను తగ్గించుకోవాలని, ఎగుమతులను పెంచడంలో వెనుకబడవద్దన్నారు. ఈ లక్ష్యాలను సాధించడంలో ఈ రెండు కొత్త పథకాలు ప్రధాన పాత్ర పోషిస్తాయని చెప్పారు. గోధుమ, వరిపైనే కాకుండా పప్పుధాన్యాలపై దృష్టిసారించాలన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద పప్పుధాన్యాల ఉత్పత్తిదారు, వినియోగదారుగా ఉన్నప్పటికీ భారత్ ఇప్పటికీ దిగుమతులపై ఆధారపడుతోందని ప్రధాని గుర్తు చేశారు. పప్పుధాన్యాల మిషన్‌లో భాగంగా వీటి ఉత్పత్తిని పెంచి స్వయం సమృద్ధిని సాధించడానికి 2030 నాటికి పప్పుధాన్యాల సాగు విస్తీర్ణాన్ని 35 లక్షల హెక్టార్లు పెంచడం లక్ష్యమని తెలిపారు. ప్రస్తుతం 252.38 లక్షల టన్నులుగా ఉన్న పప్పు ధాన్యాల దిగుబడిని 2030-31 నాటికి 350 లక్షల టన్నులకు పెంచడం మిషన్ లక్ష్యమన్నారు. ఆశావహ జిల్లాల కార్యక్రమాన్ని అనుసరించి రూపొందించిన పీఎం-డీడీకేవై.. వ్యవసాయ రంగంలో వెనుకబడిన 100 జిల్లాలను లక్ష్యంగా చేసుకుంటుందని, వివిధ మంత్రిత్వ శాఖల్లోని 36 పథకాలను సమ్మిళితం చేసి అమలు చేయనున్నట్టు తెలిపారు. ఈ పథకం ఉత్పాదకతను పెంచడంతోపాటు పంట వైవిధ్యాన్ని ప్రోత్సహించడం, నీటిపారుదల, నిల్వ సౌకర్యాలను మెరుగుపరచడం, రుణ సదుపాయాలపై దృష్టిసారిస్తుందని చెప్పారు.

వ్యవసాయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేశాయి..

గత కాంగ్రెస్ ప్రభుత్వాలు వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేశాయని ప్రధాని మండిపడ్డారు. ఎంతో కీలకమైన ఈ రంగం వృద్ధికి ప్రతిపక్ష పార్టీకి ఎలాంటి విజన్, వ్యూహం లేదన్నారు. వ్యవసాయ రంగానికి ప్రభుత్వ మద్దతు చాలా ముఖ్యమన్నారు. ఈ రంగానికి సంబంధించి వివిధ ప్రభుత్వ విభాగాలు స్వతంత్రంగా పని చేయడం వల్ల దేశ వ్యవసాయ వ్యవస్థ బలహీనపడుతోందన్నారు. అయితే అధిక వృద్ధిని సాధించడానికి వ్యవసాయ వ్యవస్థలో సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరం ఏర్పడిందని మోదీ పేర్కొన్నారు. తమ ప్రభుత్వం 2014లో అధికారం చేపట్టినప్పటి నుంచి ఈ ప్రక్రియ ప్రారంభమైందని చెప్పారు. వ్యవసాయం పట్ల గత ప్రభుత్వాలు అనుసరించిన నిర్లక్ష్య విధానాన్ని తాను మార్చానని, విత్తనాల నుంచి మార్కెట్ వరకు వ్యవసాయ రంగంలో అనేక సంస్కరణలు తెచ్చినట్టు తెలిపారు. వ్యవసాయ రంగంలో పెట్టుబడులను పెంచేందుకు కేంద్రం ప్రయత్నాలు చేసిందన్నారు. గత 11 ఏళ్లలో ప్రభుత్వం వ్యవసాయ బడ్జెట్‌ను ఆరు రెట్లు పెంచిందని గుర్తు చేశారు. గత పదేళ్లలో ఎన్‌డీఏ ప్రభుత్వం ఫెర్టిలైజర్‌పై రూ.13 లక్షల కోట్ల సబ్సిడీ ఇచ్చిందని, ఇందులో రూ.3.75 లక్షల కోట్లు పీఎం-కిసాన్ పథకం కింద రైతులకు అందించినట్టు చెప్పారు. కానీ పదేళ్ల యూపీఏ హయాంలో రూ.5 లక్షల కోట్ల సబ్సిడీ మాత్రమే ఇచ్చిందన్నారు. ఇటీవలే వ్యవసాయ యంత్రాలు, విడిభాగాలపై జీఎస్టీ రేట్లను తగ్గించామని, దీంతో రైతులకు రెండింతల ఆదాకు అవకాశం ఏర్పడిందని చెప్పారు. గత 11 ఏళ్లలో దేశ వ్యవసాయ ఎగుమతులు దాదాపు రెండింతలయ్యాయని, ఆహార ధాన్యాల ఉత్పత్తి దాదాపు 9 కోట్ల టన్నులు, పండ్లు, కూరగాయల ఉత్పత్తి 6.4 కోట్ల టన్నులకు పైగా పెరిగిందన్నారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద రూ.2 లక్షల కోట్లకు పైగా బీమా క్లెయిమ్‌లను రైతులకు పంపిణీ చేసినట్టు తెలిపారు. రైతు సహకారం, మార్కెట్ యాక్సెస్‌ను పెంచడానికి గత 11 ఏళ్లలో 10వేలకు పైగా రైతు ఉత్పత్తిదారుల సంస్థలు (ఎఫ్‌పీవో) ఏర్పాటయ్యాయన్నారు.

మోదీని ట్రంప్ అత్యంత సన్నిహితుడిగా భావిస్తారు

- అమెరికా రాయబారి సెర్గియో గోర్ వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, అక్టోబరు 11: భారత్‌తో బంధాన్ని అమెరికా ఎంతో విలువైనదిగా భావిస్తుందని, ప్రధాని మోదీని అధ్యక్షుడు ట్రంప్ అత్యంత సన్నిహితుడిగా భావిస్తారని ఆ దేశ రాయబారి సెర్గియో గోర్ చెప్పారు. భారత్‌లో ఆరు రోజుల పర్యటనలో భాగంగా ఆయన ప్రధాని మోదీని కలుసుకున్నారు. ఈ సందర్భంగా ట్రంప్-మోదీ ఉన్న చిత్రపటాన్ని ఆయన ప్రధానికి బహూకరించారు. రక్షణ, వాణిజ్యం, అరుదైన ఖనిజాల గురించి మోదీతో చర్చించినట్లు తెలిపారు. విదేశాంగ మంత్రి జైశంకర్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డొభాల్, విదేశాంగ కార్యదర్శి మిస్రీతోనూ తాను సమావేశమైనట్లు గోర్ తెలిపారు. గోర్‌తో సమావేశం తర్వాత ప్రధాని మోదీ ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. గోర్ హయాంలో భారత్-అమెరికా మధ్య వ్యూహాత్మక సంబంధాలు మరింత బలోపేతమవుతాయని విశ్వాసం వ్యక్తం చేశారు. ట్రంప్ సుంకాలతో భారత్-అమెరికా మధ్య సంబంధాల్లో ఘర్షణ నెలకొన్న తరుణంలో గోర్ పర్యటనకు ప్రాధాన్యం ఏర్పడింది.

భద్రతా ప్రమాణాలు పాటించాల్సిందే!

- బాణసంచా తయారీ, నిల్వ, విక్రయాల సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలి
- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు: ఫైర్ డీజీ వెంకటరమణ హెచ్చరిక



అమరావతి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): బాణసంచా తయారీ, నిల్వ, విక్రయాల్లో భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని ఏపీ విపత్తుల స్పందన, అగ్నిమాపక సేవల డీజీ వెంకటరమణ స్పష్టం చేశారు. ఇటీవల ఓ బాణసంచా తయారీ ఫ్యాక్టరీలో ఘోర ప్రమాదం జరిగిన నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల అగ్నిమాపక శాఖ అధికారులతో ఆయన సమీక్ష చేపట్టారు. ఎక్కడెక్కడ బాణసంచా పరిశ్రమలు ఉన్నాయి? వాటిల్లో జిల్లా కలెక్టర్ నుంచి అనుమతి పొందినవి ఎన్ని? పొందని వాటిపై తీసుకున్న చర్యలు.. నిల్వ కేంద్రాల్లో, తరలింపు, విక్రయాల సమయంలో తీసుకొంటున్న జాగ్రత్తలపై ఆరా తీశారు. బాణసంచా తయారీ, నిల్వ, విక్రయాల్లో నిబంధనల విషయంలో ఎక్కడా రాజీ పడొద్దని, ఇటీవల జరిగిన ప్రమాదం నేపథ్యంలో ప్రభుత్వం సీరియ్‌గా ఉందని అధికారులను హెచ్చరించారు. ప్రతి లైసెన్సీదారు పేలుడు పదార్థాల నియమావళి-2008 ప్రకారం కచ్చితమైన భద్రతా చర్యలు పాటించాల్సిందేనని స్పష్టం చేశారు. బాణసంచా తయారీ కేంద్రాలు జనావాసాలకు కనీసం 45 మీటర్ల దూరంలో ఉండాలని, సిగరెట్లు, అగ్గిపెట్టెలు, లైటర్లు, మొబైల్ ఫోన్లు వంటివి అక్కడ నిషేధించాలని.. ఉదయం 7.30 గంటల నుంచి సాయంత్రం 5.30 మధ్యలోనే ఉత్పత్తి జరగాలన్నారు. ప్రమాదకర రసాయన మిశ్రమాలు ఆటోమేటెడ్ విధానంలో జరిగేలా చూడాలని, ప్రతి కార్మికుడు వ్యక్తిగత రక్షణ పరికరాలు వాడాల్సిందేనని, మైనర్లు, మద్యం సేవించిన వ్యక్తులను ఫ్యాక్టరీలోకి అనుమతించొద్దని, ఆరోగ్య, జీవిత ఉన్న కార్మికుల్ని తప్ప ఇతరుల్ని అనుమతించే ప్రసక్తే లేదని అగ్నిమాపక శాఖ డీజీ స్పష్టం చేశారు.

డీఏపై కుట్రలు

(మొదటి పేజీ తరువాయి)

రెచ్చగొట్టి.. చిచ్చు పెట్టే ప్రయత్నాలు చేస్తున్నారు. మరోవైపు.. ఉద్యోగులకు న్యాయం చేస్తామని సీఎం చంద్రబాబు చెబుతూనే ఉన్నారు. అయినా వైసీపీ బ్యాచ్ తన కుట్ర రాజకీయాలను కొనసాగిస్తూనే ఉంది.

చేసింది.. చెప్పుకోనుంటే..

గత వైసీపీ ప్రభుత్వం ఉద్యోగులకు పెట్టిన రూ.వేల కోట్ల బకాయిలను చెల్లించినా.. చేసింది చెప్పుకోవడంలో కూటమి ప్రజా ప్రతినిధులు విఫలమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఉద్యోగులను డీఏల పేరుతో జగన్ బ్యాచ్ రెచ్చగొడుతుంటే.. కనీసం కింది స్థాయిలో ఉద్యోగులకైనా రాష్ట్ర పరిస్థితిని వివరిస్తూ చెల్లించిన బకాయిలను చెపాల్సిన నేతలు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు. గత జగన్ ప్రభుత్వం చేయనివాటిని సైతం చేసినట్టు ఊదరగొడితే.. ప్రస్తుత నేతలు చేసినవి కూడా చెప్పుకోవడం లేదు. కూటమి ప్రభుత్వం ఉద్యోగ పక్షపాతి అని సీఎం చంద్రబాబు చెబుతున్నా.. ఆ భరోసాను కింది స్థాయి వరకు తీసుకెళ్లేలా అధికార పార్టీల నేతలు చేయకపోవడం గమనార్హం. దీంతో వైసీపీ విష ప్రచారంతో ఉద్యోగులు ప్రస్తుత ప్రభుత్వంపై ఆగ్రహం వెళ్లగక్కుతున్నారు.

ఉద్యోగుల పొట్టగొట్టిన వైసీపీ

గత వైసీపీ ప్రభుత్వం రూ.25 వేల కోట్లను ఉద్యోగులకు చెల్లించకుండా బకాయిలు పెట్టిపోయింది. కనీసం ఉద్యోగులకు, పెన్షనర్లకు జీతాలు, పెన్షన్లు సకాలంలో చెల్లించలేదు. డీఏలను సకాలంలో చెల్లించకుండా కొన్ని డీఏలను పీఆర్సీలో కలిపేసింది. అంతేకాదు, గత ఎన్నికలకు ముందు హడావుడిగా పోస్ట్ డేటెడ్ చెక్కుల మాదిరిగా 2 జీవోలను విడుదల చేసింది. 1-1-2023కు సంబంధించిన డీఏను 2024, మే నెల జీతంలో ఇచ్చేలా, ఇంకో జీవో 1-7-2023 జూలైలో చెల్లించాల్సిన డీఏను ఆగస్టు, 2024 నుంచి చెల్లించేలా జీవోలు జారీ చేసి, అమలు చేయకుండా చేతులు దులుపుకొంది. అయితే.. ఈ జీవోలను కూటమి ప్రభుత్వం అమలు చేసింది. అంటే కూటమి ప్రభుత్వమే ఆ రెండు డీఏలను ఉద్యోగులకు చెల్లించింది. దీని వల్ల 300 కోట్లభారం పడింది. సీపీఎస్ ఉద్యోగులకు 7 నెలల మ్యాచింగ్ గ్రాంట్ రూ.1,600 కోట్లను జగన్ ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టింది. వీటితోపాటు ఉద్యోగులకు రూ.వేల కోట్లు బకాయి పెట్టి, రివర్స్ పీఆర్సీ ఇచ్చింది. ఎవరైనా నోరెత్తితే వారిపై కేసులు పెట్టి భయభ్రాంతులకు గురి చేసింది. జీతాలు, పెన్షన్లు ఎప్పుడు వస్తాయో కూడా తెలియని దుస్థితిలోకి ఉద్యోగులను నెట్టింది.

ఇలా ఇచ్చారు!

- కూటమి ప్రభుత్వం రాగానే ఉద్యోగుల సమస్యలపై దృష్టి సారించింది.
- ఉద్యోగులు, పెన్షనర్లకు ప్రతి నెలా 1, లేదా 2 తేదీల్లోనే జీతాలు, పెన్షన్లు ఇస్తోంది.
- గత ప్రభుత్వం బకాయి పెట్టిన సుమారు రూ.7,500 కోట్లను చెల్లించింది.
- ఈ ఏడాది జనవరి 11న ఉద్యోగులకు వివిధ బకాయిల కింద రూ.1,033 కోట్లను జమ చేసింది.
- సీపీఎస్, జీపీఎఫ్, ఏపీజీఎల్ఐ తదితర చెల్లింపులకు మరో రూ.6,200 కోట్లు వెచ్చించింది.
- ఇటీవల సచివాలయ సీపీఎస్ ఉద్యోగుల బకాయిలను కూడా ఇచ్చేసింది.

రెండు డీఏలు, ఒక పీఆర్సీ!

ఉద్యోగులు 2 డీఏలు, ఒక పీఆర్సీ కోసం వేచి చూస్తున్నారన్నది వాస్తవం. అలాగని వారేమీ రెచ్చిపోవడం లేదు. గత జగన్ పాలనతో విధ్వంసమైన ఆర్థిక వ్యవస్థను సీఎం చంద్రబాబు గాడిలో పెడుతున్నారని, త్వరలోనే తమ ఆశలు నెరవేరుతాయని వేచి చూస్తున్నారు. కానీ.. వారి ఆశలను తమ రాజకీయ అస్త్రంగా మలుచుకున్న వైసీపీ నేతలు తెరవెనుక ఉండి.. ఉద్యోగ సంఘాలతో సర్కారుపై తప్పుడు ప్రచారం చేయిస్తున్నారు. వాస్తవానికి గత ప్రభుత్వం ఇచ్చిన రివర్స్ పీఆర్సీ, డీఏలు పీఆర్సీలో కలిపేయడం, కొన్ని డీఏలకు జీవోలు ఇచ్చి నగదు చెల్లించకుండా పోవడం వంటి చర్యలపై ఉద్యోగుల్లో ఆవేదన, ఆగ్రహం ఇప్పటికీ ఉంది. అందుకే, వైసీపీ నేతలు నేరుగా జోక్యం చేసుకోకుండా తమ అనుకూల సంఘాల నేతలతో రెచ్చగొట్టే రాజకీయాలకు తెరదీస్తున్నారు.

ప్రజలు ఛీ కొట్టినా పేర్నికి బుద్ధి రాలేదు

- మేము కన్నుకొడితే మా వాళ్లను తట్టుకోగలవా?
- శవ రాజకీయాలు జగన్‌రెడ్డికి అలవాటైపోయాయి
- కల్తీ మద్యం కేసులో ఎవరినీ వదలం: మంత్రి కొల్లు



విజయవాడ, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): 'ప్రజలు ఛీ కొట్టినా పేర్ని నానికి బుద్ధి రాలేదు. పోలీసులపైనే తిరుగుబాటు చేయడం దుర్మార్గం' అని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. విజయవాడలోని ఆర్ అండ్ బీ అతిథి గృహంలో శనివారం మీడియా సమావేశం నిర్వహించారు. 'కులాలు, మతాల మధ్య చిచ్చు పెట్టాలనే లక్ష్యంతోనే పేర్ని నాని వ్యవహరిస్తున్నాడు. చట్టాన్ని గౌరవించాల్సిన ప్రజాప్రతినిధులు పోలీసులపై దాడి చేయాలనుకోవడం సిగ్గుచేటు. ఇష్టానుసారం మాట్లాడితే వదిలిపెట్టేది లేదు. కనుసైగ చేస్తే లేపేయాలని అంటున్న పేర్నీ... మేము కన్న కొడితే మా వాళ్లను నువ్వు తట్టుకోగలవా? మాది ధర్మబద్ధంగా నడుచుకునే పార్టీ కాబట్టే సంయమనం పాటిస్తున్నాం. రాష్ట్రంలో కల్తీ మద్యం గురించి వైసీపీ నేతలు మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్టుగా ఉంది. అన్నమయ్య జిల్లా మొకలకలచెరువులో కల్తీ మద్యం దొరకడం వాస్తవం. ఆ కేసును క్షుణ్ణంగా విచారిస్తున్నాం. 23 మంది నిందితులను గుర్తించాం. 14 మందిని ఇప్పటికే అరెస్టు చేశాం. ప్రధాన సూత్రధారి జనార్దనరావును కూడా గన్నవరం విమానాశ్రయంలో అరెస్టు చేశాం. భవానీపురంలో మరో కేసులో 12 మంది నిందితులను గుర్తించి ఇప్పటికే ఐదుగురిని పోలీసులు అరెస్టు చేశారు. నలుగురుకి పీటీ వారెంట్ ఇచ్చాం. జయచంద్రారెడ్డి పాత్ర ఉందని తేలడంతో అతన్ని పార్టీ నుంచి సస్పెండ్ చేయడంతో పాటు అతని కోసం గాలిస్తున్నాం. తెనాలికి చెందిన వైసీపీ బూత్ కన్వీనర్ ఇదే స్కాంలో ఉంటే ఆ పార్టీ నుంచి ఎందుకు సస్పెండ్ చేయలేదో జగన్‌రెడ్డి చెప్పాలి. కాకాణి గోవర్ధన్ రెడ్డి, మల్లాది విష్ణు లాంటి వారు కల్తీ మద్యంతో ఎంతోమంది ప్రాణాలు తీశారు. వారిని సస్పెండ్ చేయకపోగా పదవులివ్వడమే జగన్ నైతికత. కల్తీ మద్యాన్ని ఎవరైనా గుర్తించే విధంగా ఏపీటీఏటీఎస్ యాప్ రూపొందించాం. బాటిల్‌పై ఉన్న క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేస్తే బాటిల్‌కు చెందిన సమాచారం తెలుసుకోవచ్చు' అని మంత్రి కొల్లు పేర్కొన్నారు.

కల్తీ చేస్తే ఎవరినీ వదిలేది లేదు...

'గత ఐదేళ్ల ట్రాక్ అండ్ ట్రేస్ విధానాన్ని జగన్‌రెడ్డి నాశనం చేశాడు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఎక్సైజ్ వ్యవస్థ మొత్తాన్ని ప్రక్షాళన చేసింది. అత్యంత పారదర్శకంగా మద్యం విధానాన్ని అమలుచేసి ప్రజల కోసం పనిచేస్తుంటే.. జగన్ ప్రభుత్వంపై బురద జల్లడమే పనిగా పెట్టుకున్నాడు. రాష్ట్రంలోని మద్యం వ్యాపారం మొత్తాన్ని సిండికేట్ చేసిన జగన్‌రెడ్డి మద్యం గురించి మాట్లాడడం హాస్యాస్పదం. కల్తీ మద్యంతో ప్రజల ప్రాణాలు హరించి, జైలుకు వెళ్లి వచ్చినోళ్లు ఇప్పుడు ఏదో జరిగిపోయిందని రాద్ధాంతం చేస్తున్నారు. ప్రతి నాలుగు బాటిళ్లలో ఒకటి కల్తీ అని చెప్పి జగన్‌రెడ్డి ఆరోపణలు చేయడం కాదు నిరూపించాలి. సాధారణ మరణాలను సైతం మద్యానికి లింక్ చేస్తున్నారు. చనిపోయిన ప్రతి కేసులోను ఎఫ్ఐఆర్ నమోదు చేసి పోస్టుమార్టం చేస్తున్నాం. శవ రాజకీయాలు జగన్‌రెడ్డికి అలవాటుగా మారిపోయాయి. ఆయన అరాచకాలు చూసే ప్రజలు 11 సీట్లకు పరిమితం చేశారు. తప్పుడు ప్రచారాలు చేస్తే ఎవరినీ ఉపేక్షించం. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రతి షాపులోను త్వరలోనే మూకుమ్మడి సోదాలు నిర్వహిస్తాం. అక్రమాలు బయటపడితే షాపు లైసెన్సుని పూర్తిగా రద్దు చేస్తాం' అని మంత్రి కొల్లు ప్రకటించారు.

పేర్ని నానిపై కేసు నమోదు చేసిన పోలీసులు

మచిలీపట్నం క్రైమ్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి పేర్ని నానిపై చిలకలపూడి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయింది. శుక్రవారం మచిలీపట్నం పోలీస్ స్టేషన్‌లో సిఐ ఏసుబాబుపై దౌర్జన్య చేసి విధులకు ఆటంకం కలిగించినందుకు అయనపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. క్రైమ్ నంబరు 186/2025 కింద కేసు నమోదు చేసి 132, 351(2), రెడ్‌విత్ 3(5), బీఎన్ఎస్ సెక్షన్లను జత చేశారు. పేర్ని వెంకట్రామయ్య (నాని)తో పాటు మరో 29 మందిపై కేసు నమోదు చేసినట్లు చిలకలపూడి పోలీసులు వివరించారు. ఘటనపై వెంటనే స్పందించిన ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఇటువంటి ఘటనలను సహించబోమని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలోనే కేసు నమోదైనట్లు తెలుస్తోంది.

ఆ నిర్ణయం ఖరీదు 300 కోట్లు!

(మొదటి పేజీ తరువాయి)

కాంట్రాక్టర్లకు లబ్ధి చేకూర్చేందుకే అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారనే విమర్శలు వస్తున్నాయి.

ఇదీ అధికారుల నిర్వాకం...

ట్రాన్స్‌కో ఆధ్వర్యంలో ఏటా పలు నిర్మాణ పనులు జరుగుతుంటాయి. ఎల్‌టీ, హెచ్‌టీ, ఈహెచ్‌టీ లైన్ల ఏర్పాటు, టవర్ల నిర్మాణం, ఎర్త్ ఫ్లాట్స్ , సబ్ స్టేషన్ల నిర్మాణం వంటి పనులకు ఏటా టెండర్లు పిలుస్తుంటారు. నిర్దేశిత పనికి ఎంత మొత్తం ఖర్చవుతుందో లెక్కలు వేసి టెండరు మొత్తాన్ని అధికారులు నిర్ణయిస్తారు. టెండరులో పేర్కొన్న నిర్ణీత మొత్తానికి కాస్త ఎక్సెస్‌కు కానీ లెస్‌కు కానీ కాంట్రాక్టర్లు టెండర్లు వేస్తుంటారు. ఒకసారి టెండరు పాడుకున్న తర్వాత అందులో పేర్కొన్న మొత్తాన్ని మాత్రమే కాంట్రాక్టర్లకు చెల్లించాల్సి ఉంటుంది. కానీ కాంట్రాక్టర్లకు అదనపు లబ్ధి చేకూర్చేందుకు 2013లో ఉమ్మడి ఏపీలో ట్రాన్స్‌కో అధికారులు కాంట్రాక్టర్స్ ఓవర్‌హెడ్స్ అండ్ ప్రాఫిట్స్ (సీవోపీ) అనే కొత్త విధానాన్ని తెరపైకి తెస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఈ ఉత్తర్వుల మేరకు కాంట్రాక్టరు ఒప్పందం చేసుకున్న మొత్తానికి అదనంగా సుమారు 14 శాతం వరకు చెల్లించే వెసులుబాటు ఉంటుంది. ఈ మొత్తాన్ని టెండరులోని మెటీరియల్ కాంపొనెంట్‌ను లెక్కించి దానిపై 14 శాతం అదనంగా చెల్లిస్తారు. దీనికి ట్రాన్స్‌కో అధికారులు అప్పట్లో చెప్పిన కారణమే చిత్రంగా ఉంది. టెండరులో పాల్గొనే కాంట్రాక్టర్ల మధ్య ఆరోగ్యకర పోటీకి, ప్రాజెక్టు నిర్మాణ పనులు సజావుగా సాగేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. 2020లో అప్పటి వైసీపీ ప్రభుత్వం ఈ ఉత్తర్వులు కాంట్రాక్టర్లకు లబ్ధి చేకూర్చేలా ఉన్నాయని పేర్కొంటూ వాటి అమలును నిలిపివేసింది. నిధులను స్వాహా చేయడం, పక్కదారి పట్టించడంలో ఆరితేరిన వైసీపీ సర్కారే పక్కన పెట్టిన ఈ ఉత్తర్వులను.. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో అధికారులు దుమ్ము దులిపి బయటకు తీశారు. 2013 నాటి సీవోపీ ఉత్తర్వులను మళ్లీ అమలు చేయాలని నిర్ణయించారు. ఈ నెల 7న ట్రాన్స్‌కో అధికారులు ఈ మేరకు ట్రాన్స్‌మిషన్ ఆఫీసు ఆర్డర్(టీవోవో) 3775ని జారీ చేశారు.

కాంట్రాక్టర్లు అడిగారని ఇచ్చేశారట!

కాంట్రాక్టర్స్ ఓవర్‌హెడ్స్ అండ్ ప్రాఫిట్స్(సీవోపీ) ఉత్తర్వులను మళ్లీ తెరపైకి తీసుకురావడానికి ఇప్పుడు ట్రాన్స్‌కో అధికారులు చెప్పిన కారణం మరీ చిత్రంగా ఉంది. ఏపీ ట్రాన్స్‌కో కాంట్రాక్టర్స్ అసోసియేషన్ విజ్ఞప్తి మేరకు 2013 నాటి సీవోపీ ఉత్తర్వులను పునరుద్ధరించాలని బోర్డులో నిర్ణయం తీసుకున్నామని ట్రాన్స్‌కో తన ఉత్తర్వులో పేర్కొనడం గమనార్హం. తమ నిర్ణయాన్ని సమర్థించుకుంటూ మరో అడ్డగోలు వాదనకూ ట్రాన్స్‌కో తెరదీసింది. తమ నిర్ణయం వల్ల టెండర్లలో ఎక్సెస్ కోట్ చేయడం తగ్గుతుందని పేర్కొంది. కానీ వాస్తవానికి ఈ ఉత్తర్వులు అమల్లో ఉన్న సమయంలోనే కాంట్రాక్టర్లు టెండర్లలో భారీ మొత్తంలో ఎక్సెస్ కోట్ చేశారు. ఉత్తర్వులు రద్దయిన సమయంలో పిలిచిన టెండర్లలో ఒకటి రెండు టెండర్లు మినహా ఎక్కడా ఎక్సెస్ కోట్ చేసిన దాఖలాల్లేవు.

ప్రభుత్వానికి నష్టమెంత..?

ట్రాన్స్‌కో ఆధ్వర్యంలో లైన్లు, ఎర్త్ ఫ్లాట్స్, సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు చేస్తుంటారు. ఏటా సుమారు రూ.3 వేల కోట్ల వరకు పనులకు టెండర్లు పిలుస్తుంటారు. ఈ పనుల్లో 70 శాతం వరకు అంటే.. సుమారు రూ.2100 కోట్ల వరకు మెటీరియల్ కాంపోనెంట్ ఉంటుంది. సీవోపీ ఉత్తర్వులను ట్రాన్స్‌కో పునరుద్ధరించడం వల్ల.. దీనిపై 14 శాతం అంటే రూ.290 కోట్లు, దానిపై జీఎస్టీ కలిపితే మొత్తం రూ.300 కోట్ల పైచిలుకు కాంట్రాక్టర్లకు అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. ఇదంతా ప్రభుత్వంపై భారమే. ఒకసారి కామన్ స్టాండర్డ్ షెడ్యూల్ రేట్స్ (సీఎస్ఎస్ఆర్)లో నిర్ణయించిన ధరల ఆధారంగా పిలిచిన టెండర్లకు అదనంగా 14 శాతం చెల్లిస్తామని పేర్కొంటూ ఉత్తర్వులు ఇవ్వడం ఏమిటనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రస్తుతం రాజధాని పరిధిలోనే సుమారు రూ.2 వేల కోట్ల వరకు విద్యుత్తు పనులు జరుగుతున్నాయి. కొద్ది రోజుల్లో ప్రకాశం జిల్లాలో ఓ ప్రైవేటు కంపెనీ ఏర్పాటు చేస్తున్న సోలార్ పవర్ ప్లాంట్‌కు 900 మెగా వోల్ట్ యాంపియర్స్(ఎంవీఏ) ఎక్స్‌ట్రా హైటెన్షన్ విద్యుత్తు లైన్లు వేసేందుకు రూ.1382.97 కోట్లకు టెండర్లు పిలవనున్నారు. దీనికి ఇప్పటికే పరిపాలనా ఆమోదం ఇచ్చారు. విద్యుత్తు పనుల్లో టెండర్లు దక్కించుకున్న.. త్వరలో టెండర్లలో పాల్గొనే కాంట్రాక్టర్లకు లబ్ధి చేకూర్చేందుకే ట్రాన్స్‌కో హడావిడిగా సీవోపీ ఉత్తర్వులను మళ్లీ తెరపైకి తెచ్చి ఆమోదం తెలిపిందనే ఆరోపణలు వస్తున్నాయి. ప్రభుత్వానికి వందల కోట్ల రూపాయల నష్టాన్ని కలిగించే ఇలాంటి నిర్ణయం తీసుకోవడం వెనుక 'ఉన్నత' స్థాయి మంత్రాంగమే పనిచేసిందని సమాచారం. ఉన్నత స్థాయి ఒత్తిళ్ల కారణంగానే ఆగమేఘాలపై ఈ ఉత్తర్వులకు ట్రాన్స్‌కో బోర్డు ఆమోదం తెలిపిందని చెబుతున్నారు.

పాక్ పోలీసు శిక్షణ కేంద్రంపై తాలిబన్ల దాడి

- ఏడుగురు పోలీసుల మృతి.. మసీదు ఇమాం కూడా..
- ఎదురుకాల్పుల్లో ఆరుగురు ఉగ్రవాదుల హతం

పెషావర్, అక్టోబరు 11: పాకిస్థాన్‌లోని పోలీసు శిక్షణ కేంద్రంపై తాలిబన్లు జరిపిన దాడిలో ఏడుగురు పోలీసులు మరణించగా, మరో 13 గాయపడ్డట్టు శనివారం ఆర్మీ వర్గాలు తెలిపాయి. ఆ కేంద్రంలోని మసీదుపై ఉగ్రవాదులు గ్రనేడ్లు విసరడంతో అక్కడ పనిచేసే ఇమాం ప్రాణాలు కోల్పోయారు. ఎదురు కాల్పుల్లో ఆరుగురు ఉగ్రవాదులు కూడా హతమయ్యారు. ఖైబర్ పంఖ్తూన్‌ఖ్వా ప్రావిన్స్‌లోని డేరా ఇస్మాయిల్ పోలీసు ట్రైనింగ్ సెంటర్‌పై శుక్రవారం అర్ధరాత్రి నిషేధిత తెహరీక్ ఎ తాలిబన్ పాకిస్థాన్ (టీటీపీ)కి చెందిన సభ్యులు దాడి చేశారు. 7-8 మంది ఉగ్రవాదులు భారీ ఆయుధాలతో వచ్చి కాల్పులు జరిపినట్టు సైనిక వర్గాలు తెలిపాయి. పేలుడు పదార్థాలు నింపిన ట్రక్‌లో వచ్చి మెయిన్ గేటు ద్వారా శిక్షణ కేంద్రంలోకి ప్రవేశించినట్టు పేర్కొన్నాయి. అనంతరం ఆ ట్రక్కును పేల్చివేశారని తెలిపాయి. ఈ పేలుడు కారణంగా ఒక పోలీసు మరణించగా, అనంతరం జరిగిన కాల్పుల్లో మరో ఆరుగురు చనిపోయినట్టు వివరించాయి. దాదాపు అయిదు గంటల పాటు సాగిన ఎదురు కాల్పుల్లో ఆరుగురు ఉగ్రవాదులు హతమయ్యారు. ఇదిలా ఉండగా, పాలస్తీనాకు అనుకూలంగా పాకిస్థాన్‌లో శనివారం జరిగిన ప్రదర్శన హింసాత్మకంగా మారింది. పోలీసులు జరిపిన కాల్పుల్లో 11 మంది మరణించగా, 50మందికిపైగా గాయపడ్డారు. తీవ్రవాద భావజాలం ఉన్న ఇస్లామిస్ట్ గ్రూపు తెహరీక్ ఐ లబ్బాయిక్ పాకిస్థాన్ (టీఎల్‌పీ) పాలస్తీనాకు మద్దతు ప్రకటిస్తూ, గాజాలో హింసను వ్యతిరేకిస్తూ పంజాబ్ ప్రావిన్స్‌లోని లాహోర్‌లో ప్రదర్శన నిర్వహించింది. లాహోర్ నుంచి ఇస్లామాబాద్‌కు ఊరేగింపుగా వెళ్లాలని కూడా ప్రతిపాదించింది. అయితే ఇస్లామాబాద్ యాత్ర ప్రయత్నాన్ని పంజాబ్ పోలీసులు అడ్డుకోవడంతో హింస చెలరేగింది.

బిహార్‌లో 100సీట్లలో పోటీకి ఎంఐఎం రెడీ

పట్నా, అక్టోబరు 11: వచ్చేనెలలో జరిగే బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో 100 సీట్లలో పోటీ చేస్తామని ఎంఐఎం ప్రకటించింది. ఆర్జేడీ, కాంగ్రెస్ పార్టీలతో కూడిన మహా ఘట్‌బంధన్ (ఇండీ కూటమి) తిరస్కరణతో తాము ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎంఐఎం బిహార్ రాష్ట్ర అధ్యక్షుడు అక్తరుల్ ఇమాన్ శనివారం పీటీఐకి చెప్పారు. 2020 ఎన్నికల్లో పోటీ చేసిన సీట్ల కంటే ఐదు రెట్లు ఎక్కువ. బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే, ఆర్జేడీ- కాంగ్రెస్‌లతో కూడిన మహాఘట్‌బంధన్ కూటములకు ప్రత్యామ్నాయంగా భావసారూప్య పార్టీలతో కలిసి తృతీయ కూటమి ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. 2020 ఎన్నికల్లో లౌకిక ఓట్లను చీల్చిందని తమ పార్టీపై ఆరోపణలు చేసిన మహాఘట్‌బంధన్‌కు ఇక ఆ అవకాశం లేదని అక్తరుల్ ఇమాన్ తెలిపారు. ఎన్నికల బంధానికి సిద్ధమని ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్, తేజస్వీలకు లేఖ రాసినా ప్రతిస్పందన రాలేదన్నారు.

ఎయిరిండియా డ్రీమ్‌లైనర్లను తనిఖీ చేయండి

- మంత్రి రామ్మోహన్ నాయుడుకు పైలెట్ల సంఘం లేఖ

న్యూఢిల్లీ, అక్టోబరు 11: బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్స్‌లో ఇటీవల కాలంలో వరుసగా తలెత్తిన రెండు సాంకేతిక సమస్యల నేపథ్యంలో ఎయిర్ ఇండియా నడుపుతున్న ఆ శ్రేణి విమానాలన్నింటినీ నిలిపివేయాలని ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ పైలెట్స్(ఫిప్) కోరింది. ఈమేరకు పౌర విమానయాన శాఖ మంత్రి కే రామ్మోహన్ నాయుడుకు లేఖ రాసింది. దీనిపై ఎయిర్ ఇండియా సంస్థ స్పందించింది. జరిగిన సంఘటనలకు ఎలక్ట్రికల్ వ్యవస్థలో లోపాలు కారణం కాదని స్పష్టం చేసింది. ఫిప్.. 5,000 మంది పైలెట్లకు ప్రాతినిధ్యం వహిస్తున్న సంస్థ. మంత్రికి రాసిన లేఖలో 2 సంఘటనలను ఆ సంస్థ పేర్కొంది. వియన్నా నుంచి ఢిల్లీ వస్తున్న ఏఐ154 విమానాన్ని అక్టోబరు 9న అత్యవసర పరిస్థితుల్లో దుబాయ్‌కి మళ్లించారు. ఈ విమానంలో హఠాత్తుగా ఆటో పైలట్ వ్యవస్థ విఫలమయింది. దీని వల్ల ఇన్‌స్ట్రుమెంట్ ల్యాండింగ్ సిస్టమ్, ఫ్లైట్ డైరెక్టర్ వ్యవస్థల్లో లోపాలు తలెత్తాయి. దీంతో పైలెట్లు ఆ రాత్రివేళ ఎలాంటి ఆటోమేటెడ్ వ్యవస్థ సహాయం లేకుండా విమానాన్ని నడపాల్సి వచ్చిందని ఫిప్ పేర్కొంది. అలాగే దీనికి ముందు అక్టోబరు 4న అమృత్‌సర్ నుంచి బర్మింగ్‌హామ్ వెళ్తున్న ఏఐ117లో అత్యవసర పవర్ సోర్స్ 'రాట్ యాక్టివేట్ అయింది. జూన్‌లో జరిగిన ఘోర విమాన ప్రమాదంలో 260 మంది దుర్మరణం పాలయిన ఘటన తరువాత జరిగిన పై రెండు విషయాలనూ తక్కువ చేసి చూడకూడదని ఫిప్ నొక్కి చెప్పింది. డ్రీమ్ లైనర్ విమానాలను వెంటనే నిలిపివేసి తక్షణమే క్షుణ్ణంగా ఎలక్ట్రికల్, ఆటోమేషన్ వ్యవస్థలపై ఆడిటింగ్ నిర్వహించాలని కోరింది. అలాగే ఎయిర్ ఇండియా ఆపరేషన్స్‌పై డీజీసీఏ ప్రత్యేక ఆడిట్ నిర్వహించాలని విజ్ఞప్తి చేసింది. ఫిప్ లేఖపై ఎయిర్ ఇండియా స్పందించింది. 'ఎలాంటి అత్యవసర పరిస్థితి ఏర్పడకుండా రాట్ యాక్టివేట్ కావడం వ్యవస్థ లోపమో లేక పైలట్ తప్పిదమో కాదు. సాంకేతిక సమస్యతోనే ఏఐ154ను దారి మళ్లించాం. అయితే విమానం క్షేమంగా ల్యాండ్ అయింది. ఎలాంటి అత్యవసర పరిస్థితి ఏర్పడకుండానే రాట్ యాక్టివేట్ కావడం ఇతర విమానాల్లోనూ గతంలో జరిగిన విషయాన్ని బోయింగ్ నిర్ధారించింది. క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించిన తరువాత ఆ విమానాన్ని ప్రయాణానికి అనుమతించాం. ఆ నివేదికను డీజీసీఏకి సమర్పించాం. పైలెట్ల, ప్రయాణికుల భద్రతే మాకు అత్యంత ముఖ్యం' అని ఎయిర్ ఇండియా పేర్కొంది.

టీసీఎస్‌లో 19,755 ఉద్యోగాలకు కోత!

న్యూఢిల్లీ, అక్టోబరు 11: దేశంలోనే అతిపెద్ద ఐటీ సేవల కంపెనీ టీసీఎస్ గతంలో ఎన్నడూ లేనంతగా ఉద్యోగాల్లో కోతలు చేపట్టింది. సెప్టెంబరు 30తో ముగిసిన త్రైమాసికంలో 19,755 మంది ఉద్యోగులను టీసీఎస్ తగ్గించుకుంది. వీరిలో స్వచ్ఛందంగా ఉద్యోగాన్ని వదిలేసిన వారితో పాటు తొలగింపులకు గురైనవారు ఉన్నారు. దీంతో 2022 తర్వాత తొలిసారిగా ఈ సంస్థలో ఉద్యోగుల సంఖ్య 6 లక్షల కంటే దిగువకు పడిపోయింది. తొలగించిన ఉద్యోగులకు పరిహారం చెల్లింపుల కోసం కంపెనీ రూ.1,135 కోట్లను కేటాయించింది. భవిష్యత్తు అవసరాలకు తగినట్టుగా ఏఐ, మెషిన్ లెర్నింగ్, డేటా అనలటిక్స్ వంటి నైపుణ్యాలు కలిగిన ప్రతిభావంతుల నియామకాలను కొనసాగిస్తామని సంస్థ పేర్కొంది.

లాలూ నామినేషన్ వేసెన్!

- కాకుంటే ఆయన ఆర్జేడీ అధినేత కాదు!!

పట్నా, అక్టోబరు 11: బిహార్ అసెంబ్లీ ఎన్నికలకు నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కావడంతో తొలిరోజు నామినేషన్లు దాఖలు చేసిన అతికొద్ది మందిలో లాలూ ప్రసాద్ యాదవ్ కూడా ఉన్నారు. అయితే, ఈయన ఆర్జేడీ అధినేత కాదు. 45 ఏళ్ల వయసున్న ఈ లాలూ ప్రసాద్ యాదవ్ సరన్ జిల్లాలోని జాజో రహీంపూర్ గ్రామంలో నివసిస్తున్నారు. శుక్రవారం ఈయన మర్హౌరా అసెంబ్లీ నియోజకవర్గం నుంచి నామినేషన్ దాఖలు చేశారు. ఆసక్తికరంగా ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ 1977లో తొలిసారిగా పార్లమెంటు ఎన్నికల్లో పోటీ చేసిన సరన్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోనే మర్హౌరా నియోజకవర్గం ఉంది. శుక్రవారం నామినేషన్ దాఖలు చేసిన లాలూ ప్రసాద్ యాదవ్‌ను 'ధర్తీ ప్రసాద్ ఆఫ్ బిహార్' అని కూడా పిలుస్తుంటారు. 2001లో తొలిసారిగా వార్డు కౌన్సిలర్ ఎన్నికల్లో పోటీ చేశానని ఆయన గుర్తుచేసుకున్నారు. 2014 లోక్‌సభ ఎన్నికల్లో రబ్రీ దేవిపై కూడా తాను పోటీ చేశానని ఆయన గర్వంగా చెబుతున్నారు. 2017, 2022 రాష్ట్రపతి ఎన్నికల్లోనూ ఈయన నామినేషన్లు దాఖలు చేయగా, అవి తిరస్కరణకు గురయ్యాయి. ఈయన స్వతంత్ర అభ్యర్థి కాదు. జన్ సంభావన పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నానంటూ తన అఫిడవిట్‌ను ఈ సందర్భంగా విలేకరులకు చూపించారు. ఈ పార్టీ గురించి ఎవరికీ పెద్దగా తెలియకపోవడం గమనార్హం.

చైనాపై మరో 100% సుంకాలు

- ఇప్పటికే ఉన్న 30 శాతానికి అదనం
- వచ్చే నెల 1వ తేదీ నుంచి అమల్లోకి..
- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటన



వాషింగ్టన్, అక్టోబరు 11: రెండోసారి అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ సుంకాలు, ఆంక్షలు అంటూ కలకలం రేపుతున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. మరోసారి చైనాపై విరుచుకుపడ్డారు. పలు వాణిజ్య అంశాల్లో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తోందంటూ.. చైనాపై 100శాతం అదనపు సుంకాలు విధిస్తున్నట్టు ప్రకటించారు. ఈ మేరకు ట్రూత్ సోషల్‌లో పోస్టు పెట్టారు. "నవంబర్ 1 నుంచి చైనాపై 100శాతం సుంకాలు విధిస్తాం. ఇప్పటికే ఉన్న సుంకాలకు ఇది అదనం. చైనా ప్రతిస్పందించే తీరును బట్టి ఈ సుంకాల్లో మార్పు ఉండొచ్చు. అంతేకాదు.. నవంబర్ 1 నుంచి అమెరికా నుంచి చైనాకు జరిపే అన్ని రకాల కీలక సాఫ్ట్‌వేర్ల ఎగుమతులపై నియంత్రణలు విధిస్తాం. చైనా నుంచి వచ్చే అన్ని రకాల ఉత్పత్తులతోపాటు విదేశాల నుంచి అమెరికాకు వచ్చే చైనా ఉత్పత్తులకూ ఈ సుంకాలు, ఆంక్షలు వర్తిస్తాయి. చైనా నుంచి జరిగే కీలకమైన ఉత్పత్తుల సరఫరాపై నియంత్రణలు విధించేందుకు ఆ దేశం సిద్ధమైనట్టు తెలిసింది. అది నైతికంగా అవమానకర ప్రవర్తన" అని ట్రంప్ పేర్కొన్నారు. ఒకవేళ చైనా ప్రతీకార చర్యలకు దిగితే మరింత కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు.

అరుదైన ఖనిజాలేంటి?

అమెరికా సహా ప్రపంచవ్యాప్తంగా టెక్, రక్షణ, ఎలక్ట్రానిక్ కంపెనీలకు అత్యవసరమైన అరుదైన ఖనిజాలు, వాటితో రూపొందించే సహజ అయస్కాంతాలు చాలా వరకు చైనా నుంచే సరఫరా అవుతాయి. ఎల్‌ఈడీ లైట్లు, టీవీలు, ఎలక్ట్రిక్ వాహనాల బ్యాటరీల నుంచి యుద్ధ విమానాలు, జలంతర్గాములు, లేజర్లు, ఉపగ్రహాలు, క్షిపణుల తయారీ వరకు ఆ ఖనిజాలు కావాలి. అంటే అమెరికా ఆయుధ, టెక్ కంపెనీలకు ఇవి తప్పనిసరి. ఇంత కీలకమైన అరుదైన ఖనిజాల ఉత్పత్తి, ప్రాసెసింగ్‌లో 90శాతం వరకు చైనాలోనే జరుగుతుంది. ఈ రంగంలో ఉన్న పట్టుతోనే అమెరికాను కూడా చైనా ఆటాడిస్తోంది. మరోవైపు చైనా టెక్ కంపెనీలకు కీలకమైన కంప్యూటర్ చిప్స్ చాలా వరకు అమెరికా నుంచే అందుతాయి. ఈ ఏడాది ఏప్రిల్‌లో చైనా, అమెరికా ఏదో వేలం వేసినట్టుగా పరస్పరం 200శాతం దాకా టారిఫ్‌ల ప్రకటనలు చేసిన విషయం తెలిసిందే. ఆ సమయంలో అమెరికా చిప్స్ కోసం చైనా, చైనా ఖనిజాల కోసం అమెరికా దిగివచ్చాయి. కానీ చైనా ఇటీవల మళ్లీ అరుదైన ఖనిజాల ఎగుమతులపై నియంత్రణలు విధించింది. ఇది ట్రంప్‌కు ఆగ్రహం తెప్పించింది. ఈ క్రమంలో దక్షిణ కొరియాలో జరగనున్న ఏపీఈసీ సమావేశంలో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో భేటీని రద్దు చేసుకునే అవకాశం ఉందంటూ ట్రంప్ ముందుగానే సంకేతాలు ఇచ్చారు. తర్వాత టారిఫ్‌లపైనా ప్రకటన చేశారు. ప్రస్తుతం చైనాపై అమెరికా 30శాతం సుంకాలు అమలు చేస్తోంది. తాజాగా ట్రంప్ చేసిన ప్రకటన అమల్లోకి వస్తే సుంకాలు 130శాతానికి చేరుతాయి. తొలుత భారత్‌పై 25శాతం సుంకాలు విధించిన ట్రంప్ తర్వాత.. రష్యా నుంచి చమురు కొంటోందంటూ మరో 25శాతం పెంచి 50శాతం చేశారు. ఇలా అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలపై అడ్డగోలు సుంకాలు విధించడం ప్రపంచవ్యాప్తంగా వాణిజ్యపరంగా గందరగోళానికి తెరలేపింది.

ఎఫ్‌డీఏ అధికారుల నిర్లక్ష్యం వల్లే..!

- శ్రీసన్ ఫార్మాపై టీఎన్‌ఎఫ్‌డీఏ తనిఖీలే చేయలేదు
- పదేళ్లకు పైగా ఆ కంపెనీ ఛాయలకే పోని అధికారులు
- సీడీఎస్‌సీఓ విచారణలో తీవ్ర లోపాల వెల్లడి

చెన్నై, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): దగ్గు మందు మరణాలకు తమిళనాడు అధికారుల నిర్లక్ష్యమే కారణమని కేంద్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. మధ్యప్రదేశ్‌లో చిన్నారుల మృతికి కారణమైన కాంచీపురం కేంద్రంగా పనిచేసే కోల్డ్‌రిఫ్ దగ్గు మందు తయారీ సంస్థపై జరిపిన విచారణలో తమిళనాడు ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్(టీఎన్‌ఎఫ్‌డీఏ) లో పాలు బయటపడినట్లు సెంట్రల్ డ్రగ్ స్టాండర్డ్ కం ట్రోల్ ఆర్గనైజేషన్ (సీడీఎస్‌సీఓ) వర్గాలు పేర్కొన్నా యి. సదరు కంపెనీపై నిఘా పెట్టడంలో, మందుల తయారీకి అవసరమైన విధివిధానాలు పాటిస్తున్నా రా అని తనిఖీ చేయడంలో టీఎన్‌ఎఫ్‌డీఏ ఘోరం గా విఫలమైనట్లు విచారణలో వెల్లడైంది. 2011లో లైసెన్స్ పొందిన శ్రీసన్ ఫార్మా కంపెనీ కాంచీపురం జిల్లా సుంకువారిసత్రంలో ఉంది. ఆ కంపెనీలో మందుల తయారీకి అవసరమైన కనీస సదుపాయాలు కూడా లేవు. పదేళ్లకు పైగా రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఎఫ్‌డీఏ అధికారులు ఆ కంపెనీ ఛా యలకు కూడా వెళ్లలేదని, ఎలాంటి తనిఖీలు చేపట్టలేదని సీడీఎస్‌సీఓ వర్గాలు పేర్కొన్నాయి. ఆ కంపెనీకి సంబంధించిన ఏ ఆడిట్‌లోనూ సీడీఎస్‌సీఓ పాల్గొనలేదు. ఓ వైపు సీడీఎస్‌సీఓ ప్రమేయం లేకపోవడం.. మరో వైపు రాష్ట్ర ఎఫ్‌డీఏ ఆ కంపెనీ లోపాలను తెలియజేయకపోవడం వల్లే దగ్గుమందు త యారీలో లోపాలు చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది.

నిబంధనలు బేఖాతరు.. సీడీఎస్‌సీఓ అనుమతి పొందిన అన్ని రకాల మందులను డేటాబేస్‌లో పొందుపరచాలన్న నిబంధనలను శ్రీసన్ ఫార్మా పాటించలేదని, సుగమ్ పోర్టల్‌లో తమ ఉత్పత్తుల వివరాలను అప్‌లోడ్ చేయలేదని దర్యాప్తు వర్గాలు చెబుతున్నాయి. ఎఫ్‌డీఏ అక్టోబర్ 1, 2 తేదీల్లో మధ్యప్రదేశ్‌లోని అనుబంధ సంస్థ కోరిక మేరకు శ్రీసన్ ఫార్మాలో ఆడిట్ నిర్వహించింది. ఆ వివరాలను సీడీఎస్‌సీఓ జోనల్ కార్యాలయానికి కూడా పంపలేదని ఆ సంస్థ ఆరోపించింది.

పశ్చిమ బెంగాల్‌లో వైద్య విద్యార్థినిపై గ్యాంగ్ రేప్

కోల్‌కతా, అక్టోబరు 11 : పశ్చిమ బెంగాల్‌లో మరో ఘోరం జరిగింది. ఒడిశాకు చెందిన ఒక వైద్య విద్యార్థినిని పశ్చిమ బర్ధమాన్ జిల్లాలో గుర్తుతెలియని వ్యక్తులు గ్యాంగ్ రేప్ చేసినట్లు పశ్చిమ బెంగాల్ పోలీసులు శనివారం తెలిపారు. దుర్గాపూర్‌లోని ఓ ప్రైవేటు వైద్య కళాశాలలో రెండో సంవత్సరం వైద్య విద్య చదువుతోన్న విద్యార్థిని శుక్రవారం రాత్రి తన స్నేహితుడితో కలిసి భోజనానికి క్యాంపస్ బయటకు రాగా ఈ ఘటన చోటు చేసుకుంది. ఒడిశాలోని జలేశ్వర్‌కు చెందిన ఆమె అదే కళాశాల ఆస్పత్రిలో చికిత్స పొందుతోందని పోలీసులు పేర్కొన్నారు. వైద్య విద్యార్థిని శుక్రవారం రాత్రి 8-8.30 గంటల మధ్య తన స్నేహితుడితో కలిసి వైద్య కళాశాల బయటకు వచ్చినట్లు పోలీసులు విచారణలో గుర్తించారు. ఆ సమయంలో ముగ్గురు గుర్తుతెలియని యువకులు వారి వద్దకు వచ్చారు. దీంతో ఆమె స్నేహితుడు ఆమెను ఒంటరిగా వదిలి వెళ్లిపోయాడు. అనంతరం ఆ ముగ్గురు ఆమె ఫోన్ లాక్కుని క్యాంపస్ బయట ఉన్న అడవిలోకి లాక్కు వెళ్లి గ్యాంగ్‌రేప్ చేశారు. పశ్చిమ బెంగాల్‌లోనే గత ఏడాది ఆగస్టులో ప్రభుత్వ ఆర్జీకార్ మెడికల్ కళాశాలలోనే వైద్యురాలిని రేప్ చేసి హత్య చేశారు. ఈ ఏడాది జూన్‌లో దక్షిణ కోల్‌కతాలోని లా కళాశాలలో న్యాయ విద్యార్థినిని ముగ్గురు గ్యాంగ్ రేప్ చేశారు. రెండు నెలల క్రితం జోకాలోని ప్రతిష్ఠాత్మక ఐఐఎం మెన్స్ హాస్టల్‌లో మేనేజ్‌మెంట్ విద్యార్థినిని రేప్ చేశారు.

వాట్సప్ లేకుంటే అరట్టై ఉందిగా!

- సుప్రీంకోర్టు వ్యాఖ్య

న్యూఢిల్లీ, అక్టోబరు 11: వాట్సప్ బదులుగా స్వదేశీ యాప్ అయిన అరట్టైను ఉపయోగించుకోవచ్చని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. తన ఖాతాను వాట్సప్ బ్లాక్ చేసిందని, దాన్ని పునరుద్ధరించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ ఓ వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌ను తిరస్కరిస్తూ ఈ వ్యాఖ్య చేసింది. ఓ పాలీ డయాగ్నిక్ సెంటర్‌లో పనిచేస్తున్న ఆ వ్యక్తి గత 10-12 ఏళ్లుగా వాట్సప్ ద్వారా తన ఖాతాదార్లకు సమాచారం పంపిస్తున్నాడు. ఉన్నట్టుండి వాట్సప్ తన ఖాతాను బ్లాక్ చేయడంతో ఇబ్బంది కలుగుతోందని పేర్కొంటూ 32వ అధికరణం కింద సుప్రీంకోర్టులో పిటిషన్ వేశాడు. దీనిపై అసహనం వ్యక్తం చేసిన ధర్మాసనం.. సమాచారం అందజేయడానికి స్వదేశీ యాప్ అరట్టై ఉంది కదా, దాన్ని ఉపయోగించుకోవచ్చని సూచించింది.

దేశంలో తగ్గుతున్న జననాలు!

- 2023లో 2లక్షలకు పైగా తగ్గిన రిజిస్ట్రేషన్లు

న్యూఢిల్లీ, అక్టోబరు 11: దేశంలో జననాల నమోదు సంఖ్య తగ్గుముఖం పట్టింది. 2023లో నమోదైన జననాల సంఖ్య 2022తో పోలిస్తే రెండు లక్షలకుపైగా తగ్గింది. గత ఐదేళ్లలో ఇలా జననాల నమోదు తగ్గడం ఇది మూడోసారి. అదే సమయంలో మరణాల రిజిస్ట్రేషన్ స్వల్పంగా పెరిగింది. కేంద్ర హోం వ్యవహారాల శాఖ పరిధిలోని రిజిస్ట్రార్ ఆఫ్ ఇండియా (ఆర్‌జీఐ) విడుదల చేసిన సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ (సీఆర్‌ఎస్) నివేదిక 2023లో ఈ వివరాలను వెల్లడించారు. ఆ నివేదిక ప్రకారం.. 2023లో దేశవ్యాప్తంగా 25.2 మిలియన్ (దాదాపు 2 కోట్ల 52 లక్షలు) జననాలు నమోదయ్యాయి. ఇది అంతకుముందు సంవత్సరం (2022) కంటే 0.9% (2,32,094) తక్కువ. దేశంలో సంతానోత్పత్తి రేటు తగ్గుముఖం పడుతున్నదనడానికి ఇది సంకేతమని భావిస్తున్నారు. మరోవైపు, కొవిడ్-19 మహమ్మారి ముగిసిన తర్వాత కూడా మరణాల సంఖ్య స్వల్పంగా పెరిగింది. 2023లో మొత్తం 8.7 మిలియన్ (దాదాపు 87 లక్షలు) మరణాలు రిజిస్టర్ కాగా, ఇది 2022లో కంటే 9,749 (0.1%) ఎక్కువ. మరణాల సంఖ్య దాదాపు స్థిరంగా ఉన్నట్లు నివేదిక స్పష్టం చేసింది. ఆస్పత్రులు, ఆరోగ్య కేంద్రాల్లో జరిగే ప్రసవాల శాతం తగ్గింది. ఇది 2022లో 75.5% ఉండగా, 2023లో 74.7%కి పడిపోయింది. కొవిడ్‌కు ముందు ఇది 80 శాతం కంటే ఎక్కువగా ఉండేది. మరోవైపు, అత్యవసర సమయంలో సరైన వైద్య సహాయం అందక మరణించే వారి సంఖ్య కూడా పెరుగుతోంది. 2022లో 50.7% ఉన్న మరణాల శాతం 2023లో ఏకంగా 53.4 శాతానికి పెరిగింది. కొవిడ్‌కు ముందు ఇది 40 శాతం లోపే ఉండేది.

అఫ్ఘాన్ మంత్రి ప్రెస్‌మీట్‌లో మహిళా జర్నలిస్టులకు

నో ఎంట్రీపై విపక్షాల మండిపాటు

- మహిళల పక్షాన నిలబడలేనంత బలహీనులా?
- ప్రధాని మోదీ మౌనంపై రాహుల్ గాంధీ ధ్వజం
- తీవ్ర అవమానం: మహువా

న్యూఢిల్లీ, అక్టోబరు 11: భారత పర్యటనకు వచ్చిన అఫ్ఘానిస్థాన్ విదేశాంగమంత్రి అమీర్ ఖాన్ ముత్తాఖీ ఢిల్లీలో నిర్వహించిన విలేకరుల సమావేశానికి మహిళా జర్నలిస్టులను ఆహ్వానించకపోవడంపై ప్రతిపక్ష పార్టీలు భగ్గుమన్నాయి. శుక్రవారం విదేశాంగమంత్రి ఎస్.జైశంకర్‌తో చర్చలు జరిపిన అనంతరం ముత్తాఖీ.. ఢిల్లీలోని అఫ్ఘానిస్థాన్ రాయబార కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. కేవలం పురుష జర్నలిస్టులనే ఆ సమావేశానికి ఆహ్వానించారు. దీంతో మహిళలను అవమానించారంటూ ఈ ఘటనపై ప్రతిపక్షాలు మండిపడ్డాయి. ఇది ఆమోదయోగ్యం కాదన్నాయి. ఇలాంటి వివక్షపై ప్రధాని మోదీ మౌనం వహించడం ద్వారా నారీ శక్తిని ఒట్టి నినాదంగా మార్చేశారని విమర్శించాయి. మన భూభాగంపై మహిళలను ఎవరైనా ఎలా అవమానిస్తారని కాంగ్రెస్ పార్టీ 'ఎక్స్'లో నిలదీసింది. ఇది తీవ్రమైన వివక్ష అని 'ది ఇండియన్ ఉమెన్స్ ప్రెస్ కార్ప్స్(ఐడబ్ల్యూపీసీ)' అభివర్ణించింది. భవిష్యత్తులో ఇది పునరావృతం కాకుండా అఫ్ఘానిస్థాన్ రాయబార కార్యాలయ అధికారులతో ప్రభుత్వం మాట్లాడాలని కోరింది. 'మిస్టర్ మోదీ.. ఒక బహిరంగ కార్యక్రమానికి మహిళా జర్నలిస్టులను మినహాయించడాన్ని మీరు అనుమతించారు. తద్వారా వారి హక్కుల కోసం నిలబడలేని బలహీనుడినని దేశంలోని ప్రతి మహిళకూ స్పష్టం చేశారు. ఇలాంటి వివక్షపై మీ మౌనం.. నారీ శక్తి ఒట్టి నినాదమేనని తెలియజేస్తోంది' అని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ 'ఎక్స్'లో విమర్శించారు. ఈ అంశంపై ప్రభుత్వ వైఖరిని ప్రధాని మోదీ స్పష్టం చేయాలని లోక్‌సభ సభ్యురాలు ప్రియాంక గాంధీ వాద్రా డిమాండ్ చేశారు. 'మన దేశానికి మహిళే వెన్నెముక. వారే దేశానికి గర్వకారణం. మహిళా హక్కులను మీరు గుర్తించడం ఎన్నికల్లో ప్రచారం వరకే పరిమితమా?' అని ప్రియాంక నిలదీశారు. ఘటనపై మాజీ హోంమంత్రి పి.చిదంబరం దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. 'మహిళా జర్నలిస్టులను ఆహ్వానించలేదని తెలిసినప్పుడు పురుష జర్నలిస్టులు ఆ సమావేశం నుంచి వాకౌట్ చేయాల్సింది' అని చిదంబరం వ్యాఖ్యానించారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవం రోజే మోదీ ప్రభుత్వం ఇలాంటి ఘటనను అనుమతించిందని కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి జైరామ్ రమేశ్ 'ఎక్స్'లో పేర్కొన్నారు. ఈ ఘటనను అనుమతించడం ద్వారా మోదీ ప్రభుత్వం దేశంలోని ప్రతి మహిళనూ అవమానించిందని టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రా మండిపడ్డారు. మోదీ నేతృత్వంలోని బలహీన, విఫల ప్రభుత్వం తాలిబన్లకు లొంగిపోయిందని టీఎంసీ మరో ఎంపీ సాగరికా ఘోష్ విమర్శించారు. ఈ వివాదంపై విదేశాంగ శాఖ స్పందించింది. 'నిన్న ఢిల్లీలో అఫ్ఘాన్ విదేశాంగమంత్రి నిర్వహించిన విలేకరుల సమావేశంలో భారత విదేశాంగశాఖ పాత్ర ఏమీ లేదు' అంటూ శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది.

రోహ్‌తక్ ఎస్పీపై బదిలీ వేటు

- బిజార్ణియాపై హరియాణా ప్రభుత్వం చర్యలు
- ఐపీఎస్ పూరన్ కుమార్ భార్యకు సోనియా లేఖ
- న్యాయ పోరాటంలో అండగా ఉంటానని భరోసా


బిజార్ణియా

న్యూఢిల్లీ/చండీగఢ్, అక్టోబరు 11: తన భర్త సూసైడ్ నోట్‌లో పేర్లు ప్రస్తావించిన అధికారులందరినీ విధుల నుంచి తప్పించాలని, అరెస్టు చేయాలని సీనియర్ ఐపీఎస్ అధికారి పూరన్ కుమార్ భార్య అమనీత్ డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. రోహ్‌తక్ ఎస్పీ నరేంద్ర బిజార్ణియాపై హరియాణా ప్రభుత్వం శనివారం బదిలీ వేటు వేసింది. ఆయన స్థానంలో సురిందర్ సింగ్‌ను నియమిస్తున్నట్లు అధికారిక ఉత్తర్వు పేర్కొంది. బిజార్ణియా పోస్టింగ్ ఆర్డర్‌ను విడిగా జారీచేయనున్నట్లు తెలిపింది. అయితే పూరన్ కుమార్ మృతి కేసును ఇందులో ప్రస్తావించలేదు. మరోవైపు డీజీపీ శత్రుజీత్‌ను కూడా దీర్ఘకాల సెలవుపై పంపాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు సమాచారం. కాగా, పంచకులలో జరిగిన ఓ కార్యక్రమంలో సీఎం నాయబ్ సింగ్ సైనీ మాట్లాడుతూ ఈ కేసులో దర్యాప్తు జరుగుతోందని, దోషులుగా తేలిన వారిపై స్థాయితో సంబంధం లేకుండా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ ఘటను రాజకీయం చేయొద్దని ప్రతిపక్షాలను కోరారు. మానసిక వేధింపులు, కులవివక్ష కారణంగా తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు పూరన్ కుమార్ రాసిన తన సూసైడ్ నోట్‌లో డీజీపీ శత్రుజీత్ కపూర్, రోహ్‌తక్ ఎస్పీ నరేంద్ర బిజార్ణియాతో పాటు పలువురు సీనియర్ ఐపీఎస్ అధికారుల పేర్లను పేర్కొన్నారు.

తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యా..: సోనియా

పూరన్ కుమార్ భార్య అమనీత్‌కు కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ లేఖ రాశారు. పూరన్ ఆత్మహత్య విషయం తనను దిగ్భ్రాంతికి గురిచేసిందని, తీవ్ర బాధ కలిగించిందన్నారు. "న్యాయం కోసం మీరు చేస్తున్న పోరాటంలో కోట్లాది మంది భారతీయులతో పాటు నేను కూడా అండగా ఉంటాను" అని లేఖలో తెలిపారు. మరోవైపు, పూరన్ కుమార్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించేందుకు కుటుంబసభ్యులు ఇంకా సమ్మతి తెలపలేదు. కొన్ని ఫిర్యాదుల కారణంగా ఆయన కుటుంబసభ్యులు పోస్టుమార్టానికి అనుమతి ఇచ్చేందుకు నిరాకరించారని, వాటిని పరిష్కరించేందుకు చర్చలు జరుగుతున్నాయని చండీగఢ్ డీజీపీ చెప్పారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : N.Rahul Kumar,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.